www.trinetnews.com

ట్రైనెట్ తెలంగాణ న్యూస్

నిజం • బాధ్యత • నిబద్ధత

తెలుగు దిన పత్రిక

సంపుటి 01 సంచిక 95 ఎడిటర్ :వెంకటేశ్వర్లు రాపోలు గురువారం నవంబర్ 05, 2026 పేజీలు:12 వెల.10/-

జాలర్లను కాపాడేందుకు వెళ్లి.. గల్లంతైన 11 మంది

ఎస్‌డీఆర్‌ఎఫ్, ఫైర్ సిబ్బంది

సత్తుపల్లి: జాలర్లను కాపాడేందుకు వెళ్లి 11 మంది ఎస్‌డీఆర్‌ఎఫ్, అగ్నిమాపక సిబ్బంది గల్లంతయ్యారు. ఈ ఘటన ఖమ్మం (ఖమ్మంఎఫ్ఐఎ) జిల్లా సత్తుపల్లి మండలం బేతుపల్లిలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. భారీ వర్షాలకు బేతుపల్లి పెద్ద చెరువు అలుగు పారుతుండడంతో చేపలు బయటకు వెళ్లకుండా వలలు ఏర్పాటు చేసేందుకు ఐదుగురు జాలర్లు వెళ్లి వరదలో చిక్కుకున్నారు. వారిని కాపాడేందుకు తొలుత ముగ్గురు ఫైర్ సిబ్బంది బోటులో వెళ్లగా అది మొరాయించడంతో చిక్కుకుపోయారు.





రెండు ఎమ్మెల్సీ స్థానాలపై కాంగ్రెస్ గురి!

– గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మద్దతు కూడగడుతున్న సీఎం రేవంత్

– సీపీఐ, టీజేఎస్ నేతలతో సీఎం వేర్వేరు సమావేశాలు

- కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతివ్వాలని విజ్ఞప్తి
- రెండు స్థానాల్లో కాంగ్రెస్‌కు సీపీఐ మద్దతు ప్రకటన
- టీజేఎస్ నుంచి ఇంకా అధికారిక నిర్ణయం రావాల్సి ఉంది
- హైదరాబాద్--రంగారెడ్డి--మహబూబ్‌నగర్ బరిలో సామ రామ్మోహన్‌రెడ్డి
- నల్గొండ--ఖమ్మం--వరంగల్ బరిలో రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి
- రైతు సమస్యలు, నిరుద్యోగం, ఉద్యోగాలపై సమావేశంలో చర్చ
- ఆరుతడి పంటలకు ప్రోత్సాహకాలు ఇవ్వాలని కోదండరాం సూచన
- ఉద్యోగ ఖాళీల గుర్తింపు, నోటిఫికేషన్లపై సీఎం హామీ

తెలంగాణలో జరగనున్న 2 పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతు కూడగట్టేందుకు సీఎం రేవంత్ రెడ్డి ప్రయత్నాలు ముమ్మరం చేశారు. సీపీఐ, టీజేఎస్ నాయకులతో సమావేశమై.. వారి మద్దతు కోరారు. సామ రామ్మోహన్‌రెడ్డి, రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డికి మద్దతు ఇవ్వాలని ఆ పార్టీలకు విజ్ఞప్తి చేశారు. కూనంనేని సాంబశివరావు నేతృత్వంలోని సీపీఐ రెండు స్థానాల్లో కాంగ్రెస్‌కు మద్దతు ప్రకటించింది. టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం సానుకూలంగా స్పందించినప్పటికీ పార్టీ నిర్ణయం ప్రకటించాల్సి ఉంది.

తెలంగాణలో త్వరలో జరగనున్న రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్ పార్టీ రాజకీయ సమీకరణాలపై దృష్టి సారించింది. ఈ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. తమ మిత్రపక్షాలైన సీపీఐ, తెలంగాణ జన సమితి (టీజేఎస్) నాయకత్వాలను కోరారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ బోధి పెవిలియన్‌లో రెండు పార్టీల నేతలతో సీఎం రేవంత్ రెడ్డి వేర్వేరుగా సమావేశమై ఇదే అంశంపై చర్చించారు.

మిగతాది 2లో

మరో నాలుగు నగరాల్లో ఇందిరమ్మ టవర్లు!

- నిజామాబాద్, వరంగల్, నల్గొండ, కరీంనగర్‌లో నిర్మాణాలు
- రెండు, మూడు రోజుల్లో నోటిఫికేషన్లు
- జీ ప్లస్ 5 అంతస్తుల్లో టవర్ల నిర్మాణం
- అల్పాదాయ కుటుంబాలకు ఇళ్ల కేటాయింపు
- ఇందిరమ్మ ఇళ్లకు ఇప్పటివరకు రూ.22,500 కోట్ల విడుదల
- తొలి విడతలో 4.5 లక్షల ఇళ్ల కేటాయింపు
- ఇప్పటికే 2.21 లక్షల ఇళ్లలో గృహప్రవేశాలు
- రెండో విడతలో మరో 2.5 లక్షల ఇళ్లు
- హైదరాబాద్ కోర్ అర్బన్‌లో లక్ష ఎల్ఐజీ ఫ్లాట్ల నిర్మాణం



2 లో

హైదరాబాద్:
రాష్ట్రంలో మరో నాలుగు నగరాల్లో ఇందిరమ్మ టవర్లు నిర్మించనున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. నిజామాబాద్, వరంగల్, నల్గొండ, కరీంనగర్ కార్పొరేషన్ల పరిధిలో ఇందిరమ్మ టవర్ల నిర్మాణానికి రెండు, మూడు రోజుల్లో నోటిఫికేషన్లు ఇవ్వనున్నట్లు చెప్పారు.

రేవంత్ 'ఈఎంఐ ముఖ్యమంత్రి'

- సీఎం రేవంత్‌పై కేటీఆర్ ఘాటు విమర్శలు
- వారానికి రెండుసార్లు ఢిల్లీ పర్యటనలంటూ ఆరోపణ
- రాష్ట్ర ప్రయోజనాల కంటే రాజకీయాలపైనే దృష్టి
- కాంగ్రెస్, బీజేపీ రెండూ ఒక్కటేనని వ్యాఖ్య
- ఢిల్లీ పార్టీలతో తెలంగాణకు అన్యాయం జరుగుతోందని విమర్శ
- కేంద్రం నుంచి తెలంగాణకు ఏం సాధించారో చెప్పాలని డిమాండ్
- మెట్రో, జాతీయ ప్రాజెక్టులపై బీజేపీని నిలదీత

హైదరాబాద్:
తెలంగాణ రాజకీయాల్లో కాంగ్రెస్, బీజేపీలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఢిల్లీ పార్టీల వల్ల తెలంగాణకు ఎలాంటి న్యాయం జరగదని, కాంగ్రెస్, బీజేపీ రెండూ ఒకటేనని విమర్శించారు. ఢిల్లీ నాయకుల ముందు తెలంగాణ నాయకులు వణుకుతున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ సంచులు మోసే పార్టీ అయితే.. బీజేపీ చెప్పులు మోసే పార్టీ అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఈ రెండు పార్టీలను మరోసారి నమ్మితే తెలంగాణను ఢిల్లీకి లేదా గుజరాత్‌కు అమ్మేస్తారని ఆరోపించారు.



2 లో

ప్రవళిక కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం



2లో..

- కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుంది: మంత్రి పొన్నం
- కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటన
- ప్రవళిక తల్లికి ప్రభుత్వ ఉద్యోగం
- ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని హామీ
- ప్రవళిక మృతదేహానికి మంత్రి నివాళులు
- కుటుంబ సభ్యులకు మంత్రి పరామర్శ
- ప్రవళిక కళ్లను దానం చేసిన కుటుంబ సభ్యులు
- మణుగూరు మినహా రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ సేవలు యథాతథం

అత్తింటిపై అల్లుడి దాడి.. ఇద్దరు మహిళల హత్య!



హైదరాబాద్:
మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం చోటుచేసుకుంది. కుటుంబ కలహాల నేపథ్యంలో సిద్ధిఖ్ తన అత్తింటి కుటుంబంపై కత్తితో దాడి చేశాడు. ఈ ఘటనలో ఇద్దరు మహిళలు ప్రాణాలు కోల్పోయారు. మృతులను అత్త నిరంజన్‌బీ, బావమరిది భార్య రేష్మాగా గుర్తించారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడు పరారీలో ఉన్నాడని, గాలిస్తున్నట్టు తెలిపారు. ఇవాళ ఉదయమే బాధిత కుటుంబ సభ్యులు.. సిద్ధిఖ్ నుంచి తమ ప్రాణాలకు ముప్పు ఉందని, రక్షణ కల్పించాలని కోరుతూ మీర్‌పేట్ పోలీసులను ఆశ్రయించినట్లు సమాచారం.

రూ.400 కోట్ల సైబర్ స్కామ్.. ఈడీ దాడులు!

- అమెరికా పౌరులే లక్ష్యంగా అంతర్జాతీయ సైబర్ మోసాలు
- క్రిప్టో, డిజిటల్ అరెస్ట్ పేరుతో వేలాది మందికి టోకరా
- మాదాపూర్, పాటియాలో ఫేక్ కాల్ సెంటర్ల ఏర్పాటు
- మూడేళ్లుగా కొనసాగుతున్న మోసాల వ్యవహారం
- రూ.400 కోట్ల క్రిప్టో లావాదేవీలపై ఈడీ అనుమానం
- ప్రధాన నిందితులు హర్నిల్ రావల్, ప్రణవ్, చేతన్ అరెస్ట్
- వందల సంఖ్యలో మ్యూల్ బ్యాంకు ఖాతాల వినియోగం
- హవాలా మార్గాల్లో నగదు బదిలీ చేసినట్లు అనుమానం
- భారత్, అమెరికాలో ఈడీ అధికారుల సోదాలు
- మిగతా నిందితులు, ఆర్థిక లావాదేవీలపై కొనసాగుతున్న దర్యాప్తు



2 లో

దేశీ జీపీఎస్‌లో కీలక అడుగు.. నిర్దేశిత కక్ష్యలోకి ఎన్‌వీఎస్-03



2 లో



2లో..

ఎల్‌నినో ఎఫెక్ట్.. హాస్టళ్లు ఖాళీ!

- గ్రేటర్ హైదరాబాద్‌లో తీవ్రతరమవుతున్న నీటి కొరత
- కార్పొరేట్ కాలేజీలు, హాస్టళ్లపై నీటి కష్టాల ప్రభావం
- విద్యార్థులకు సరిపడా నీరు అందక ఇబ్బందులు
- ట్యాంకర్లతోనూ తీరని నీటి అవసరాలు
- విద్యార్థులను ఇళ్లకు పంపిస్తున్న కాలేజీ యాజమాన్యాలు
- కొన్ని కాలేజీలు, హాస్టళ్లకు సెలవుల ప్రకటన
- తల్లిదండ్రులకు సమాచారం.. పిల్లలను తీసుకెళ్లాలని సూచన
- వెలవెలబోతున్న కార్పొరేట్ కాలేజీ క్యాంపస్‌లు
- నీటి సరఫరా ఎప్పుడు మెరుగుపడుతుందోనని ఆందోళన

రైతు భరోసా నిధులు విడుదల సందేశాలపై వ్యవసాయ శాఖ క్లారిటీ



రైతు భరోసా నిధులు విడుదలయ్యాయంటూ కొన్ని జిల్లాల్లో ప్రచారం జరుగుతోంది. నిధులు అకౌంట్లో జమ అయినట్లు రైతులకు బుధవారం (2026 నవంబర్ 4) ఉదయం సందేశాలు వచ్చినట్లు వ్యవసాయ శాఖ దృష్టికి వచ్చింది. దీనిపై వ్యవసాయ శాఖ క్లారిటీ ఇచ్చింది. రైతులకు నిధులు విడుదలైనట్లు వచ్చిన మెసేజ్ లపై విచారణ జరిపారు అధికారులు. దీనిపై సంబంధిత సాంకేతిక సంస్థలతో చర్చించారు. టెక్నికల్ డిపార్ట్మెంట్ తో చర్చించాక.. ఈ మేసేజీలు వ్యవసాయశాఖ ద్వారా రైతులకు వెళ్లలేదని నిర్ధారించారు.

మిగతాది 2లో

ఉమ్మడి ఏపీ శాసనమండలి మాజీ చైర్మన్ చక్రపాణి కన్నుమూత



ట్రైనెట్ తెలంగాణ న్యూస్
నిజం • బాధ్యత • నిబద్ధత
తెలుగు దిన పత్రిక

గురువారం నవంబర్ 05, 2026

www.trinetnews.com

అమెరికన్లే టార్గెట్.. ఫేక్ కాల్ సెంటర్లపై ఈడీ దాడులు.. ముగ్గురి అరెస్ట్

మొదటిపేజీ తరువాయి

అమెరికా పౌరులనే లక్ష్యంగా చేసుకుని క్రిప్టో కరెన్సీ, డిజిటల్ అరెస్ట్ పేరుతో సాగిస్తున్న అంతర్జాతీయ సైబర్ మోసాల వ్యవహారాన్ని హైదరాబాద్ ఈడీ అధికారులు వెలుగులోకి తెచ్చారు. ఫేక్ కాల్ సెంటర్లను ఏర్పాటు చేసి గత మూడేళ్లుగా వేలాది మందిని మోసం చేస్తున్న ముఠా ఆటకట్టించింది. ఈ వ్యవహారంలో దాదాపు రూ.400 కోట్ల మేర క్రిప్టో లావాదేవీలు జరిగినట్లు ఈడీ అధికారులు అనుమానిస్తున్నారు.

హర్షల్ రావల్ నేతృత్వంలోని ముఠా తొలుత హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో ఫేక్ కాల్ సెంటర్ ఏర్పాటు చేసింది. అక్కడి నుంచి అమెరికా పౌరులకు ఫోన్లు చేసి క్రిప్టో కరెన్సీ, డిజిటల్ అరెస్ట్ పేరుతో భయపెట్టి డబ్బులు వసూలు చేసేది. అయితే, మాదాపూర్ కాల్ సెంటర్‌పై దాడులు జరగడంతో నిందితులు తమ మకాంను పంజాబ్‌లోని పాటియాకు మార్చారు. అక్కడ మరో ఫేక్ కాల్ సెంటర్ ఏర్పాటు చేసి మోసాలను కొనసాగించారు.

ఈ కేసులో హర్షిల్ రావల్, ప్రణవ్ పితాదియా, చేతన్ ముంజల్‌ను ఈడీ అధికారులు అరెస్ట్ చేశారు. పాటియాలో మరో ముగ్గురినీ అదుపులోకి తీసుకుని హైదరాబాద్‌కు తీసుకొచ్చారు. వీరి ముఠా ఇప్పటివరకు వేలాది మంది అమెరికా పౌరులను మోసం చేసినట్లు దర్యాప్తులో గుర్తించారు. మోసాల ద్వారా వచ్చిన సొమ్మును తరలించేందుకు వందల సంఖ్యలో మ్యూల్ బ్యాంకు ఖాతాలను ఉపయోగించినట్లు పోలీసులు తేల్చారు.

అలాగే అమెరికా నుంచి క్రిప్టో కరెన్సీ రూపంలో తీసుకున్న డబ్బులను.. హవాలా మార్గాల్లో బదిలీ చేసినట్లుగా ఈడీ అనుమానిస్తోంది. దీంతో ఈ అంతర్జాతీయ మోసాల వ్యవహారంపై అమెరికాతో పాటు భారత్‌లోని పలు ప్రాంతాల్లో అధికారులు సోదాలు నిర్వహించారు. క్రిప్టో లావాదేవీల ద్వారా సుమారు రూ.400 కోట్ల మేర మోసాలకు పాల్పడినట్లు భావిస్తున్నారు.

మరోవైపు, ఈ మోసాల వెనుక ఉన్న ఆర్థిక లావాదేవీలు, ఇతర నిందితుల పాత్రపై ఈడీ దర్యాప్తు కొనసాగిస్తోంది. ఫేక్ కాల్ సెంటర్ల నుంచి విదేశీ పౌరులను లక్ష్యంగా చేసుకుని సాగిన ఈ వ్యవహారంలో వందలాది బ్యాంకు ఖాతాలు, క్రిప్టో లావాదేవీలు, హవాలా మార్గాలు బయటపడటం కలకలం రేపుతోంది. అంతర్జాతీయ సైబర్ మోసాల వెనుక ఉన్న మిగతా నెట్‌వర్క్‌ను గుర్తించడంపై అధికారులు దృష్టి పెట్టినట్లుగా తెలుస్తోంది.

కండక్టర్ ప్రవళిక కుటుంబానికి రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా: మంత్రి పొన్నం

మొదటిపేజీ తరువాయి

మహిళా కండక్టర్ ప్రవళిక కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం అన్నివిధాలుగా ఆదుకుంటుందని తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ప్రయాణికురాలు బస్సు నుంచి కిందకు నెట్టేయడంతో ప్రవళిక తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం తెలిసిందే. ఉస్మానియా మార్చురీలో ఆమె మృతదేహం వద్ద మంత్రి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ప్రవళిక తల్లికి ఉద్యోగంతో పాటు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఆ కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇస్తామని ప్రకటించారు. మణుగూరు డిపోలో ఆర్టీసీనే స్వచ్ఛందంగా బంద్ పాటిస్తోందన్నారు. అక్కడ మినహా మిగతా చోట్ల రాకపోకలు యథావిధిగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఇదిలా ఉండగా.. పోస్ట్‌మార్టం అనంతరం ప్రవళిక కళ్లను ఆమె కుటుంబ సభ్యులు దానం చేశారు.

రేవంత్ 'ఈఎంఐ ముఖ్యమంత్రి'

మొదటిపేజీ తరువాయి

మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ..'తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రియాంక గాంధీ బౌన్సర్లు నెట్టివేసే పరిస్థితి వచ్చింది. అమిత్ షా ముందు బండి సంజయ్ బౌన్సర్ కంటే దారుణంగా తయారయ్యారు. కేంద్ర మంత్రిగా ఉండి కరీంనగర్ ప్రజల గౌరవాన్ని దిగజార్చవద్దు. అమిత్ షా తెలంగాణకు వచ్చి చేతులు ఊపుకుంటూ వెళ్లిపోయారు. రాష్ట్రానికి ఒక్క మెట్రో ప్రాజెక్టు అయినా ఇచ్చారా? ఒక్క జాతీయ ప్రాజెక్టు లేదా విద్యాసంస్థను మంజూరు చేశారా? అని ప్రశ్నించారు. తెలంగాణకు కేంద్రం నుంచి ఏం సాధించారో బీజేపీ నేతలు చెప్పాలని డిమాండ్ చేశారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 'ఈఎంఐ ముఖ్యమంత్రి'. వారానికి రెండుసార్లు ఢిల్లీకి వెళ్లున్నారు. రాష్ట్ర ప్రయోజనాల కంటే ఢిల్లీ పర్యటనలు, రాజకీయ ప్రయోజనాలపైనే ఆయనకు ఆసక్తి ఉంది. అమిత్ షా కంటే వయసులో చిన్నవాడైన రాంచందర్ రావు ఆయన కాళ్లకు నమస్కరించడం ఏంటి?. రాజకీయాల్లో అంతగా దిగజారి వ్యవహరించాల్సిన అవసరం ఏం వచ్చింది. మరోవైపు, భూ దందాలు, కమీషన్ల కోసమే ఎమ్మెల్యే గాంధీ రేవంత్ రెడ్డి పంచన చేరారు' అని ఆరోపించారు.

దేశీ జీపీఎస్‌లో కీలక అడుగు.. నిర్దేశిత కక్ష్యలోకి ఎన్‌వీఎస్-03

మొదటిపేజీ తరువాయి

స్వదేశీ నేవిగేషన్ వ్యవస్థ బలోపేతం దిశగా కీలక అడుగుపడింది. ఇటీవల జీఎస్ఎల్వీ ఎఫ్-18 నింగిలోకి తీసుకెళ్లిన ఎన్‌వీఎస్-03 నేవిగేషన్ ఉపగ్రహానికి కక్ష్య పెంపు విన్యాసాన్ని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ విజయవంతంగా చేపట్టింది. నిర్దేశిత జియోసింక్రోనస్ కక్ష్యలోకి ప్రవేశపెట్టింది.

అమెరికా జీపీఎస్ కు ప్రత్యామ్నాయంగా ఇస్రో సొంతంగా నావిక్ వ్యవస్థ కోసం చేస్తున్న ప్రయత్నాలకు అడ్డంకులు ఎదురవుతూనే ఉన్నాయి. గతంలో ప్రయోగించిన కొన్ని ఉపగ్రహాల్లో పలు అణుగడియారాల్లో తలెత్తిన సాంకేతిక సమస్యలు, ఎన్‌వీఎస్-02 ప్రయోగం విఫలం కావడంతో నావిక్ వ్యవస్థకు అంతరాయం ఏర్పడింది. ఇప్పుడు ఎన్‌వీఎస్-03 నిర్దేశిత కక్ష్యకు చేరడం విజయంగా భావిస్తున్నారు. దీంతో నేవిగేషన్ సేవల సామర్థ్యం మరింత పెరగనుంది. నావిక్ వ్యవస్థ ద్వారా భారత భూభాగంతోపాటు సరిహద్దుల వెలుపల సుమారు 1500 కిలోమీటర్ల పరిధిలో అత్యంత కచ్చితమైన సమాచార సేవలు అందనున్నాయి. రవాణా, విమానయానం, సముద్ర ప్రయాణాలు, వాహనాల పర్యవేక్షణ, అత్యవసర సేవలు తదితర రంగాల్లో ఈ వ్యవస్థ కీలకంగా ఉపయోగపడనుంది.

మరో నాలుగు నగరాల్లో ఇందిరమ్మ టవర్లు!

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్ తరహాలో అల్పాదాయ కుటుంబాలకు జీ ప్లస్ 5 అంతస్తుల ఇందిరమ్మ టవర్లు నిర్మించనున్నట్లు వివరించారు. మేడ్చల్ మల్కాజిగిరి కలెక్టర్ కార్యాలయంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రజాప్రతినిధులతో రెవెన్యూ, రిజిస్ట్రేషన్, హౌసింగ్ అంశాలపై ఇన్‌ఛార్జి మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి పొంగులేటి సమీక్ష నిర్వహించారు.

రాష్ట్రవ్యాప్తంగా గృహ ప్రవేశాలు జరిగిన ఇందిరమ్మ ఇళ్లలో దీపావళి సంబరాలు జరపాలని మంత్రి తెలిపారు. 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' పేరుతో నిర్వహించే సంబరాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొనాలన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగలేక పోయినప్పటికీ.. ఇందిరమ్మ ఇళ్లకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందన్న మంత్రి పొంగులేటి.. ఇప్పటివరకు రూ.22,500 కోట్లు విడుదల చేసినట్లు చెప్పారు.

మొదటి విడతలో రాష్ట్రవ్యాప్తంగా నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్లు కేటాయించగా.. అందులో 2,21,500 గృహ ప్రవేశాలు జరిగాయని.. మరో 1.90 లక్షల గృహాలు వివిధ దశల్లో ఉన్నట్లు వివరించారు. రెండో విడతలో మరో రెండున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్లు కేటాయించినట్లు మంత్రి తెలిపారు. హైదరాబాద్ కోర్ అర్బన్‌లో లక్ష ఎల్ఐజీ ఫ్లాట్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కలెక్టర్లు, ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

రైతు భరోసా నిధులు విడుదల సందేశాలపై వ్యవసాయ శాఖ క్లారిటీ

మొదటిపేజీ తరువాయి

ఇలాంటి వార్తలను రైతులు నమ్మరాదని సూచించారు. రైతు భరోసా నిధుల విడుదల అంశం ప్రభుత్వం నేరుగా ప్రకటిస్తుందని చెప్పారు.

సైబర్ నేరస్తులు ఏదైనా పన్నాగం పన్నారా అని అనుమానిస్తున్నారు. దీని వెనుక ఉన్న నిజానిజాలను నిర్ధారించేందుకు సైబర్ క్రైమ్ పోలీసులకు సమాచారం అందించారు. దీనిపై పూర్తి విచారణ చేపట్టాలని సైబర్ క్రైమ్ విభాగానికి వ్యవసాయ శాఖ లేఖ రాసింది.

ఉమ్మడి ఏపీ శాసనమండలి మాజీ ఛైర్మన్ చక్రపాణి కన్నుమూత

మొదటిపేజీ తరువాయి

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనమండలి మాజీ ఛైర్మన్ ఎ.చక్రపాణి బుధవారం కన్నుమూశారు. హైదరాబాద్‌లోని స్వగృహంలో ఆయన తుదిశ్వాస విడిచారు. శాసనమండలి ఛైర్మన్‌గా.. సభా వ్యవహారాల నిర్వహణలో, పార్లమెంటరీ సంప్రదాయాల పరిరక్షణలో ఆయన కీలక పాత్ర పోషించారు. శాసన వ్యవస్థలో విశేష అనుభవం కలిగిన నేతగా గుర్తింపు పొందారు. చక్రపాణి మృతిపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో శాసనమండలిని పునరుద్ధరించిన తర్వాత తొలి ఛైర్మన్‌గా డాక్టర్ చక్రపాణి ఎంతో నిబద్ధతతో పనిచేశారని గుర్తుచేసుకున్నారు. దాదాపు ఐదు దశాబ్దాల ప్రజా జీవితంలో అంకితభావంతో ఆయన

హైదరాబాద్‌పై ఎల్‌నినో ఎఫెక్ట్.. హాస్టల్స్ ఖాళీ!

మొదటిపేజీ తరువాయి

గ్రేటర్ హైదరాబాద్‌లో నీటి కొరత ప్రభావం విద్యాసంస్థలపైనా పడుతోంది. నగరంలోని పలు కార్పొరేట్ కాలేజీలు, హాస్టళ్లలో నీటి సరఫరాకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. విద్యార్థుల అవసరాలకు సరిపడా నీరు అందుబాటులో లేకపోవడంతో కొన్ని కాలేజీల యాజమాన్యాలు కీలక నిర్ణయాలు తీసుకుంటున్నాయి. విద్యార్థులను ఇళ్లకు పంపించడంతో పాటు కాలేజీలకు, హాస్టళ్లకు సెలవులు ప్రకటిస్తున్నాయి. దీంతో విద్యార్థులతో సందడిగా ఉండే కార్పొరేట్ కాలేజీ క్యాంపస్‌లు ఖాళీ అవుతున్నాయి.

కార్పొరేట్ కాలేజీల్లో వేలాది మంది విద్యార్థులు హాస్టళ్లలో ఉంటూ చదువుకుంటుంటారు. వీరికి తాగునీటితో పాటు స్నానాలు, వంట, ఇతర రోజువారీ అవసరాలకు పెద్ద మొత్తంలో నీరు అవసరమవుతుంది. అయితే ప్రస్తుతం నీటి సరఫరాలో ఎదురవుతున్న ఇబ్బందులతో హాస్టళ్ల నిర్వహణ యాజమాన్యాలకు సవాలుగా మారుతోంది. ట్యాంకర్ల ద్వారా నీటిని సమకూర్చుకునే ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ అవసరాలకు అనుగుణంగా సరఫరా చేయడం కష్టంగా మారుతున్నట్లు తెలుస్తోంది.

ఈ నేపథ్యంలో కొన్ని విద్యాసంస్థలు విద్యార్థులను ఇళ్లకు పంపించేందుకు నిర్ణయించాయి. హాస్టళ్లలో నీటి సమస్య కారణంగా విద్యార్థులు ఇబ్బందులు పడకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నాయి. తల్లిదండ్రులకు సమాచారం అందించి పిల్లలను ఇళ్లకు తీసుకెళ్లాలని సూచిస్తున్నాయి. దీంతో పలుచోట్ల హాస్టళ్లు ఖాళీ అవుతున్నాయి.

మరోవైపు నగరంలో నీటి సరఫరా పరిస్థితిపై ఆందోళన వ్యక్తమవుతోంది. విద్యాసంస్థలతో పాటు నివాస ప్రాంతాల్లోనూ నీటి అవసరాలు పెరుగుతున్న నేపథ్యంలో సరఫరాను మెరుగుపరచాల్సిన అవసరం కనిపిస్తోంది. నీటి కొరత ఎప్పటివరకు కొనసాగుతుంది? కాలేజీలు తిరిగి ఎప్పుడు ప్రారంభమవుతాయి? అన్నది విద్యార్థులు, తల్లిదండ్రుల్లో చర్చనీయాంశంగా మారింది.

రెండు ఎమ్మెల్సీ స్థానాలపై కాంగ్రెస్ గురి!

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి సామ రామ్మోహన్‌రెడ్డి.. నల్గొండ-ఖమ్మం-వరంగల్ స్థానానికి రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి కాంగ్రెస్ అభ్యర్థులుగా బరిలో ఉన్నారు. ఈ రెండు స్థానాల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని రేవంత్ రెడ్డి ఆయా పార్టీల నాయకులను కోరారు. మొదట సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు నేతృత్వంలోని ప్రతినిధి బృందం ముఖ్యమంత్రితో సమావేశమైంది. అనంతరం టీజేఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం నేతృత్వంలోని నాయకులు సీఎంను కలిశారు. రేవంత్ రెడ్డి ప్రతిపాదనపై ఇరు పార్టీల నాయకత్వాలు సానుకూలంగా స్పందించాయి. అయితే పార్టీ అంతర్గత సమావేశాల్లో చర్చించిన తర్వాత అధికారిక నిర్ణయం వెల్లడిస్తామని తొలుత తెలిపాయి.

తాజాగా సీపీఐ తన నిర్ణయాన్ని ప్రకటించింది. రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని నిర్ణయించినట్లు కూనంనేని సాంబశివరావు వెల్లడించారు. సీపీఐతో పాటు పార్టీ అనుబంధ ప్రజా సంఘాలు కూడా కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతుగా నిలుస్తాయని స్పష్టం చేశారు. తాము ఇండియా కూటమిలో భాగస్వాములుగా ఉన్నామని ఈ సందర్భంగా గుర్తుచేశారు. టీజేఎస్ మాత్రం మద్దతుపై తన పార్టీ నిర్ణయాన్ని అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.


ముఖ్యమంత్రితో జరిగిన సమావేశాల్లో ఎమ్మెల్సీ ఎన్నికలతో పాటు పలు ప్రజా సమస్యలు కూడా చర్చకు వచ్చాయి. ముఖ్యంగా ఎల్‌నినో ప్రభావంతో వ్యవసాయ రంగం ఎదుర్కొనే సవాళ్లు, రైతులకు ప్రోత్సాహకాలు, నిరుద్యోగ సమస్య, ఉద్యోగ నియామకాలు, గిరిజనుల సంక్షేమం, రైతు బీమా, రైల్వే ప్రాజెక్టులు, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై నేతలు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో వరి సాగుకు బదులుగా ఆరుతడి పంటలు సాగు చేసే రైతులకు ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించాలని కోదండరాం కోరారు.

నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలపై స్పష్టత ఇచ్చేందుకు జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని కోదండరాం సూచించారు. దీనిపై స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి.. కరువు పరిస్థితులపై ఏర్పాటు చేసిన క్యాబినెట్ సబ్‌కమిటీకి ఆరుతడి పంటల ప్రోత్సాహకాలతో పాటు ఇతర సూచనలు అందించాలని కోరారు. ఉద్యోగ ఖాళీలను గుర్తించి నోటిఫికేషన్లు జారీ చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో భూమిలేని రైతులకు కూడా బీమా ప్రయోజనం కల్పించేలా కొత్త పథకాన్ని రూపొందిస్తున్నట్లు రేవంత్ రెడ్డి సమావేశంలో వెల్లడించినట్లు తెలిసింది.

మరోవైపు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని వివరించిన సీఎం రేవంత్ రెడ్డి.. ధాన్యం కొనుగోళ్ల కోసం బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలు దాదాపు రూ.లక్ష కోట్లకు చేరినట్లు పేర్కొన్నారని సమాచారం. సీఎంతో జరిగిన భేటీలో విద్యార్థి సంఘాల ఎన్నికల అంశాన్ని కూడా కూనంనేని ప్రస్తావించారు. కాలేజీలు, యూనివర్సిటీల్లో విద్యార్థి సంఘాల ఎన్నికలు నిర్వహించాలని కోరినట్లు తెలిపారు. విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు ఈ ఎన్నికలు ఉపయోగపడతాయని వివరించారు. దీనిపై సీఎం సానుకూలంగా స్పందించినట్లు కూనంనేని సాంబశివరావు వెల్లడించారు.

అలాగే పేదలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయడం వంటి అంశాలను కూడా కూనంనేని రేవంత్ రెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. అగ్రిగోల్డ్ ఆస్తులను విక్రయించి బాధితులకు పరిహారం అందించే అంశాన్ని పరిశీలించాలని సూచించినట్లు తెలిపారు. రాష్ట్రంలో కరువు పరిస్థితులు తీవ్రంగా ఉన్నాయని కూనంనేని ఆందోళన వ్యక్తం చేశారు. సుమారు 12.5 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని.. రైతులకు పంట బీమా కూడా అందుబాటులో లేదని పేర్కొన్నారు. రాష్ట్రానికి రూ.25 వేల కోట్ల సహాయం కోరినా అది సరిపోదని అభిప్రాయపడ్డారు. పంటలు సాగు చేయలేని రైతులకు కూడా కరువు భత్యం అందించాలని డిమాండ్ చేశారు. రాజకీయ విమర్శలకు పరిమితం కాకుండా తెలంగాణను కరువు రాష్ట్రంగా ప్రకటించే అంశంపై ప్రభుత్వాలు దృష్టి పెట్టాలని కోరారు. తెలంగాణలో రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై సీపీఐ, టీజేఎస్ మద్దతు కీలకమని మీరు ఎలా భావిస్తున్నారు? మీ అభిప్రాయాన్ని కామెంట్ బాక్స్‌లో

మీరూ నిరసన తెలపొచ్చుగా.. పిటిషనర్‌తో సీజేఐ వ్యాఖ్య



షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల రిజర్వ్‌డ్ స్థానాలపై దాఖలైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "మీరు రాంగ్ డయల్ చేస్తున్నారు. ఇది నిరసనలు, ప్రదర్శనల యుగం. బహుశా మీరు కూడా అదే బాటలో నడవాలి" అని సరదాగా వ్యాఖ్యానించారు. పార్లమెంట్, అసెంబ్లీ స్థానాల రిజర్వ్‌డ్ సీట్ల విషయంలో జోక్యం చేసుకోబోమని స్పష్టంచేశారు.

ఉత్తర్‌ప్రదేశ్‌లోని సుల్తానాపూర్ జిల్లా కదిపుర్ అసెంబ్లీ నియోజకవర్గాన్ని 1952 నుంచి ఎస్సీలకు రిజర్వ్ చేయడాన్ని సవాలు చేస్తూ జగదీశ్ సింగ్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనివల్ల నాలుగైదు కుటుంబాలు మాత్రమే లబ్ధి పొందుతున్నాయని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వ్‌డ్ సీట్లను రొటేషన్ పద్ధతిలో కేటాయించాలని కోరారు. ఇప్పటికే పంచాయతీలు, మున్సిపల్ ఎన్నికల్లో ఈ విధానాన్ని అవలంబిస్తున్నారని పేర్కొన్నారు. దీనివల్ల అభ్యర్థుల ఎంపికలో ఓటర్లకు ఛాయిస్ లేకుండా పోతోందని తన పిటిషన్‌లో వాదించారు.

ఈ పిటిషన్‌పై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీ, జస్టిస్ వి మోహన నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపింది. ఒక స్థానాన్ని ఒక సామాజిక వర్గానికి రిజర్వ్ చేయడమంటే వ్యక్తుల ఓటు హక్కును హరించడం కాదని జస్టిస్ బాగ్చీ పేర్కొన్నారు. మీ సామాజిక వర్గానికి ఓటు వేయలేకపోతున్నామని చెప్పడం అర్థం లేని వాదన అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో పార్టీని, ఐడియాలజీని బట్టి ఓటేస్తున్నారే తప్ప కులం, మతం ఆధారంగా కాదని వ్యాఖ్యానించారు. అయినా, జనరల్ స్థానాల్లో ఒక వ్యక్తి ఎక్కడి నుంచైనా పోటీ చేసే స్వేచ్ఛను రాజ్యాంగం కల్పిస్తోందని గుర్తుచేశారు. ఈ క్రమంలోనే నిరసన రూపంలో మీ ఆందోళన తెలియజేయొచ్చంటూ సీజేఐ పిటిషనర్‌కు సూచించారు. చట్టసభ్యులతో దీనిపై చర్చించాలని, ఈ విషయంలో న్యాయవ్యవస్థ జోక్యం చేసుకోబోదని ధర్మాసనం స్పష్టచేసింది.

విద్యార్థుల సంక్షేమం కోసమే రాజకీయాల్లోకి వచ్చా: తమిళనాడు సీఎం



విద్యార్థుల సంక్షేమం కోసమే రాజకీయాల్లోకి వచ్చినట్లు తమిళనాడు ముఖ్యమంత్రి సి.విజయ్ జోసఫ్ తెలిపారు. అవినీతి, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి చదువుపై దృష్టి పెట్టి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు. పది, ఇంటర్ బోర్డ్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించేందుకు ఏర్పాటు చేసిన విద్యా పురస్కారాల మొదటి విడత కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

యువత తమ వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవాలని, జీవితంలో ఎదురయ్యే అడ్డంకులకు భయపడకూడదని పిలుపునిచ్చారు."మీరు వెళ్తున్న మార్గంలో ఎవరైనా అడ్డంకులు సృష్టిస్తే, అప్పటికే మీ విజయం ఖాయమయ్యిందని అర్థం చేసుకోవాలి. మీ సంక్షేమం కోసమే నేను రాజకీయాల్లోకి వచ్చా. అది మీకూ తెలుసు" అని సీఎం విజయ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతిభావంతులైన విద్యార్థులకు సర్టిఫికెట్లు, నగదు ప్రోత్సహకాలను అందజేశారు.

దిల్లీ పాఠశాలలో 9 ఏళ్ల బాలిక దుర్మరణం



దిల్లీలో విషాదం చోటుచేసుకుంది. ఓ పాఠశాలలో 9 ఏళ్ల పాప ఒక్కసారిగా కుప్పకూలి మరణించింది. బుధవారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. లవ్లీ పబ్లిక్ స్కూల్లో మూడో తరగతి చదువుతున్న బాలిక అకస్మాత్తుగా కుప్పకూలడాన్ని గమనించిన టీచర్ ఆ చిన్నారి దగ్గరికి వెళ్లి చూడగా ఎలాంటి స్పందన లేదు. పాఠశాల సిబ్బంది పాపను వెంటనే స్థానిక ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే చిన్నారి మృతి చెందిందని వైద్యులు నిర్ధరించారు. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు, సీసీటీవీ ఫుటేజీని పరిశీలించారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

కండక్టర్ ప్రవళిక కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుంది: మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రవళిక తల్లికి ప్రభుత్వ ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు..
రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా, రూ.కోటి ప్రమాద బీమా అందజేత

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 4:

ఆర్టీసీ కండక్టర్ ప్రవళిక మృతితో ఒక కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయిందని, బాధిత కుటుంబానికి ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యం అన్ని విధాలుగా అండగా ఉంటాయని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు. ఉస్మానియా ఆసుపత్రి మార్చురీ వద్ద ప్రవళిక పార్థివదేహానికి మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి నివాళులర్పించారు. అనంతరం ప్రవళిక తల్లిని పరామర్శించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రవళిక తల్లికి ప్రభుత్వ ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయనున్నట్లు మంత్రి ప్రకటించారు. అదేవిధంగా ప్రభుత్వం, ఆర్టీసీ తరఫున కలిపి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా అందజేయడంతో పాటు, ఆర్టీసీ తీసుకున్న నిర్ణయం మేరకు బ్యాంకు ద్వారా రూ.కోటి ప్రమాద బీమా పరిహారం కుటుంబానికి అందుతుందని వెల్లడించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఆర్టీసీ కుటుంబ సభ్యురాలిని కోల్పోవడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదం జరిగిన వెంటనే ఆర్టీసీ యాజమాన్యం స్పందించి ఆసుపత్రికి వెళ్లి మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకుందని, అయినప్పటికీ ప్రవళికను కాపాడుకోలేకపోవడం దురదృష్టకరమని





పేర్కొన్నారు.

ఈ ఘటనకు కారణమైన వ్యక్తిపై తొలుత హత్యాయత్నం కేసు ఉండగా, ప్రవళిక మృతితో హత్య కేసు నమోదు చేసి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు కార్మికుల సంక్షేమం, భద్రతకు సమాన ప్రాధాన్యత ఇస్తుందని మంత్రి తెలిపారు. ఆర్టీసీ సిబ్బంది ఎవరైనా ప్రయాణికుల పట్ల తప్పుగా ప్రవర్తిస్తే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని, బాధ్యులపై తప్పకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అయితే ఎవరూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని సిబ్బందిపై దాడులకు పాల్పడకూడదని విజ్ఞప్తి చేశారు. క్రమశిక్షణకు మారుపేరుగా ఉన్న ఆర్టీసీ సంస్థలో సిబ్బంది కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రయాణికులే దేవుళ్లుగా భావించి వారికి మెరుగైన సేవలు అందించడం ప్రతి ఉద్యోగి బాధ్యత అని పేర్కొన్నారు. అదే సమయంలో కార్మికుల భద్రతకు ప్రభుత్వం పూర్తి బాధ్యత వహిస్తుందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం కార్మికుల సంక్షేమానికి అనేక నిర్ణయాలు తీసుకుందని, పెండింగ్ సమస్యలను పరిష్కరిస్తూ వారి సంక్షేమానికి కృషి చేస్తోందని మంత్రి వివరించారు. ప్రవళిక కుటుంబానికి ఆర్థికంగా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం, ఆర్టీసీ అన్ని విధాలా సహకరిస్తాయని, అయితే ఆ కుటుంబం కోల్పోయిన వ్యక్తిని తిరిగి తీసుకురాలేమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు జరగకుండా ప్రతి ఒక్కరూ సంయమనం పాటించాలని, ఏవైనా సమస్యలు ఉంటే చట్టపరంగా పరిష్కరించుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు.

-కొడంగల్‌లో నవంబర్ 7 నుంచి 9 వరకు మెగా రైతు మేళా

-నవంబర్ 7న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం
-150 ఎగ్జిబిషన్ స్టాళ్లు ఏర్పాటు
-మూడు రోజుల పాటు రైతులకు ఆధునిక వ్యవసాయంపై అవగాహన.. శాస్త్రవేత్తలు, ప్రగతిశీల రైతులతో సమావేశాలు
-చివరి రోజు పొరుగు జిల్లాల నుంచి 50 వేల మంది రైతుల హాజరవుతారని అంచనా
-రైతులందరూ మెగా రైతు మేళాను సద్వినియోగం చేసుకోవాలి: మంత్రి తుమ్మల

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 4:

రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, నూతన సాంకేతిక పరిజ్ఞానం, అధిక ఆదాయం అందించే ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించడంతో పాటు వ్యవసాయ రంగంలో సాధించిన పురోగతిని ప్రదర్శించే లక్ష్యంతో ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు కొడంగల్‌లో మూడు రోజుల పాటు మెగా రైతు మేళాను నిర్వహించనున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. నవంబర్ 7వ తేదీన ఉదయం 10 గంటలకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఇతర మంత్రులు, ప్రజాప్రతినిధులు, ప్రముఖుల సమక్షంలో ఈ మేళాను ప్రారంభించనున్నారని వెల్లడించారు. ప్రారంభోత్సవం అనంతరం ముఖ్యమంత్రి గారు, మంత్రులు ప్రదర్శన స్టాళ్లను సందర్శించనున్నారు.

ఈ మెగా రైతు మేళాలో వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ, ఆయిల్‌ఫెడ్, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం (ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం (ప్రొజూూఖ), పశుసంవర్ధక శాఖ, బ్యాంకింగ్ సంస్థలు, విత్తన పరిశ్రమ, వాలంతరి (ఔూూఖూమీూ=×), క్రిడా (జ=×ణఖూ), కేంద్ర ప్రభుత్వ సంస్థలు సహా మొత్తం 26 ప్రభుత్వ శాఖలు, అనుబంధ సంస్థల భాగస్వామ్యంతో సుమారు 150 ఎగ్జిబిషన్ స్టాళ్లను ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. వ్యవసాయ ఇన్‌పుట్స్, నూతన తరం రసాయనాలు, నాణ్యమైన విత్తనాలు, ఆధునిక వ్యవసాయ పరికరాలు, యంత్రాలు, వ్యవసాయ డ్రోన్లు, వివిధ శాఖల సాంకేతిక పరిజ్ఞానం, ప్రభుత్వ కార్యక్రమాలను ఈ స్టాళ్ల ద్వారా ప్రదర్శించనున్నారని అన్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, అవార్డు గ్రహీతలైన ప్రగతిశీల రైతులతో సాంకేతిక సమావేశాలు, ముఖాముఖి చర్చలు నిర్వహించనున్నారు. వివిధ ప్రభుత్వ శాఖలు, జాతీయ, అంతర్జాతీయ సంస్థలు, ప్రైవేటు



రంగ సంస్థలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు (ఖీూూం), ఇతర భాగస్వామ్య సంస్థల ఆధ్వర్యంలో ప్రదర్శనలు, ప్రత్యక్ష అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులు, పంటల విలువ ఆధారిత ఉత్పత్తులు, మార్కెట్ అవకాశాలు, వినూత్న సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడం ద్వారా రైతుల ఆదాయాన్ని పెంపొందించుకునే మార్గాలను వివరించనున్నారు.

మొదటి రోజు ముఖ్యమంత్రితో రైతు మేళా ప్రారంభోత్సవం

నవంబర్ 7వ తేదీన మొదటి రోజు కొడంగల్ శాసనసభ నియోజకవర్గ పరిధిలోని వికారాబాద్, నారాయణపేట జిల్లాల నుంచి సుమారు 7,500 మంది రైతులు పాల్గొననున్నారు. రైతులకు ముందుగానే అల్పాహారం అందించడంతో పాటు కార్యక్రమ ప్రాంగణంలో మధ్యాహ్న భోజన ఏర్పాట్లు చేయనున్నారు. ఉదయం 10 గంటలకు ముఖ్యమంత్రి మెగా రైతు మేళాను ప్రారంభిస్తారు. ప్రారంభోత్సవం అనంతరం ప్రొజూూఖ, ఖూూఒఖ శాస్త్రవేత్తలు, వివిధ అనుబంధ శాఖల అధికారులు, వ్యవసాయ రంగ నిపుణులు, ప్రగతిశీల రైతులు, అవార్డు గ్రహీతలైన రైతులు తమ అనుభవాలు, పరిజ్ఞానం, విజయగాథలను రైతులతో పంచుకునేలా సాంకేతిక సమావేశాలు నిర్వహించనున్నారు. ఈ సమావేశాలు, రైతులతో ముఖాముఖి కార్యక్రమాల కోసం 2,500 మంది కూర్చునే సామర్థ్యం కలిగిన ప్రత్యేక హాలును ఏర్పాటు చేశారు.

ప్రస్తుతం నెలకొన్న ఎల్‌నినో వాతావరణ పరిస్థితులు, వ్యవసాయ రంగంపై వాటి ప్రభావం, రైతులు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, ప్రత్యామ్నాయ సాగు విధానాలపై జరిగే చర్చలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వనున్నారు. విజయవంతమైన రైతుల అనుభవాలు, విజయగాథలను తెలియజేసే డాక్యుమెంటరీలు, వీడియోలను కూడా ప్రదర్శించనున్నారు. వైవిధ్యభరితమైన, అధిక ఆదాయం అందించే పంటల సాగును ప్రోత్సహించడం, సంప్రదాయ పంటలపై ఆధారపడటాన్ని తగ్గించడం, వ్యవసాయ ఆదాయాన్ని పెంచడం, సుస్థిర వ్యవసాయ పద్ధతులను అవలంబించడం, వ్యవసాయం మరియు అనుబంధ రంగాల్లో నూతన అవకాశాలను అన్వేషించడం ఈ కార్యక్రమాల ప్రధాన లక్ష్యమని మంత్రి వివరించారు.

రైతులకు వ్యవసాయ పరికరాలు, యంత్రాల పంపిణీ

మొదటి రోజు ముఖ్యమంత్రి, ఇతర ప్రముఖుల సమక్షంలో కస్టమ్ హైరింగ్ సెంటర్లు, పప్పుధాన్యాల మిల్లులు, నూనె గానుగ యూనిట్లు, భూసార పరీక్ష కార్డులు, బయో రిసోర్స్ ఇన్‌పుట్ సెంటర్లు, ఉద్యానవన శాఖకు సంబంధించిన డ్రిప్ సిస్టమ్స్ తదితర వ్యవసాయ పరికరాలు, యంత్రాలు, యూనిట్లను రైతులకు అందించనున్నారు. మొదటి రోజు కార్యక్రమాలు సాయంత్రం 5 గంటల వరకు కొనసాగనున్నాయి.

రెండో రోజు మహిళా రైతులకు ప్రత్యేక ప్రాధాన్యత

రెండో రోజు కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో మహిళా రైతులు పాల్గొనేలా ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నారు. వ్యవసాయం, అనుబంధ రంగాల్లో మహిళా రైతుల పాత్ర, ఆదాయాన్ని పెంపొందించుకునే అవకాశాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై వారికి అవగాహన కల్పించనున్నారు.

మూడో రోజు 10 జిల్లాల నుంచి 50 వేల మంది రైతుల హాజరవుతారని అంచనా

మూడో రోజు పొరుగు జిల్లాల నుంచి సుమారు 50 వేల మంది రైతులను సమీకరించనున్నారు. చివరి రోజు సాయంత్రం గౌరవ ముఖ్యమంత్రి ప్రసంగంతో మెగా రైతు మేళా ముగియనుంది.

రైతులకు ఆధునిక వ్యవసాయ పరిజ్ఞానాన్ని అందించడంతో పాటు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, పరిశ్రమల ప్రతినిధులు, సాంకేతిక సంస్థలతో నేరుగా చర్చించే అరుదైన అవకాశాన్ని ఈ మెగా రైతు మేళా కల్పిస్తుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రాష్ట్రంలోని రైతులందరూ ఈ మూడు రోజుల మెగా రైతు మేళాలో పాల్గొని, అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.

యాదవుల ఆత్మగౌరవానికి పెద్దపీట.. సదర్ సమ్మేళనానికి రాష్ట్ర పండుగ హోదా: సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 4:

యాదవుల ఆత్మగౌరవం తెలంగాణ ప్రజలందరి ఆత్మగౌరవమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన సదర్ సమ్మేళన కార్యక్రమంలో ఆయన పాల్గొని యాదవ సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. సదర్ సమ్మేళనం కేవలం యాదవులకే పరిమితమైన వేడుక కాదని, తెలంగాణ సమాజం గర్వించదగిన ఆత్మగౌరవ వేడుక అని పేర్కొన్నారు. హైదరాబాద్ నగర అభివృద్ధిలో యాదవుల పాత్ర ఎంతో కీలకమని సీఎం కొనియాడారు. ప్రస్తుతం గోల్కొండ కోటగా పిలుస్తున్న ప్రాంతం ఒకప్పుడు గొల్లంకొండగా ప్రసిద్ధి చెందిందని గుర్తుచేశారు. యాదవ సోదరుల సహకారం, ఆదరణతోనే హైదరాబాద్ నగరం ఇంతగా అభివృద్ధి చెందిందన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి నగరానికి వచ్చిన ప్రజలను యాదవులు ఆదరించి అక్కున చేర్చుకున్నారని ప్రశంసించారు. గతంలో ఏ ముఖ్యమంత్రి కూడా సదర్ సమ్మేళనాన్ని రాష్ట్ర పండుగగా ప్రకటించాలనే ఆలోచన చేయలేదని, తమ ప్రభుత్వం యాదవుల ఆకాంక్షలను గౌరవిస్తూ సదర్ సమ్మేళనానికి రాష్ట్ర పండుగ హోదా కల్పించిందని రేవంత్ రెడ్డి తెలిపారు. సమ్మేళనం నిర్వహణ కోసం ప్రభుత్వం రూ.5 కోట్లు మంజూరు చేసిందని వెల్లడించారు.

తెలంగాణలో తమ ప్రభుత్వం కులగణన నిర్వహించి దేశానికే ఆదర్శంగా నిలిచిందని సీఎం అన్నారు. తెలంగాణ మోడల్‌ను దేశంలోని ఇతర రాష్ట్రాలు అనుసరించేలా కులగణన చేపట్టామని పేర్కొన్నారు. తమ ప్రభుత్వంలో యాదవులకు సముచిత రాజకీయ, సామాజిక ప్రాధాన్యత కల్పించామని తెలిపారు. అనిల్ కుమార్ యాదవ్‌కు రాజ్యసభ సభ్యుడిగా,



నవీన్ యాదవ్‌కు ఎమ్మెల్యేగా అవకాశం కల్పించామని, ఈశ్వరమ్మ యాదవ్‌ను యాదగిరిగుట్ట ఆలయ బోర్డు సభ్యురాలిగా నియమించామని వివరించారు. యాదగిరిగుట్ట గోశాలలో గోవుల సంరక్షణకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. భవిష్యత్తులో యాదవులకు దక్కాల్సిన వాటా వారికి దక్కేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. యాదవ సోదరుల ఆత్మగౌరవానికి ఎక్కడా భంగం కలగకుండా చూసుకునే బాధ్యత తమ ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు.

తెలంగాణను దేశంలోనే అభివృద్ధి చెందిన రాష్ట్రంగా నిలబెట్టడమే తమ ప్రభుత్వ లక్ష్యమని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. మూసీ అభివృద్ధి, మెట్రో రైలు విస్తరణ, భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణం వంటి కీలక ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం చేపడుతున్న ఈ కార్యక్రమాలకు యాదవ సోదరులు సహకరించాలని ఆయన కోరారు. యాదవుల సంక్షేమం, ఆత్మగౌరవం, రాజకీయ ప్రాధాన్యతకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

భారత్--పోలండ్ వాణిజ్య బంధం బలోపేతానికి చర్యలు

ఏఐ, సెమీకండక్టర్లు, కీలక ఖనిజ రంగాల్లో సహకారంపై జితిన్ ప్రసాద చర్చలు



న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 04:

భారత్--పోలండ్ మధ్య వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతిక సహకారాన్ని విస్తరించేందుకు కేంద్ర వాణిజ్య, పరిశ్రమలు, ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక శాఖల సహాయ మంత్రి జితిన్ ప్రసాద నవంబర్ 2, 3 తేదీల్లో పోలండ్‌లో పర్యటించారు. ఆయన వెంట 12 భారతీయ కంపెనీల ప్రతినిధులతో కూడిన వ్యాపార బృందం పాల్గొంది.పర్యటనలో పోలండ్ ఉప ప్రధానమంత్రి, డిజిటల్ వ్యవహారాల మంత్రి క్రిష్టోఫ్ గావ్‌కోవ్‌స్కీతో జితిన్ ప్రసాద సమావేశమయ్యారు. కృత్రిమ మేధస్సు, సెమీకండక్టర్లు, డేటా సెంటర్లు, సైబర్ భద్రత రంగాల్లో పరస్పర సహకారాన్ని పెంపొందించడంపై చర్చించారు.పోలండ్ విదేశాంగ శాఖ సహాయ మంత్రి ఇగ్నసీ నెమ్‌చిట్స్కీతో జరిగిన సమావేశంలో భారత్--యూరోపియన్ యూనియన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ద్వారా లభించే అవకాశాలను ప్రస్తావించారు. వ్యవసాయ సాంకేతికత, ఆహార శుద్ధి రంగాల్లో భాగస్వామ్యాన్ని విస్తరించాలని, చిన్న, మధ్యతరహా సంస్థలకు మరిన్ని వ్యాపార అవకాశాలు కల్పించాలని సూచించారు.ఆర్థికాభివృద్ధి, సాంకేతిక శాఖ ఉప మంత్రి మిఖాల్ బరనోవ్‌స్కీతో కీలక ఖనిజాలు, సెమీకండక్టర్లు, అంకుర సంస్థల భాగస్వామ్యంపై చర్చలు జరిపారు. 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమంలో పెట్టుబడి అవకాశాలను వివరించిన జితిన్ ప్రసాద.. సాంకేతిక పరిజ్ఞాన బదిలీతో ఉమ్మడి అభివృద్ధి, ఉత్పత్తికి ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు.నవంబర్ 3న వార్సాలోని పోలిష్ నేషనల్ చాంబర్ ఆఫ్ కామర్స్‌లో నిర్వహించిన భారత్--పోలండ్ బిజినెస్ ఫోరమ్‌లో మంత్రి ప్రారంభోపన్యాసం చేశారు. ఇరు దేశాల కంపెనీలు కొత్త వ్యాపార అవకాశాలను అందిపుచ్చుకొని, వాణిజ్య, పెట్టుబడి సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవాలని పిలుపునిచ్చారు. భారత్--ఈయూ వాణిజ్య ఒప్పందంతో విస్తరించే మార్కెట్ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.పోలండ్‌లోని భారతీయ వ్యాపారవేత్తలతోనూ మంత్రి సమావేశమై, ద్వైపాక్షిక సంబంధాల బలోపేతానికి వారు చేస్తున్న కృషిని అభినందించారు. భారత్‌లో పెట్టుబడులకు ఆసక్తి చూపుతున్న పోలిష్ పెట్టుబడిదారులతో చర్చించారు. ట్రాన్సిషన్ టెక్నాలజీస్, డబ్ల్యూబీ ఎలక్ట్రానిక్స్ సంస్థలను సందర్శించారు. పటిష్ఠమైన అంతర్జాతీయ సరఫరా వ్యవస్థల నిర్మాణానికి పోలండ్‌తో కలిసి పనిచేయాలన్న భారత్ నిబద్ధతను ఈ పర్యటన చాటిచెప్పింది.

ఆహార శుద్ధి పరిశ్రమల శాఖ నూతన వెబ్‌సైట్ ప్రారంభం

ప్రజలకు సులభంగా సమాచారం అందించడమే లక్ష్యం



న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 04:

కేంద్ర ఆహార శుద్ధి పరిశ్రమల మంత్రిత్వ శాఖ నూతన అధికారిక వెబ్‌సైట్‌ను కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ బుధవారం న్యూఢిల్లీలోని పంచశీల్ భవన్‌లో ప్రారంభించారు. కార్యక్రమంలో శాఖ కార్యదర్శి అవినాష్ జోషి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ప్రజలకు సమాచారాన్ని సులభంగా అందించడంతో పాటు డిజిటల్ సేవలను మెరుగుపరిచే లక్ష్యంతో వెబ్‌సైట్‌ను ఆధునీకరించారు. భారత ప్రభుత్వ తాజా ప్రమాణాలు, మార్గదర్శకాలకు అనుగుణంగా రూపొందించిన ఈ వేదికలో పారదర్శకత, అందుబాటు, వినియోగ సౌలభ్యానికి ప్రాధాన్యం ఇచ్చారు.

వినియోగదారుల సమాచార భద్రత కోసం మెరుగైన డేటా రక్షణ వ్యవస్థలను ఏర్పాటు చేశారు. విస్తృత స్థాయిలో ప్రజలకు సమాచారం చేరువయ్యేలా బహుభాషా సదుపాయాన్ని కల్పించారు. అవసరమైన వివరాలను వేగంగా పొందేందుకు సెర్చ్ వ్యవస్థను మెరుగుపరిచారు.

మంత్రిత్వ శాఖ విధానాలు, పథకాలు, కార్యక్రమాలు, ఇతర కార్యకలాపాలకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలు, పరిశ్రమల ప్రతినిధులు ఈ వెబ్‌సైట్ ద్వారా సులభంగా తెలుసుకోవచ్చు. ప్రజల అవసరాలకు స్పందించే, సమ్మిళిత డిజిటల్ సేవల విస్తరణలో ఈ నూతన వేదిక కీలకంగా నిలవనుంది.

ఔషధ తయారీలో సూక్ష్మజీవ నియంత్రణకు మరింత కట్టుదిట్టమైన ప్రమాణాలు

డబ్ల్యూహెచ్ఓ మార్గదర్శకాలకు అనుగుణంగా షెడ్యూల్--ఎం సవరణ ప్రతిపాదన

న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 04:

స్టెరైల్ ఔషధాల తయారీలో నాణ్యత, భద్రతా ప్రమాణాలను బలోపేతం చేసేందుకు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ షెడ్యూల్--ఎంలో సవరణలను ప్రతిపాదించింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) మార్గదర్శకాలకు అనుగుణంగా గ్రేడ్--ఏ పరిశుభ్ర ప్రాంతాల్లో సూక్ష్మజీవ కాలుష్యానికి సంబంధించిన నిర్దేశిత పరిమితులను సవరించనుంది.ఔషధ నిబంధనలు--1945లోని షెడ్యూల్--ఎం సవరణకు సంబంధించి అక్టోబర్ 28న జీఎస్ఆర్ నంబరు 953(ఈ) ద్వారా ప్రతిపాదన విడుదల చేసింది. డబ్ల్యూహెచ్ఓ టెక్నికల్ రిపోర్ట్ సిరీస్ నంబరు 1044లోని అనుబంధం--2లో పేర్కొన్న స్టెరైల్ ఔషధాల ఉత్తమ తయారీ పద్ధతులకు అనుగుణంగా ఈ మార్పులను ప్రతిపాదించారు.స్టెరైల్ ఔషధాల తయారీలో గ్రేడ్--ఏ ప్రాంతాలు అత్యంత కీలకమైనవి. బాహ్య వాతావరణానికి బహిర్గతమయ్యే ఔషధ ఉత్పత్తులు, కంటైనర్లు, సూక్ష్మజీవరహితం చేసిన భాగాలను ఈ ప్రాంతాల్లో నిర్వహిస్తారు. అందువల్ల ఇక్కడ కఠినమైన సూక్ష్మజీవ నియంత్రణ పాటించడం ఉత్పత్తుల నాణ్యత, భద్రతకు అవసరం.ప్రతిపాదిత సవరణ ప్రకారం గ్రేడ్--ఏ ప్రాంతాల్లో ఏదైనా సూక్ష్మజీవ పెరుగుదల గుర్తిస్తే, దానిపై దర్యాప్తు చేపట్టాల్సి ఉంటుంది. ప్రస్తుతం షెడ్యూల్--ఎం, డబ్ల్యూహెచ్ఓ ప్రమాణాల మధ్య ఉన్న వ్యత్యాసాలను తొలగించి, దేశీయ నిబంధనలను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దడం ఈ ప్రతిపాదన లక్ష్యం.ఈ మార్పులతో దేశంలో స్టెరైల్ ఔషధాల తయారీపై నియంత్రణ వ్యవస్థ మరింత బలోపేతం కానుందని మంత్రిత్వ శాఖ తెలిపింది.

బీటీపీఎస్ పరిసర గ్రామాలకు అభివృద్ధి ఎండమావేనా...?

- ప్రధాన రహదారిపై మురుగునీటి ప్రవాహం...!
- అభివృద్ధి కార్యక్రమాలు ఎక్కడ అంటున్న ప్రజలు....!





భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక, మణుగూరు మండలాల సరిహద్దు ప్రాంతంలోని భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం (బీటీపీఎస్) నిర్మితమైన రోజు నుంచి నేటి వరకు ప్రభావిత గ్రామాల్లో కనీస సౌకర్యాలు,అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడంలో విఫలమైనట్లు ప్రజలు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. ప్రధాన ద్వారం ఎదురుగా రహదారిపై పారిశుద్ధ్య సమస్య తీవ్రంగా మారి... హోటళ్లు, దుకాణాలు, ఇళ్ల నుంచి వెలువడుతున్న మురుగునీరు ప్రధాన రహదారిని మురుగుమయంగా మారుస్తోంది. దీంతో అటుగా రాకపోకలు సాగించే స్థానికులు, వాహనదారులు, విద్యుత్ కేంద్రం ఉద్యోగులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భద్రాద్రి విద్యుత్ కేంద్రంలో పనిచేస్తున్న ఉన్నత అధికారులు నిత్యం రాకపోకలు నిర్వహించే ప్రధాన రహదారిపై నెలకొన్న ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోకపోవడంపై స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. పారిశుద్ధ్య నిర్వహణ, అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులు ఎందుకు దృష్టి సారించడం లేదని ప్రశ్నిస్తున్నారు. ఇంతటి ప్రధాన పారిశ్రామిక కేంద్రం గేటు ఎదుటే మురుగునీరు ప్రవహిస్తున్న కూడా చర్యలు తీసుకోకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శిస్తున్నారు.

- సామాజిక బాధ్యత నిధులపై స్పష్టత ఏదీ....?

అభివృద్ధి అంటే భారీ భవనాలు, యంత్రాల ఏర్పాటు మాత్రమే కాదని అటువంటి పరిశ్రమలను స్థాపించిన యాజమాన్యాలు పరిసర గ్రామాల అభివృద్ధికి కూడా ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభావిత గ్రామాల ప్రజలు కోరుతున్నారు. సామాజిక బాధ్యత నిధుల కింద ఇప్పటివరకు ఎంత మొత్తం విడుదలైంది? గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులేమిటి? వాటికి ఎంత ఖర్చు చేశారు? అనే వివరాలను అధికారులు బహిర్గతం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.ప్రభావిత గ్రామాల్లో రహదారులు, మురుగునీటి కాలువలు, వీధి దీపాలు, వైద్య శిబిరాలు వంటి కనీస సదుపాయాలు కల్పించడంలో విద్యుత్ కేంద్రం యాజమాన్యం విఫలమైందని స్థానికులు ఆరోపిస్తున్నారు.బీటీపీఎస్ ప్రధాన గేటు ఎదుట నెలకొన్న రహదారి, వీధి దీపాలు, డ్రైనేజీ సమస్యలపై తక్షణమే స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు, వాహనదారులు, పాదచారులు కోరుతున్నారు. పారిశుద్ధ్య సమస్యను పరిష్కరించడంతో పాటు ప్రభావిత గ్రామాల అభివృద్ధికి సి ఎస్ ఆర్ నిధులను వినియోగించడంపై స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇకనైనా విద్యుత్ కేంద్రం ఉన్నతాధికారులు, ప్రభుత్వం స్పందించి ప్రభావిత గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలని ప్రజలు కోరుకుంటున్నారు.

కండక్టర్ ప్రవళిక మృతికి నిరసనగా సిరిసిల్ల ఆర్టీసీ సిబ్బంది ఆందోళన!



నల్ల బ్యాడ్జీలు ధరించి డిపో ఎదుట నిరసన.
ఆర్టీసీ ఉద్యోగులకు భద్రత కల్పించాలని డిమాండ్.

విధి నిర్వహణలో ఉండగా తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన ఆర్టీసీ మహిళా కండక్టర్ గుండ్ల ప్రవళికకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ సిరిసిల్ల ఆర్టీసీ డిపో సిబ్బంది బుధవారం నిరసనకు దిగారు. నల్ల బ్యాడ్జీలు ధరించి డిపో ఎదుట ఆందోళన చేపట్టి ప్రవళిక మృతికి సంతాపం తెలిపారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు డిపోకు చెందిన కండక్టర్ ప్రవళిక (24) గత నెల 25న అశ్వాపురం మండలం మిట్టగూడెం సమీపంలో బస్సులో ప్రయాణిస్తున్న ఓ మహిళతో టికెట్, చిల్లర విషయంలో జరిగిన వివాదం సందర్భంగా బస్సు నుంచి కిందపడిపోయి తీవ్రంగా గాయపడింది. హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందింది.ఈ ఘటనపై ఆర్టీసీ ఉద్యోగులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. విధులు నిర్వహిస్తున్న సిబ్బందిపై దాడులు జరగకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, ఉద్యోగులకు తగిన రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రవళిక కుటుంబానికి న్యాయం చేయడంతో పాటు రూ.కోటి పరిహారం అందించాలని కోరారు.ఈ నిరసన కార్యక్రమంలో ఈయూ, టీఎంయూ ఐక్య కూటమి నాయకులు బాణయ్య, జె.ఎస్.ఎన్.రావు, ఎల్.ఆర్.రెడ్డి, కుమార్ బి.శ్రీనివాస్, మదన్ దేవయ్య తదితరులు పాల్గొన్నారు

ఒకప్పుడు దండోరా అంటే కంద చంద్రయ్య... ఇప్పుడు తబలా అంటే కంద రాఘవేందర్!

•తాత వారసత్వానికి మనవడి ప్రతిభ.. జిల్లా స్థాయికి సాయిరెడ్డిగూడ విద్యార్థి ఎంపిక



రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం పరిధిలో సాయిరెడ్డిగూడ గ్రామంలో ఒకప్పుడు దండోరా అంటే గుర్తుకొచ్చే పేరు కంద చంద్రయ్య. గ్రామంలో తనకంటూ చెరగని ముద్ర వేసుకున్న కంద చంద్రయ్య వారసత్వాన్ని ఇప్పుడు ఆయన మనవడు కంద రాఘవేందర్ తన ప్రతిభతో మరో రూపంలో చాటుకుంటున్నాడు.
సాయిరెడ్డిగూడ గ్రామానికి చెందిన కంద చిన్న అంజయ్య కుమారుడు కంద రాఘవేందర్ కడ్తాల్ మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ బాలుర ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. తెలుగు సబ్జెక్టు ద్వారా సంగీతంపై ఆసక్తి పెంచుకున్న రాఘవేందర్ తబలా వాయిద్యంలో తన ప్రతిభను ప్రదర్శించి రంగారెడ్డి జిల్లా స్థాయికి ఎంపికయ్యాడు.
చిన్న వయసులోనే సంగీత రంగంపై ఆసక్తి పెంచుకొని, తన ప్రతిభతో జిల్లా స్థాయికి ఎదగడం గ్రామస్తులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల్లో ఆనందాన్ని నింపింది. తాత కంద చంద్రయ్య గ్రామంలో తనదైన గుర్తింపు సంపాదించుకోగా, మనవడు రాఘవేందర్ సంగీత రంగంలో ప్రతిభ చాటుకోవడం కుటుంబానికి, గ్రామానికి గర్వకారణంగా నిలుస్తోంది.
ఈ సందర్భంగా గ్రామస్తులు, విద్యాభిమానులు రాఘవేందర్‌ను అభినందిస్తూ భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయిలోనూ రాణించాలని ఆకాంక్షిస్తున్నారు. విద్యతో పాటు సంగీతం, క్రీడా రంగాల్లోనూ ఉన్నత శిఖరాలను అధిరోహించి తల్లిదండ్రులకు, పాఠశాలకు, సాయిరెడ్డిగూడ గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని కోరుతున్నారు.

ప్రజా కళాకారుడు సిద్దల హుస్సేన్‌కు ఘన సన్మానం.



కళారంగంలో విశేష ప్రతిభ కనబరిచి, ప్రజల్లో చైతన్యం కలిగిస్తున్న బీటీపీఎస్ ఉద్యోగి, ప్రజా కళాకారుడు సిద్దల హుస్సేన్‌కు అరుదైన గౌరవం లభించింది. కళారత్న మూవీస్ సంస్థ ఆధ్వర్యంలో ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ప్రతిష్ఠాత్మకమైన 'ఇండియన్ గ్లోరీ' అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా బుధవారం మణుగూరులోని భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (బీటీపీఎస్)లో చీఫ్ ఇంజనీర్ బిచ్చన్న ఆయనను ఘనంగా సన్మానించి అభినందించారు.ఈ సందర్భంగా చీఫ్ ఇంజనీర్ బిచ్చన్న మాట్లాడుతూ సిద్దల హుస్సేన్ తన కళా ప్రదర్శనల ద్వారా ప్రజలను చైతన్యపరుస్తూ సమాజానికి సేవలందిస్తున్నారని, తెలంగాణ ఉద్యమ సమయంలో ధూంధాం కార్యక్రమాలు నిర్వహించి ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించారని గుర్తుచేశారు. బీటీపీఎస్‌లో విధులు నిర్వహిస్తూ కళారంగంలోనూ రాణించడం సంస్థకు గర్వకారణమని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఆయన మరిన్ని పురస్కారాలు అందుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ కంట్రోలర్ ఆఫ్ అకౌంట్స్ శ్రీనివాస్, డివిజనల్ ఇంజనీర్లు మహేందర్, చక్రధర్, ఏడీఈ సత్యనారాయణమూర్తి, అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీకాంత్, కార్మిక సంఘం-1535 ప్రాంతీయ అధ్యక్షుడు వి.ప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఆర్.రామచందర్, నాయకులు రమణ తదితరులు పాల్గొన్నారు.

పునాదులు దాటని పంచాయతీ భవనం...!

- ఏడాదిన్నరగా అర్ధాంతరంగా నిర్మాణ పనులు....!
- ప్రజాధనం వృథా అవుతోందని గ్రామస్తుల ఆవేదన.



గ్రామ ప్రజల సౌకర్యార్థం కేంద్రంగా ఉండాల్సిన గడ్డంపల్లి గ్రామపంచాయతీ నూతన భవన నిర్మాణం అర్ధాంతరంగా నిలిచిపోయింది. ఎన్నో ఆశలతో ప్రారంభమై దాదాపు ఏడాదిన్నర గడుస్తున్నా నిర్మాణం పూర్తి కాకపోవడంపై గ్రామస్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.భవన నిర్మాణం పిల్లర్లు, స్లాబ్ దశలోనే నిలిచిపోవడంతో ప్రాంగణం నిరుపయోగంగా మారింది. ప్రజాధనంతో చేపట్టిన నిర్మాణ పనులు మధ్యలోనే ఆగిపోవడం, భవనం పూర్తి చేయడంలో జాప్యం జరగడం పట్ల స్థానికులు ఆవేదన చెందుతున్నారు. గ్రామపంచాయతీకి సొంత భవనం అందుబాటులోకి వస్తుందని ఆశించిన ప్రజలకు నిరీక్షణే మిగిలిందని వాపోతున్నారు.నిర్మాణ పనులు నిలిచిపోవడానికి కారణాలేమిటో అధికారుల నుంచి స్పష్టత రావడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. నిధుల కొరతా...? కాంట్రాక్టర్ నిర్లక్ష్యమా...? లేక అధికారుల పర్యవేక్షణ లోపమా...? అన్న ప్రశ్నలు స్థానికంగా వ్యక్తమవుతున్నాయి. పలుమార్లు సంబంధిత అధికారులకు, ప్రజాప్రతినిధులకు సమస్యను విన్నవించినా స్పందన లేకపోవడం పట్ల అసహనం వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు,జిల్లా ఉన్నతాధికారులు, సంబంధిత శాఖ అధికారులు స్పందించి నిర్మాణ పనులు త్వరితగతిన ప్రారంభించాలని గ్రామస్తులు కోరుతున్నారు. అవసరమైన నిధులు కేటాయించి, నిలిచిపోయిన పనులను వెంటనే పునఃప్రారంభించి నాణ్యతతో పూర్తి చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రజలకు ఉపయోగపడాల్సిన ప్రభుత్వ భవనం నిరుపయోగంగా ఉండకుండా త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని పంచాయతీ ప్రజలు కోరుతున్నారు.

లీ సర్వే పనులు, ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణ, ఎస్ఐఆర్ ప్రక్రియ వేగవంతం చేయాలి,

జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు,



జిల్లాలో కొనసాగుతున్న రీ సర్వే పనులు, ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణ, ఎస్ఐఆర్ ప్రక్రియ వేగవంతం చేసి నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. బుధవారం జిల్లాలోని మందమర్రి మండలంలో కొనసాగుతున్న రీ సర్వే పనులను క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) వి. రాములు, మాట్లాడుతూ రీ సర్వే ప్రక్రియలో నిర్దేశించిన పనులను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని తెలిపారు. మందమర్రి మండల తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి, కార్యాలయ పనులపై సమీక్ష నిర్వహించారు. జి.ఓ. ఎం.ఎస్. నం. 76, 59, 58 క్రింద చేపడుతున్న భూముల క్రమబద్ధీకరణ పనుల పురోగతి, ఎస్ఐఆర్ ప్రక్రియని పరిశీలించి వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భూ భారతి దరఖాస్తులు, మీ-సేవ ద్వారా జారీ చేయవలసిన పెండింగ్ ధ్రువపత్రాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ దరఖాస్తుదారులకు నిర్ణీత సమయంలోగా జారీ చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ సతీష్ కుమార్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రవళిక మృతి ఆ కుటుంబానికి తీరని లోటు : తుళ్లూరి బ్రహ్మయ్య.



మణుగూరు ఆర్టీసీ డిపోలో మహిళా కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న గుండ్ల ప్రవళిక మృతి పట్ల తుళ్లూరి బ్రహ్మన్న తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విధి నిర్వహణ సమయంలో చోటుచేసుకున్న దురదృష్టకర ఘటనలో తీవ్రంగా గాయపడి హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ప్రవళిక మృతి చెందడం తనను కలచివేసిందని అన్నారు. ఆమె మృతి కుటుంబానికి తీరని లోటని, ముఖ్యంగా కన్నతల్లికి ఈ విషాదం భరించలేనిదని ఆవేదన వ్యక్తం చేశారు.ముఖ్యమంత్రి ప్రకటనతో కుటుంబానికి ధైర్యంప్రవళిక కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని, అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించడం హర్షణీయమని బ్రహ్మన్న పేర్కొన్నారు. కష్టకాలంలో బాధిత కుటుంబానికి ప్రభుత్వం భరోసా కల్పించడం వారికి కొంత ధైర్యాన్ని ఇస్తుందని అన్నారు.ప్రవళికను కోల్పోయిన కుటుంబ సభ్యులకు, ముఖ్యంగా ఆమె తల్లికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు బాధిత కుటుంబానికి అవసరమైన సహాయం అందించాలని కోరారు. ప్రవళిక తల్లి ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ఆ భగవంతుడు ప్రసాదించాలని ప్రార్థిస్తున్నట్లు బ్రహ్మన్న తెలిపారు.

అల్టిట్యూడ్ పాఠశాలలో సైబర్ నేరాలపై అవగాహన సదస్సు

మాదకద్రవ్యాలు, ఆన్‌లైన్ గేమ్స్, సెల్‌ఫోన్ పై విద్యార్థులకు అవగాహన





ఎల్కతుర్తి మండల కేంద్రంలోని సెయింట్ థామస్ అల్టిట్యూడ్ పాఠశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాల వినియోగం, ఆన్‌లైన్ గేమ్స్, సెల్‌ఫోన్ దుర్వినియోగం, సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఏఎస్ఐ శంకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఏఎస్ఐ శంకర్ మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిసలు కావద్దని సూచించారు. సెల్‌ఫోన్‌ను అవసరమైన మేరకే వినియోగించాలని, అపరిచిత వ్యక్తులతో వ్యక్తిగత వివరాలు పంచుకోవద్దని తెలిపారు.అనుమానాస్పద లింకులను క్లిక్ చేయకూడదని, ఓటీపీలు ఎవరికీ చెప్పకూడదని సూచించారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని వివరించారు.

గడ్డంపల్లి రహదారికి మోక్షమెప్పుడో ....?



గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి సమస్యతో గడ్డంపల్లి ప్రజలు ఏడాదిన్నరగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారి పూర్తిగా దెబ్బతిని, అడుగడుగునా గుంతలు ఏర్పడటంతో నిత్యం రాకపోకలకు అవస్థలు తప్పడం లేదు. వర్షపు నీరు గుంతల్లో నిల్వ ఉండటంతో పరిస్థితి మరింత దయనీయంగా మారిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడే ప్రమాదం ఉందని, విద్యార్థులు, మహిళలు, వృద్ధులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఏడాదిన్నరగా సమస్య కొనసాగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపకపోవడంపై గ్రామ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.కనీస మౌలిక సదుపాయమైన రహదారిని కల్పించడంలో ఇంత జాప్యం ఎందుకని అధికారులను ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గ్రామ రహదారిని క్షేత్రస్థాయిలో పరిశీలించాలని కోరుతున్నారు. తాత్కాలిక మరమ్మతులతో సరిపెట్టకుండా నాణ్యమైన రోడ్డు నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేసి పనులు వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేస్తున్నారు.

- రహదారి నిర్మించాలి.. లేకుంటే ఉద్యమిస్తాం...!

రహదారి నిర్మాణ పనులు ఎప్పుడు చేపడతారో అధికారులు స్పష్టమైన ప్రకటన చేయాలని గ్రామస్తులు కోరారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించకపోతే గ్రామ ప్రజలు, యువత, మహిళలు, గ్రామ పెద్దలు, మహిళా సంఘాల సభ్యులతో కలిసి ప్రజాస్వామ్యబద్ధంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

పాత పాఠశాలలు, కళాశాలలకు ఫైర్ ఎన్ఓసీ నిబంధనలు సరళతరం

నవంబర్ 10 నుంచి కొత్త మార్గదర్శకాలు అమల్లోకి..
మూడు సంవత్సరాల పాటు ఎన్ఓసీ చెల్లుబాటు

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్,

నవంబర్ 4: రాష్ట్రంలోని ఇప్పటికే ఉన్న పాఠశాలలు, జూనియర్, ఇంటర్మీడియట్ కళాశాలలకు ఫైర్ ఎన్ఓసీ జారీ నిబంధనలను తెలంగాణ అగ్నిమాపక శాఖ సరళతరం చేసింది. పాత భవనాల్లో అదనపు ఖాళీ స్థలాలు, రెండో మెట్ల మార్గం ఏర్పాటు వంటి అంశాల్లో విద్యాసంస్థలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఆచరణ సాధ్యమైన కొత్త మార్గదర్శకాలను ప్రకటించింది. ఈ మేరకు తెలంగాణ అగ్నిమాపక, విపత్తు స్పందన, అత్యవసర సేవలు, పౌర రక్షణ శాఖ డైరెక్టర్ జనరల్ విక్రమ్ సింగ్ మాన్ (ఐపీఎస్) సవరించిన నిబంధనలను వెల్లడించారు. ఈ మార్గదర్శకాలు నవంబర్ 10 నుంచి అందే ఎన్ఓసీ దరఖాస్తులకు వర్తించనున్నాయి. విద్యాసంస్థల యాజమాన్య సంఘాల నుంచి వచ్చిన వినతులు, సెప్టెంబర్ 8న సంబంధిత భాగస్వాములతో నిర్వహించిన సమావేశంలో వ్యక్తమైన అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నారు. పాత భవనాల్లో నిర్మాణపరమైన పరిమితులను దృష్టిలో ఉంచుకుంటూనే విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది ప్రాణ భద్రతకు అవసరమైన చర్యలను తప్పనిసరిగా అమలు చేయాలన్నది శాఖ ఉద్దేశం.

అదనపు ఖాళీ స్థలాల ఏర్పాటు తప్పనిసరి కాదు

కొత్త మార్గదర్శకాల ప్రకారం విద్యాసంస్థల ప్రాంగణాల్లో ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఖాళీ స్థలాలనే పరిగణనలోకి తీసుకుంటారు. అదనంగా ఖాళీ స్థలాలను ఏర్పాటు చేయాలని తప్పనిసరిగా కోరరు. అయితే నిర్దేశిత సెట్‌బ్యాక్‌లు తక్కువగా ఉండి, పక్కన రహదారి సౌకర్యం లేని వైపుల నుంచి అగ్ని వ్యాప్తి చెందకుండా ప్రత్యామ్నాయ రక్షణ చర్యలు చేపట్టాలి. ఇందుకోసం వాటర్ కర్టెన్లు ఏర్పాటు చేయడంతో పాటు నాలుగు వైపుల నుంచి అగ్నిమాపక నీటిని అందించే ఫైర్ బ్రిగేడ్ ఇన్‌లెట్‌ను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది.

భవనాల వర్గీకరణ ఆధారంగా భద్రతా చర్యలు

భవనాల ఎత్తు, నిర్మాణ స్వరూపాన్ని బట్టి అవసరమైన అగ్నిమాపక, ప్రాణ భద్రతా పరికరాలను ఏర్పాటు చేయాలి. ఇందులో అగ్నిమాపక పరికరాలు, ప్రథమ చికిత్స హోస్ రీల్స్, చేతితో నిర్వహించే ఎలక్ట్రానిక్ ఫైర్ అలారం వ్యవస్థలు, డ్రౌన్‌కమర్లు, పైకప్పుపై అగ్నిమాపక నీటి నిల్వ ట్యాంకులు, పంపులు ఉన్నాయి. అవసరమైన చోట రసాయన, కంప్యూటర్ ప్రయోగశాలలు, సర్వర్ గదుల్లో మాడ్యులర్ స్ప్రింక్లర్ వ్యవస్థలను ఏర్పాటు చేయాలి. రెండో మెట్ల మార్గానికి సంబంధించిన అవసరాలను కూడా భవనాల వర్గీకరణ, వర్తించే భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా పరిశీలించనున్నారు.

అత్యవసర మార్గాల్లో అడ్డంకులు ఉండకూడదు

ఫైర్ ఎన్ఓసీ నిబంధనలను సరళతరం చేసినప్పటికీ కీలకమైన భద్రతా ప్రమాణాల విషయంలో రాజీ ఉండదని శాఖ స్పష్టం చేసింది. మెట్ల మార్గాలు, కారిడార్లు, బయటకు వెళ్లే ద్వారాలు, అత్యవసర మార్గాల్లో ఎలాంటి అడ్డంకులు ఉండకూడదు. అత్యవసర తరలింపు దిశలోనే బయటకు వెళ్లే ద్వారాలు తెరుచుకునేలా ఉండాలి. అత్యవసర లైటింగ్, వెలిగే లేదా చీకటిలోనూ కనిపించే ఎగ్జిట్ సూచికలు ఏర్పాటు చేయాలి. అగ్నిమాపక నీటి నిల్వలను ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచాలి.

అలాగే అత్యవసర తరలింపు ప్రణాళికలు, అత్యవసర ఫోన్ నంబర్లు, అగ్ని భద్రతా సూచనలను అందరికీ కనిపించే ప్రదేశాల్లో ప్రదర్శించాలి. పాఠశాల భద్రతా సలహా కమిటీలు, అగ్ని భద్రతా కార్యాచరణ బృందాలను ఏర్పాటు చేయాలి. అత్యవసర స్పందన ప్రణాళికలు, అగ్ని భద్రతా పుస్తకాలను సిద్ధం చేయడంతో పాటు సిబ్బందికి శిక్షణ, విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. విద్యుత్ భద్రత, పరికరాల నిర్వహణ, ప్రథమ చికిత్స సదుపాయాలపైనా ప్రత్యేక దృష్టి పెట్టాలి.

స్వీయ ధ్రువీకరణ విధానం యథాతథం

ఫైర్ ఎన్ఓసీ కోసం దరఖాస్తు చేసుకునే ముందు విద్యాసంస్థల యాజమాన్యాలు వర్తించే భద్రతా నిబంధనలను పాటించాలి. ఇప్పటికే ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం అమల్లో ఉన్న స్వీయ ధ్రువీకరణ విధానాన్ని కొత్త మార్గదర్శకాలు పరిమితం చేయవు. సంబంధిత నిబంధనలు, షరతులకు అనుగుణంగా యాజమాన్యాలు ఈ విధానాన్ని కొనసాగించవచ్చు. అగ్నిమాపక శాఖ ఎన్ఓసీ అవసరమైన సంస్థల దరఖాస్తులను కొత్త మార్గదర్శకాలు, నిర్దేశిత పత్రాలు, భద్రతా ప్రమాణాల ఆధారంగా పరిశీలిస్తారు.

మూడేళ్ల పాటు ఎన్ఓసీ చెల్లుబాటు

కొత్త నిబంధనల ప్రకారం జారీ చేసే ఆక్యుపెన్సీ ఎన్ఓసీ మూడేళ్ల పాటు చెల్లుబాటులో ఉంటుంది. గడువు ముగియడానికి రెండు నెలల ముందుగానే సంబంధిత విద్యాసంస్థల యాజమాన్యాలు నిర్దేశిత విధానంలో, వర్తించే రుసుము చెల్లించి పునరుద్ధరణకు దరఖాస్తు చేసుకోవాలి.

ఈ మార్గదర్శకాలు నవంబర్ 10, 2026 నుంచి అందే ఎన్ఓసీ దరఖాస్తులకు వర్తిస్తాయి. సవరించిన నిబంధనలతో పాత విద్యాసంస్థలకు భవన నిర్మాణ పరమైన ఇబ్బందులు తగ్గడంతో పాటు విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది భద్రతకు అవసరమైన అగ్నిమాపక ఏర్పాట్లు మరింత పటిష్ఠమవుతాయని అగ్నిమాపక శాఖ భావిస్తోంది.

యాదవుల ఆత్మగౌరవానికి పెద్దపీట..
సదర్ సమ్మేళనానికి రాష్ట్ర పండుగ హోదా: సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 4:

యాదవుల ఆత్మగౌరవం తెలంగాణ ప్రజలందరి ఆత్మగౌరవమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన సదర్ సమ్మేళన కార్యక్రమంలో ఆయన పాల్గొని యాదవ సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. సదర్ సమ్మేళనం కేవలం యాదవులకే పరిమితమైన వేడుక కాదని, తెలంగాణ సమాజం గర్వించదగిన ఆత్మగౌరవ వేడుక అని పేర్కొన్నారు. హైదరాబాద్ నగర అభివృద్ధిలో యాదవుల పాత్ర ఎంతో కీలకమని సీఎం కొనియాడారు. ప్రస్తుతం గోల్కొండ కోటగా పిలుస్తున్న ప్రాంతం ఒకప్పుడు గొల్లంకొండగా ప్రసిద్ధి చెందిందని గుర్తుచేశారు. యాదవ సోదరుల సహకారం, ఆదరణతోనే హైదరాబాద్ నగరం ఇంతగా అభివృద్ధి చెందిందన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి నగరానికి వచ్చిన ప్రజలను యాదవులు ఆదరించి అక్కున చేర్చుకున్నారని ప్రశంసించారు. గతంలో ఏ ముఖ్యమంత్రి కూడా సదర్ సమ్మేళనాన్ని రాష్ట్ర పండుగగా ప్రకటించాలనే ఆలోచన చేయలేదని, తమ ప్రభుత్వం యాదవుల ఆకాంక్షలను గౌరవిస్తూ సదర్ సమ్మేళనానికి రాష్ట్ర పండుగ హోదా కల్పించిందని రేవంత్ రెడ్డి తెలిపారు.



సమ్మేళనం నిర్వహణ కోసం ప్రభుత్వం రూ.5 కోట్లు మంజూరు చేసిందని వెల్లడించారు.

తెలంగాణలో తమ ప్రభుత్వం కులగణన నిర్వహించి దేశానికే ఆదర్శంగా నిలిచిందని సీఎం అన్నారు. తెలంగాణ మోడల్‌ను దేశంలోని ఇతర రాష్ట్రాలు అనుసరించేలా కులగణన చేపట్టామని పేర్కొన్నారు. తమ ప్రభుత్వంలో యాదవులకు సముచిత రాజకీయ, సామాజిక ప్రాధాన్యత కల్పించామని తెలిపారు. అనిల్ కుమార్ యాదవ్‌కు రాజ్యసభ సభ్యుడిగా, నవీన్ యాదవ్‌కు ఎమ్మెల్యేగా అవకాశం కల్పించామని, ఈశ్వరమ్మ యాదవ్‌ను యాదగిరిగుట్ట ఆలయ బోర్డు సభ్యురాలిగా నియమించామని వివరించారు. యాదగిరిగుట్ట గోశాలలో గోవుల సంరక్షణకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. భవిష్యత్తులో యాదవులకు దక్కాల్సిన వాటా వారికి దక్కేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. యాదవ సోదరుల ఆత్మగౌరవానికి ఎక్కడా భంగం కలగకుండా చూసుకునే బాధ్యత తమ ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు.

తెలంగాణను దేశంలోనే అభివృద్ధి చెందిన రాష్ట్రంగా నిలబెట్టడమే తమ ప్రభుత్వ లక్ష్యమని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. మూసీ అభివృద్ధి, మెట్రో రైలు విస్తరణ, భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణం వంటి కీలక ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం చేపడుతున్న ఈ కార్యక్రమాలకు యాదవ సోదరులు సహకరించాలని ఆయన కోరారు. యాదవుల సంక్షేమం, ఆత్మగౌరవం, రాజకీయ ప్రాధాన్యతకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

ఎల్బీ స్టేడియంలో ఆధునీకరించిన టెన్నిస్ కాంప్లెక్స్‌ను ప్రారంభించిన మంత్రులు వాకిటి శ్రీహరి, పొన్నం ప్రభాకర్

తెలంగాణను దేశంలోనే ప్రముఖ క్రీడా కేంద్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 4:

రాష్ట్రంలో క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధి, క్రీడాకారులకు మెరుగైన వసతుల కల్పనలో భాగంగా హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో ఆధునీకరించిన టెన్నిస్ కాంప్లెక్స్‌ను రాష్ట్ర క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి శ్రీ వాకిటి శ్రీహరి, హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ బుధవారం ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో ప్రభుత్వ క్రీడా సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి, క్రీడా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీమతి వాణి ప్రసాద్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఎండీ డాక్టర్ సోనీ బాలాదేవి, మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాలాచారి, శంకర్ గీతా కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవ రెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ

రాష్ట్రంలో క్రీడా రంగాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రజా ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోందని తెలిపారు. ఖేలో ఇండియా క్రీడల నిర్వహణ బాధ్యతలు తెలంగాణకు లభించడం రాష్ట్రానికి గర్వకారణమని, ఈ అవకాశం కల్పించిన కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఖేలో ఇండియా క్రీడలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. సీఎం కప్‌తో పాటు పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల స్థాయిలో క్రీడా పోటీల నిర్వహణకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని పేర్కొన్నారు.గతంలో నిరుపయోగంగా ఉన్న స్టేడియాలను పునరుద్ధరించి, క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకువస్తున్నామని తెలిపారు. యంగ్ ఇండియా స్పోర్ట్స్ స్కూల్స్ ఏర్పాటు ద్వారా తెలంగాణను దేశంలోనే ప్రముఖ క్రీడా కేంద్రంగా తీర్చిదిద్దడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వెల్లడించారు. ఖేలో ఇండియా నిర్వహణలో హైదరాబాద్ నగరంలోని జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, మెట్రో వాటర్ వర్క్స్, పోలీస్ తదితర శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. క్రీడా పాఠశాలలు ఉన్న ప్రాంతాల్లోనూ పోటీల నిర్వహణకు చర్యలు తీసుకోవాలని, కరీంనగర్ స్పోర్ట్స్ స్కూల్ వంటి సంస్థలకు తగిన ప్రాధాన్యత కల్పించాలని అధికారులకు సూచించారు.క్రీడా అవకాశాలు జిల్లా కేంద్రాలకే పరిమితం కాకుండా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల క్రీడాకారులకు సమానంగా అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచిన వారికి ప్రభుత్వ ఉద్యోగాలు, ఉన్నత విద్యలో



ప్రవేశాలు పొందే అవకాశాలు ఉన్నందున యువత క్రీడలను కూడా ఒక మంచి కెరీర్‌గా ఎంచుకోవాలని పిలుపునిచ్చారు.

జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచే క్రీడాకారులను ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సహిస్తుందని తెలిపారు. క్రీడాకారుల విజయాల్లో క్రీడా ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని, విద్యార్థులకు నాణ్యమైన శిక్షణ అందించి రాష్ట్రానికి కీర్తి ప్రతిష్ఠలు తీసుకురావాలని కోరారు.మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ, ఖేలో ఇండియా క్రీడల నిర్వహణ బాధ్యతలు తెలంగాణకు దక్కడం అంత సులభంగా సాధ్యపడలేదని, రాష్ట్రానికి ఈ అవకాశం తీసుకురావడానికి ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేసిందని తెలిపారు. రాష్ట్రంలో క్రీడా రంగ అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.800 కోట్లు కేటాయించిందని వెల్లడించారు. దక్షిణ కొరియాలో కేవలం 32 ఎకరాల విస్తీర్ణంలోనే క్రీడా హబ్‌ను ఏర్పాటు చేసి, క్రీడా రంగంలో విశేష ఫలితాలు సాధిస్తున్నారని ఉదహరించారు. తెలంగాణలో వేలాది ఎకరాల భూమి అందుబాటులో ఉన్నందున అంతర్జాతీయ ప్రమాణాలతో క్రీడా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసేందుకు విస్తృత అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచే వారికి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించడంతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తోందని తెలిపారు. ఇటీవల ఆసియా క్రీడల్లో రెండు స్వర్ణ పతకాలు సాధించిన క్రీడాకారిణి చికితకు కూడా త్వరలో అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని వెల్లడించారు.

క్రీడల ద్వారా అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందే అవకాశం లభిస్తుందని, క్రీడల్లో విజయం సాధించడానికి ఆర్థిక స్థోమత కంటే ప్రతిభ, నైపుణ్యం, కృషి, పట్టుదల ముఖ్యమని పేర్కొన్నారు. ప్రతిభ ఉన్న క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహించడమే ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు.

క్రీడా ఉపాధ్యాయులు విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించి, వారికి అత్యుత్తమ శిక్షణ అందించాలని, తద్వారా తెలంగాణ క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ వేదికలపై పతకాలు సాధించి రాష్ట్ర ప్రతిష్ఠను ఇనుమడింపజేయాలని మంత్రి ఆకాంక్షించారు.

ఖేలో ఇండియా క్రీడల నిర్వహణను రాష్ట్రానికి ప్రతిష్ఠాత్మక అంశంగా పరిగణించి, అన్ని ప్రభుత్వ శాఖలు, క్రీడా సంస్థలు సమన్వయంతో పనిచేయాలని, దేశవ్యాప్తంగా తెలంగాణ ఆతిథ్యం, నిర్వహణ సామర్థ్యం ప్రశంసలు పొందేలా సమష్టి కృషి చేయాలని మంత్రులు కోరారు.

విశాఖ ఆర్ఐఎన్ఎల్ భూముల వేలంలో రూ.218 కోట్ల బిడ్లు

రెండో దశలో 114 స్థలాల వేలం పూర్తి.. కనీస ధరపై 17.96 శాతం అధిక విలువ

న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 04:

విశాఖ ఉక్కు కర్మాగారాన్ని నిర్వహిస్తున్న రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (ఆర్ఐఎన్ఎల్)కు చెందిన భూముల రెండో దశ ఈ--వేలం విజయవంతంగా ముగిసింది. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖలోని ప్రభుత్వ రంగ సంస్థల విభాగం పరిధిలో పనిచేసే నేషనల్ ల్యాండ్ మానిటైజేషన్ కార్పొరేషన్ (ఎన్ఎల్ఎంసీ) నవంబర్ 3న ఈ ప్రక్రియను పూర్తి చేసింది.రెండో దశలో 114 స్థలాలకు మొత్తం రూ.218 కోట్ల విలువైన విజయవంతమైన బిడ్లు నమోదయ్యాయి. వీటి మొత్తం కనీస నిర్ణీత ధర రూ.184.8 కోట్లు కాగా, దానికంటే 17.96 శాతం అధిక విలువ లభించింది. పోటీ బిడ్డింగ్ ద్వారా ప్రభుత్వ మిగులు ఆస్తుల విలువను వెలికితీయడంలో ఈ--వేలం విధానం సమర్థంగా పనిచేసినట్లు ఎన్ఎల్ఎంసీ తెలిపింది.ఈ దశలో చదరపు గజానికి అత్యధికంగా రూ.1,82,650 ధర నమోదైంది. ఒక స్థలానికి కనీస నిర్ణీత ధరతో పోలిస్తే అత్యధికంగా 67.65 శాతం అదనపు ధర లభించింది. విశాఖపట్నంలో అనుకూల ప్రాంతాల్లో ఉన్న స్థలాలపై మార్కెట్ ఆసక్తి కొనసాగుతోందని ఈ ఫలితాలు సూచిస్తున్నాయి.మొదటి దశలో 150 స్థలాలను వేలం వేయగా, రూ.366.33 కోట్ల విలువైన విజయవంతమైన బిడ్లు వచ్చాయి. వాటి మొత్తం కనీస నిర్ణీత ధర రూ.312.48 కోట్లు కాగా, సగటున 17.23 శాతం అధిక విలువ నమోదైంది. ఆ దశలో చదరపు గజానికి అత్యధిక ధర రూ.1.80 లక్షలు దాటింది.రెండు దశల్లో కలిపి మొత్తం 264 స్థలాల వేలం పూర్తయింది. వీటికి రూ.584.33 కోట్ల విలువైన విజయవంతమైన బిడ్లు నమోదయ్యాయి. పారదర్శకమైన, పోటీతో కూడిన సాంకేతిక ఆధారిత విధానంలో ప్రభుత్వ మిగులు ఆస్తుల నగదీకరణకు ఈ ప్రక్రియ దోహదపడిందని ఎన్ఎల్ఎంసీ పేర్కొంది.

ధన్‌తేరస్ వేళ ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలి

ఆరోగ్యకరమైన జీవనశైలి కుటుంబ బాధ్యత కావాలి: కేంద్ర మంత్రి ప్రతాప్‌రావు జాధవ్

న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 04:

ధన్‌తేరస్ వేడుకల్లో ఆరోగ్య పరిరక్షణ, వ్యాధి నివారణకు ప్రాధాన్యం ఇవ్వాలని కేంద్ర ఆయుష్ శాఖ స్వతంత్ర సహాయ మంత్రి, ఆరోగ్య--కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి ప్రతాప్‌రావు జాధవ్ ప్రజలకు పిలుపునిచ్చారు. మంచి ఆరోగ్యమే నిజమైన సంపద అని, కుటుంబమంతా ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు.

ధన్వంతరి జయంతితో ముడిపడిన ధన్‌తేరస్ పండుగ ఆరోగ్య ప్రాధాన్యాన్ని గుర్తుచేస్తుందని మంత్రి పేర్కొన్నారు. బంగారం, వెండి, గృహోపకరణాల కొనుగోలుతో పాటు దీర్ఘకాలిక ఆరోగ్య పరిరక్షణపైనా కుటుంబాలు దృష్టి సారించాలని కోరారు.

వ్యాధి వచ్చిన తర్వాత చికిత్స గురించి ఆలోచించడంతో పాటు, వ్యాధులు రాకుండా నివారణ చర్యలు తీసుకోవడం అవసరమని తెలిపారు. ఆరోగ్యవంతుల ఆరోగ్యాన్ని కాపాడాలనే ఆయుర్వేద సూత్రం 'స్వస్థస్య స్వాస్థ్య రక్షణం' ప్రాధాన్యాన్ని వివరించారు. శారీరక శ్రమ తగ్గడం, ఒత్తిడి, అసంక్రమిత వ్యాధుల పెరుగుదల నేపథ్యంలో రోజువారీ అలవాట్లలో మార్పులు అవసరమన్నారు.సమతుల ఆహారం, నిత్య వ్యాయామం, తగిన నిద్ర, ఒత్తిడి నియంత్రణ ఆరోగ్య పరిరక్షణలో కీలకమని చెప్పారు. ఇంట్లో తయారుచేసిన పోషకాహారానికి ప్రాధాన్యం ఇవ్వాలని, జంక్ ఫుడ్ అధిక వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. యోగా సాధన, సకాలంలో ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడంతో పాటు వృద్ధుల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కోరారు.ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల వంటి కార్యక్రమాలు ప్రజలకు ఆయుష్ ఆధారిత ఆరోగ్య సేవలను చేరువ చేస్తున్నాయని మంత్రి తెలిపారు. సంప్రదాయ వైద్య విధానాల్లో శాస్త్రీయ పరిశోధనలు, నాణ్యతా ప్రమాణాలు, ఆధారాలతో కూడిన వైద్య పద్ధతులకు ప్రాధాన్యం ఉండాలని స్పష్టం చేశారు.

ఈ ధన్‌తేరస్ నుంచి ప్రతి ఒక్కరూ కనీసం ఒక మంచి ఆరోగ్య అలవాటును ప్రారంభించి, కుటుంబంలోని మరొకరినీ ప్రోత్సహించాలని జాధవ్ పిలుపునిచ్చారు. మహిళలు, చిన్నారులు, వృద్ధుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపుతూ అవసరమైనప్పుడు సకాలంలో వైద్య సలహా తీసుకోవాలని సూచించారు. ఆరోగ్యకరమైన జీవనాన్ని కుటుంబ ఉమ్మడి బాధ్యతగా స్వీకరించాలని కోరారు.

డీప్‌టెక్, ఆవిష్కరణల కేంద్రంగా తెలంగాణ

పారిశ్రామిక రంగం వృద్ధి రేటు 8.1 శాతం... రూ.3.04 లక్షల కోట్లకు జీఎస్‌వీఏ
ఎమర్జింగ్ టెక్నాలజీస్, పరిశ్రమలు, తయారీ రంగాలకు ప్రాధాన్యం
ఫిక్కీ వందేళ్ల వేడుకలు, 'తెలంగాణ డీప్ -- టెక్ లీడర్ షిప్ సమ్మిట్'లో మంత్రి శ్రీధర్ బాబు



హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 4:

తెలంగాణను ప్రపంచ స్థాయి డీప్‌టెక్, ఆవిష్కరణల కేంద్రంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ప్రపంచ ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేయబోయే ఏఐ, క్వాంటం టెక్నాలజీ, రోబోటిక్స్, సైబర్ సెక్యూరిటీ, సెమీకండక్టర్లు, అడ్వాన్స్డ్ మ్యానుఫ్యాక్చరింగ్ రంగాల్లో పరిశోధన, ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాలను రాష్ట్రంలో ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. బుధవారం బేగంపేట్ లోని ఐటీసీ కాకతీయలో నిర్వహించిన ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(ఫిక్కీ) వందేళ్ల వేడుకలు, 'తెలంగాణ డీప్ -- టెక్ లీడర్ షిప్ సమ్మిట్'లో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... ఫిక్కీ వందేళ్ల ప్రస్థానం భారత పారిశ్రామిక రంగ పరిణామానికి అద్దం పడుతోందన్నారు. 2025--26లో రాష్ట్ర జీఎస్‌వీఏలో పారిశ్రామిక రంగం వాటా 8.1 శాతం వృద్ధి రేటుతో రూ.3.04 లక్షల కోట్లకు చేరిందన్నారు. స్టేట్ మర్చండైజ్ ఎక్స్ పోర్ట్స్ 39.3 శాతం పెరిగాయన్నారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దేందుకు ఎమర్జింగ్ టెక్నాలజీస్, పరిశ్రమలు, తయారీ రంగాల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యమిస్తున్నామని మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. ప్రభుత్వం, పరిశ్రమలు, సంస్థల సమష్టి భాగస్వామ్యంతోనే ఆర్థిక ప్రగతి సాధ్యమవుతుందన్నారు. ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు ముందుకు రావాలని పరిశ్రమలు, పారిశ్రామికవేత్తలు, నిపుణులు, ఆవిష్కర్తలను ఆయన ఆహ్వానించారు. కార్యక్రమంలో ఫిక్కీ తెలంగాణ ఛాప్టర్ చైర్మన్ వి.వి. రామరాజు, కో - చైర్మన్ జయదేవ్ మీలా, ఎఫ్ టీసీసీఐ ప్రెసిడెంట్ కె.కె.మహేశ్వరి, అపోలో హాస్పిటల్స్ ఎంటర్ ప్రైజెస్ జాయింట్ ఎండీ సంగీతా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘మై భారత్’లో ఖేలో భారత్ క్విజ్ ప్రారంభం

నవంబర్ 20 వరకు అవకాశం.. అగ్రస్థానంలోని 100 మందికి ఫిట్ ఇండియా బహుమతులు

న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 04:

దేశ క్రీడా రంగ అభివృద్ధి, స్వదేశీ క్రీడా పరికరాల తయారీ, అంతర్జాతీయ పోటీల్లో భారత క్రీడాకారుల ప్రతిభపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు కేంద్ర క్రీడల శాఖ ప్రత్యేక క్విజ్‌ను ప్రారంభించింది. ‘ఖేలో భారత్: ఫ్రమ్ మాన్యుస్క్రిప్ట్ టు పోడియం ఫినిష్’ పేరుతో మై భారత్ పోర్టల్‌లో బుధవారం ప్రారంభమైన ఈ క్విజ్ నవంబర్ 20 వరకు అందుబాటులో ఉంటుంది. ఉత్తమ ప్రతిభ కనబరిచిన తొలి 100 మందికి ఫిట్ ఇండియా బ్రాండెడ్ వస్తువులను బహుమతులుగా అందజేయనున్నారు.విద్యార్థులు, యువత, ఉద్యోగులు, క్రీడాభిమానులతోపాటు భారత పౌరులందరూ ఈ క్విజ్‌లో పాల్గొనవచ్చు. వయస్సు, లింగం, విద్యార్హత, రాష్ట్రం ఆధారంగా ప్రత్యేక పరిమితులు లేవు. మొత్తం 20 ప్రశ్నలకు



15 నిమిషాల్లో సమాధానాలు ఇవ్వాలి. పాల్గొనే ముందు మై భారత్ పోర్టల్‌లో అందుబాటులో ఉన్న అధ్యయన సమాచారాన్ని చదవాలని నిర్వాహకులు సూచించారు.రూ. 1,856.67 కోట్ల వ్యయంతో చేపట్టిన ఖేలో ఇండియా క్రీడా పరికరాల తయారీ పథకం ఈ క్విజ్‌లో ప్రధాన అంశంగా ఉంటుంది. పెట్టుబడులకు మద్దతు, తయారీ కేంద్రాలు, ఉత్పత్తి ప్రోత్సాహకాలు, నాణ్యత పరీక్షలు, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి, స్టార్టప్‌ల ప్రోత్సాహం వంటి అంశాలపై ప్రశ్నలు ఉంటాయి. దేశీయ తయారీని పెంచడం, ఉపాధి అవకాశాలు కల్పించడం, ఎగుమతులను ప్రోత్సహించడం ఈ పథకం లక్ష్యాలు.జపాన్‌లోని ఐచి--నగోయాలో జరిగిన 2026 ఆసియా క్రీడలు, ఆసియా పారా క్రీడల్లో భారత ప్రాతినిధ్యానికి సంబంధించిన అంశాలను కూడా క్విజ్‌లో చేర్చారు. ఆసియా క్రీడల్లో భారత్ తరపున 501 మంది, ఆసియా పారా క్రీడల్లో 168 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. క్షేత్రస్థాయిలో క్రీడలను ప్రోత్సహించడం నుంచి ప్రతిభావంతులను అంతర్జాతీయ వేదికలకు తీర్చిదిద్దడం వరకు ఖేలో ఇండియా పోషిస్తున్న పాత్రపై ఈ కార్యక్రమం అవగాహన కల్పించనుంది.

వృద్ధులకు అండగా ‘వయో సమ్మాన్ రాష్ట్రీయ అభియాన్’

తరాల మధ్య అనుబంధమే లక్ష్యం.. కేంద్ర మంత్రి వీరేంద్ర కుమార్ ప్రారంభం

న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 04:

వృద్ధులు, యువత మధ్య అనుబంధాన్ని బలోపేతం చేసేందుకు కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖ మంత్రి డాక్టర్ వీరేంద్ర కుమార్ బుధవారం ‘వయో సమ్మాన్ రాష్ట్రీయ అభియాన్’ను ప్రారంభించారు. అటల్ వయో అభ్యుదయ యోజన కింద చేపట్టిన ఈ జాతీయ కార్యక్రమం ద్వారా వయోవృద్ధుల అనుభవం, విజ్ఞానాన్ని యువత శక్తితో అనుసంధానించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రచార కార్యక్రమ మార్గదర్శక పుస్తకాన్ని ఆవిష్కరించి, ‘వయో సాథీ’ స్వచ్ఛంద సేవా కార్యక్రమాన్ని ప్రారంభించారు. హాజరైన వారితో వయో సమ్మాన్ ప్రతిజ్ఞ చేయించారు.

వృద్ధులతో పరిచయం పెంచుకోవడం, సంభాషించడం, కలిసి కార్యక్రమాలు చేపట్టడం, సమాజానికి తోడ్పడడం, ఆ అనుబంధాన్ని నిరంతరం కొనసాగించడం అనే ‘5సీ’ విధానంలో అభియాన్ అమలవుతుంది. పంచాయతీలు, స్థానిక సంస్థలు, విద్యాసంస్థల సహకారంతో ప్రతి గ్రామం, ప్రతి బస్తీకి కార్యక్రమాన్ని విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

దేశంలో 60 ఏళ్ల దాటిన వారి జనాభా 2011లో సుమారు 10 కోట్లు ఉండగా, 2036 నాటికి 23 కోట్లకు చేరుతుందని



అంచనా వేస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. పట్టణీకరణ, వలసలు, కుటుంబ వ్యవస్థలో మార్పులతో తరాల మధ్య పరస్పర సంబంధాలు తగ్గుతున్నాయని అన్నారు. దీనివల్ల వృద్ధుల్లో ఒంటరితనం, సంక్షేమ పథకాలపై అవగాహన లోపం, సైబర్ మోసాల బారినపడే ప్రమాదం వంటి సమస్యలు ఎదురవుతున్నాయని వివరించారు.

యువత వృద్ధులకు డిజిటల్ పరిజ్ఞానాన్ని అందిస్తే, పెద్దలు యువతకు జీవిత విలువలను నేర్పుతారని మంత్రి అన్నారు. ఈ దీపావళికి ఇంట్లోనూ, పరిసరాల్లోనూ ఏ వృద్ధుడూ ఒంటరిగా ఉండకుండా చూడాలని, వారి గౌరవార్థం ఒక దీపం వెలిగించాలని పిలుపునిచ్చారు. పెద్దలతో అరగంట గడపడం, వైద్యుడి వద్దకు తోడుగా వెళ్లడం వంటి చిన్న సహాయాలు కూడా వారి జీవితాల్లో ఎంతో మార్పు తీసుకొస్తాయని చెప్పారు.

అభియాన్‌లో ‘కలిసి 30 నిమిషాలు’, పరస్పరం నైపుణ్యాలు నేర్చుకోవడం, జీవిత అనుభవాలను పంచుకోవడం, డిజిటల్ అక్షరాస్యత, ఆరోగ్య పరిరక్షణ, వృద్ధులను మార్గదర్శకులుగా ప్రోత్సహించడం తదితర 12 అంశాలకు ప్రాధాన్యం కల్పించారు.

‘వయో సాథీ’ కార్యక్రమంలో 18 ఏళ్లు నిండిన పౌరులు స్వచ్ఛంద సేవకులుగా చేరవచ్చు. ఆసక్తిగల వారు ఎస్‌సీడబ్ల్యూ సమావేశ్ పోర్టల్ లేదా జీవన్ యాప్ ద్వారా నమోదు చేసుకోవచ్చు. వృద్ధులకు స్నేహితులుగా, సహాయకులుగా వ్యవహరించే వాలంటీర్లకు వయో సాథీ ధ్రువపత్రం అందజేయనున్నారు.

వృద్ధుల సమగ్ర సంక్షేమం కోసం శ్రీరామచంద్ర మిషన్, జోధ్‌పూర్‌లోని అధ్యాత్మ విజ్ఞాన్ సత్సంగ్ కేంద్రంతో రెండు అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నారు. ధ్యానం, యోగా, ఆరోగ్య కార్యక్రమాలతోపాటు తరాల మధ్య అనుబంధాన్ని పెంచే సామాజిక కార్యక్రమాలను ఈ సంస్థల సహకారంతో నిర్వహించనున్నారు. కార్యక్రమంలో శాఖ కార్యదర్శి సుధాంశ్ పంత్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగులకు డీఏ పెంపునకు ఆమోదం తెలిపిన ఉప ముఖ్యమంత్రి భట్టికి

టీజీపీఈజేఏసీ కృతజ్ఞతలు
జూలై 2026 నుంచి 2.543 శాతం డీఏ పెంపు అమలు
విద్యుత్ రంగ కార్మికుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి సానుకూల స్పందన
ఎల్నినో ప్రభావంతో విద్యుత్ డిమాండ్ 20,018 మెగావాట్లకు పెరిగినా నిరంతర విద్యుత్ సరఫరా చేసిన సిబ్బందికి భట్టి అభినందనలు

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 4:

విద్యుత్ ఉద్యోగులకు కరువు భత్యం (డీఏ) పెంపునకు ఆమోదం తెలపడంపై తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం ప్రజాభవన్‌లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను టీజీపీఈజేఏసీ నాయకుల బృందం కలిసి ప్రభుత్వ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేసింది. జూలై 2026 నుంచి అమల్లోకి వచ్చేలా 2.543 శాతం డీఏ పెంపునకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందని, దీంతో విద్యుత్ ఉద్యోగుల డీఏ గతంలో ఉన్న 19.272 శాతం నుంచి 21.815 శాతానికి పెరిగిందని నాయకులు పేర్కొన్నారు.

విద్యుత్ రంగంలో పనిచేస్తున్న ఆర్టిజన్లకు సంబంధించిన వివిధ సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించినందుకు కూడా ఉప ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. సెలవులు, గ్రాట్యుటీ, పదోన్నతులు తదితర సమస్యలపై దృష్టి సారించాలని టీజీ ట్రాన్స్‌కో, టీజీ జెన్‌కో, రెండు విద్యుత్ పంపిణీ సంస్థలకు ఉప ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారని వెల్లడించారు. గత పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఈ సమస్యలను పరిశీలించి పరిష్కరించేందుకు భట్టి ఆసక్తి చూపడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ఎల్నినో ప్రభావంతో రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ గణనీయంగా పెరిగి 20,018 మెగావాట్లకు పైగా గరిష్ఠ స్థాయికి చేరుకున్నప్పటికీ నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయడంలో టీజీ ట్రాన్స్‌కో, టీజీ జెన్‌కో, టీజీ డిస్కం ఇంజినీర్లు, ఉద్యోగులు, ఆర్టిజన్లు సమష్టిగా చేసిన కృషి అభినందనీయమని అన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా రైతులు, గృహ వినియోగదారులు, పారిశ్రామిక సంస్థలకు విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయాలు లేకుండా సమర్థవంతంగా నిర్వహించిన విద్యుత్ సిబ్బంది సేవలను భట్టి విక్రమార్క ప్రత్యేకంగా ప్రశంసించారు.

విద్యుత్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి పీఆర్సీ -2026 ప్రక్రియను వేగవంతం చేయాలని జాక్ నాయకులు కోరగా, ఉప ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ?రానున్న రబీ సీజన్‌లోనూ రాష్ట్రవ్యాప్తంగా రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా జరిగేలా విద్యుత్ రంగ ఉద్యోగులందరూ అంకితభావంతో పనిచేస్తారని ఉప ముఖ్యమంత్రికి హామీ ఇచ్చినట్లు టీజీపీఈజేఏసీ కోఆర్డినేటర్ పరికె సదానందం తెలిపారు. ఉప ముఖ్యమంత్రిని కలిసిన వారిలో టీజీపీఈజేఏసీ కన్వీనర్ రత్నాకర్ రావు, సెక్రటరీ జనరల్ శ్రీధర్, 1104 అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ వజీర్, సదానందం, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

మాది మెరిట్ కోటా.. మీది మేనేజ్‌మెంట్ కోటా: బండి సంజయ్

బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలపై కేంద్ర మంత్రి తీవ్ర విమర్శలు -- ఆర్టీసీ కార్మికుల పట్ల మానవతా దృక్పథంతో వ్యవహరించాలని సూచన

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 4:

ట్విట్టర్ టిల్లు అంటూ బీఆర్ఎస్ నేతలపై కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాజకీయాల్లోకి వారసత్వంతో వచ్చి పదవులు సంపాదించుకున్న చరిత్ర బీఆర్ఎస్ నేతలదని, తాము మాత్రం ప్రజల కోసం పోరాడుతూ, లాఠీదెబ్బలు తింటూ, ఉద్యమాల ద్వారా కార్యకర్త స్థాయి నుంచి ఈ స్థాయికి ఎదిగామని స్పష్టం చేశారు. తమది మెరిట్ కోటా అయితే, బీఆర్ఎస్ నేతలది మేనేజ్‌మెంట్ కోటా అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు.

అమిత్ షా పాదయాత్రకు భారీ సంఖ్యలో కార్యకర్తలు, ప్రజలు తరలివచ్చిన నేపథ్యంలో జనాన్ని నియంత్రించేందుకు తాను వెళ్లానని బండి సంజయ్ తెలిపారు. అయితే తనను బౌన్సర్ అంటూ హేళన చేయడం సరికాదన్నారు. పార్టీకి వచ్చిన జనసందోహాన్ని క్రమబద్ధీకరించేందుకు వెళితే బౌన్సర్‌గా కనిపిస్తున్నానా? అని ప్రశ్నించారు. బౌన్సర్లతో కార్యకర్తలపై దాడులు చేయించిన సంస్కృతి బీఆర్ఎస్‌దేనని విమర్శించారు. అధికారంలో ఉన్నంతకాలం కార్యకర్తలను పట్టించుకోకుండా గాలికి వదిలేసిన చరిత్ర బీఆర్ఎస్‌దేనని ఆరోపించారు. తెలంగాణలో భూములను అమ్మి దోచుకున్న ఘనత ఆ పార్టీకే దక్కుతుందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా బీఆర్ఎస్ విస్మరించిందని, మియాపూర్ భూములను సైతం అడ్డికి పావుశేరుకు అమ్మి కేసీఆర్ కుటుంబం దోచుకోవాలని చూసిందని ఆరోపించారు.

ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కూడా బీఆర్ఎస్ బాటలోనే నడుస్తోందని బండి సంజయ్ విమర్శించారు. ఆరు



గ్యారంటీలను గాలికి వదిలేసి, మియాపూర్ భూములను విక్రయించి ఢిల్లీ పెద్దలకు కప్పం కట్టేందుకు సిద్ధమవుతున్నారని ఆరోపించారు.

ఆర్టీసీ కార్మికుల పట్ల మానవతా దృక్పథం అవసరం

మహిళల మధ్య జరిగిన తోపులాటలో కిందపడి ఆర్టీసీ కండక్టర్ మరణించడం అత్యంత బాధాకరమని బండి సంజయ్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉన్న కోపాన్ని ఆర్టీసీ కార్మికులపై చూపించి వారిపై పగ తీర్చుకునే ప్రయత్నం చేయవద్దని సూచించారు. అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ ఆర్టీసీ కార్మికులు ఎంతో ఓపికతో ప్రజలకు సేవలందిస్తున్నారని కొనియాడారు. పదవీ విరమణ అనంతరం పెన్షన్ సదుపాయం కూడా లేకపోవడంతో ఆర్టీసీ ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రిటైర్మెంట్ తర్వాత వారి జీవితం దుర్భరంగా మారుతోందన్నారు. ప్రతిరోజూ కోటి మంది ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు చేర్చడంలో ఆర్టీసీ కార్మికుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఎన్ని కష్టాలు ఎదురైనా ప్రజలకు నిరంతరం సేవలందిస్తున్న కార్మికుల పట్ల ప్రభుత్వం, ప్రజలు మానవతా దృక్పథంతో వ్యవహరించాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కోరారు.

దీపావళి వేళ చిన్నారుల కంటి భద్రతపై అప్రమత్తంగా ఉండాలి

బాణసంచా కాల్చేటప్పుడు తగిన జాగ్రత్తలు తప్పనిసరి
నవంబర్ 4 నుంచి 14 వరకు చిన్నారులకు వాసన్ ఐ కేర్‌లో ఉచిత చికిత్స



హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 4:

దీపావళి పండుగ సందర్భంగా బాణసంచా కాల్చేటప్పుడు తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని వాసన్ ఐ కేర్ వైద్యులు సూచించారు. టపాసులు కాల్చే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే కళ్లకు తీవ్ర గాయాలై చూపు కోల్పోయే ప్రమాదం ఉందని డాక్టర్ ఖాలీద్ లతీఫ్ , డాక్టర్ మరియా ఫారుకి , డాక్టర్ అంజలీ శుక్ల, డాక్టర్ కౌశిక్ హెచ్చరించారు. హైదరాబాద్ హిమాయత్ నగర్ లోని హాస్పిటల్ లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ... బాణసంచా నుంచి వెలువడే నిప్పురవ్వలు కళ్లపై పడినప్పుడు వెంటనే శుభ్రమైన నీటితో కళ్లను కడిగి, ఆలస్యం చేయకుండా కంటి వైద్యులను సంప్రదించాలని సూచించారు. ముఖ్యంగా చిన్నారులు టపాసులు కాల్చే సమయంలో పెద్దలు దగ్గరుండి పర్యవేక్షించాలని, ముఖానికి దగ్గరగా బాణసంచా కాల్చకుండా తగిన దూరం పాటించేలా చూడాలని తెలిపారు. ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా కంటికి శాశ్వత నష్టం కలిగే అవకాశం ఉందని హెచ్చరించారు. దీపావళి సందర్భంగా బాణసంచా ప్రమాదాలకు గురయ్యే చిన్నారులకు అండగా నిలిచేందుకు వాసన్ ఐ కేర్ ప్రత్యేక ఉచిత వైద్య సేవలను అందించనుంది. నాలుగు నుంచి 14 ఏళ్లలోపు పిల్లలకు హైదరాబాద్‌లోని అన్ని వాసన్ ఐ కేర్ ఆస్పత్రుల్లో నవంబర్ 4 నుంచి 14వ తేదీ వరకు ఉచితంగా చికిత్స అందించనున్నట్లు వైద్యులు తెలిపారు. కంటి గాయాలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకుని చిన్నారుల కంటి ఆరోగ్యాన్ని కాపాడాలని వారు కోరారు.

ఆత్మకూరు(ఎం)మండల కేంద్రంలో వీబీ-జీ రామ్ జీ పథకంపై మేట్స్‌కు శిక్షణ

కూలీలకు నిరంతర ఉపాధి కల్పించాలి:ఎంపీడీఓ రాములు నాయక్





యాదాద్రి భువనగిరి, నవంబరు04/ట్రైనెట్ న్యూస్:

యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం బుధవారం రోజు మండల కేంద్రంలో వీబీ-జీ రామ్ జీ కార్యక్రమంలో భాగంగా వివిధ గ్రామాల మేట్స్‌కు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల్లో కూలీలందరికీ నిరంతరంగా ఉపాధి పనులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కూలీలకు రోజుకు రూ.308 వేతనం అందేలా పనులు నిర్వహించాలని, ప్రతి కుటుంబానికి ఏడాదికి 125 రోజుల పని కల్పించేలా కృషి చేయాలని తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్లతో సమన్వయం చేసుకుంటూ పనుల్లో నాణ్యత, పారదర్శకత పాటించాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఏపీఓ బి రమేష్,ఇంచార్జి ఈసీ ఏ మల్లేష్, టీఏలు డి శ్రీశైలం,డి నిర్మలతో పాటు వివిధ గ్రామాల మేట్స్ పాల్గొన్నారు.

లిథియం, నికెల్ శుద్ధికి రూ.2,814 కోట్ల ప్రోత్సాహం

నాలుగు పరిశ్రమల ఏర్పాటుకు కేంద్ర కేబినెట్ ఆమోదం.. అర్హత కలిగిన పెట్టుబడిపై 30 శాతం మూలధన రాయితీ

న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 04:

దేశంలో కీలక ఖనిజాల శుద్ధి సామర్థ్యాన్ని పెంచేందుకు రూ.2,814 కోట్ల వ్యయంతో మూలధన వ్యయ మద్దతు పథకానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. లిథియం, నికెల్ ప్రాసెసింగ్‌ను ప్రోత్సహించే ఈ పథకం 2026--27 నుంచి 2030--31 ఆర్థిక సంవత్సరాల వరకు అమలుకానుంది.ప్రపంచవ్యాప్తంగా కీలక ఖనిజాల శుద్ధి కొద్ది ప్రాంతాలకే పరిమితం కావడంతో భౌగోళిక రాజకీయ పరిణామాలు, ధరల హెచ్చుతగ్గులు, సరఫరా ఆంక్షల ప్రభావం పెరుగుతోంది. దేశీయంగా శుద్ధి మౌలిక సదుపాయాలు ఇంకా అభివృద్ధి దశలో ఉండటంతో భారత్ అధిక స్వచ్ఛత కలిగిన ఖనిజ పదార్థాల కోసం దిగుమతులపై గణనీయంగా ఆధారపడుతోంది. ఈ పరిస్థితిని అధిగమించేందుకు దేశీయ ప్రాసెసింగ్ పరిశ్రమలకు ఆర్థిక మద్దతు అందించనున్నారు.పథకం కింద రెండు లిథియం, రెండు నికెల్ ప్రాసెసింగ్ ప్లాంట్ల ఏర్పాటుకు అర్హత కలిగిన పెట్టుబడిలో 30 శాతం మూలధన రాయితీ ఇవ్వనున్నారు. ఒక్కో లిథియం ప్లాంటుకు కనీసం 30 వేల టన్నులు, ఒక్కో నికెల్ ప్లాంటుకు కనీసం 50 వేల టన్నుల సామర్థ్యం ఉండాలి. లిథియం విభాగంలో ఒక్కో లబ్ధిదారుకు గరిష్ఠంగా రూ.500 కోట్లు, నికెల్ విభాగంలో రూ.900 కోట్ల వరకు మద్దతు అందించనున్నారు.లబ్ధిదారులను రెండు దశల్లో ఎంపిక చేస్తారు. మొదట సాంకేతిక అర్హతలను పరిశీలించి, అర్హత సాధించిన దరఖాస్తుదారులను ఆర్థిక బిడ్డింగ్‌కు అనుమతిస్తారు. ప్రతి ఖనిజ విభాగంలో అతి తక్కువ మూలధన మద్దతు కోరిన ఇద్దరు లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. నిర్దేశిత లక్ష్యాల సాధనకు అనుసంధానంగా మూడు విడతల్లో ప్రోత్సాహకాలు విడుదల చేస్తారు.లిథియం, నికెల్

నేటి వరకు ప్రారంభానికి నోచుకోని మధిర ఎక్సైజ్ శాఖ భవనం

డిప్యూటీ సీఎం నియోజకవర్గంలో ఎక్సైజ్ శాఖకు నేటికీ సొంత భవనం కరువు





మధిర:తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రాతినిధ్యం వహిస్తున్న మధిర నియోజకవర్గంలో విచిత్ర పరిస్థితి నెలకొంది. ఎక్సైజ్ శాఖకు సొంత భవనం నిర్మించి 15 ఏళ్లు పూర్తయినా ఇప్పటి వరకు అందుబాటులోకి రాలేదు.
మధిర పట్టణంలో ఎక్సైజ్ శాఖకు సొంత భవనాన్ని 2010లోనే పూర్తి చేశారు. నిర్మాణం అంతా పూర్తయినా ఎలాంటి మౌలిక సదుపాయాలు కల్పించకపోవడం, అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఆ భవనం ఇప్పటికీ ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో భవనం నిరుపయోగంగా పాడుబడుతోంది.మరోవైపు మధిర ఎక్సైజ్ స్టేషన్ సిబ్బంది నేటికీ అద్దె భవనంలోనే విధులు నిర్వహిస్తున్నారు.సొంత భవనం పక్కన ఉండి కూడా అద్దె భవనంలో పనిచేయడం,ప్రతి నెలా ప్రభుత్వం అద్దె చెల్లించాల్సి రావడం విమర్శలకు తావిస్తోంది.ఒకవైపు భవనం పూర్తయి ఉండి శిథిలావస్థకుచేరుకుంటుంటే, మరోవైపు అద్దె భవనంలో ఇరుకు గదుల్లో సిబ్బంది ఇబ్బందులుపడుతున్నారు. డిప్యూటీ సీఎం నియోజకవర్గంలోనే ఈ పరిస్థితి ఉండటంపై స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పూర్తయిన ఎక్సైజ్ భవనాన్ని వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని, మరమ్మతులు చేసి ప్రారంభించాలని ప్రజలు, ఎక్సైజ్ సిబ్బంది కోరుకుంటున్నారు.

కండక్టర్ ప్రవళిక మృతికి నిరసనగా మధిర డిపోలో విధుల బహిష్కరణ



మణుగూరు డిపోకు చెందిన ఆర్టీసీ కండక్టర్ ప్రవళికపై ప్రయాణికురాలు జరిపిన దాడిలో తీవ్రంగా గాయపడి, పది రోజులుగా హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో మృతి చెందారు.ఆమె మృతి పట్ల మధిర డిపో కార్మికులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, విధి నిర్వహణలో ఉన్న ఆర్టీసీ ఉద్యోగులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ బుధవారం మధిర డిపోలో మొదటి బస్సు నుంచే కార్మికులు విధులు బహిష్కరించి నిరసన చేపట్టారు.జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. ప్రజలకు నిరంతరం సేవలందిస్తున్న ఆర్టీసీ ఉద్యోగులపై దాడులు జరగడం దురదృష్టకరమని, దాడులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రవళిక కుటుంబానికి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.నిరసనలో డిపో జేఏసీ నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రవళికకు సంతాపం తెలిపారు.

నీటి నిల్వ పనులకు ప్రజలు అధిక ప్రాధాన్యతనివ్వాలి

:సర్పంచ్ దున్నా శ్రీనివాస్.



:నడిగూడెం ప్రభుత్వం చేపడుతున్న నీటి నిల్వ పనులకు అధిక ప్రాధాన్యతనిస్తూ రైతులు, ప్రజలు సహకరించాలని గ్రామ సర్పంచి దున్నా శ్రీనివాస్ కోరారు. బుధవారం నడిగూడెం మండల కేంద్రంలో జల సంరక్షణ కుంట పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావంతో గ్రామాల్లో నీటి ఎద్దడి రాకుండా ప్రభుత్వం చేపడుతున్న నీటి నిల్వ పనులు జల సంరక్షణ కుంటలు,పంటకుంటలు,నీటి కుంటలు,బోర్ వెల్ రీఛార్జి, ఇంకుడు గుంతలు నిర్మించాలని కోరారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి యలక ఉమారాణి,టెక్నికల్ అసిస్టెంట్ అంజిరెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ పద్మ, ఉపాధి కూలీలు జలీల్, వెంకన్న,శ్రీలేఖ, లింగయ్య,లక్ష్మి సుజాత,కళ్యాణి,మాధవి, రజిని,విజయమ్మ పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లకి గౌరవ వేతనం నెలకి 18000 రూపాయలు ఇవ్వాలి.

బెల్లంకొండ సత్యనారాయణ
రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి.



:నడిగూడెం. ఫీల్డ్ అసిస్టెంట్ లకి గౌరవ వేతనం నెలకి 18000 రూపాయలు ఇవ్వాలని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈనెల 15వ తారీకు నుండి 18 తారీకు వరకు నల్లగొండ జిల్లా కేంద్రంలో జరిగే అఖిలభారత కిసాన్ మహాసభలను జయప్రదం చేయాలని ప్రచారంలో భాగంగా నడిగూడెం మండల కేంద్రంలో ఫీల్డ్ అసిస్టెంట్లును కలిసి వారి సమస్యలను తెలుసుకున్న రైతు సంఘం,ప్రజాసంఘాల బృందం ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం తీసుకొచ్చిన 47 79 జీవోని రద్దుపరిచి ఫీల్డ్ అసిస్టెంట్ లకి న్యాయం చేయాలని, గత 20 సంవత్సరాల నుండి ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లుగా సేవలందిస్తున్నారని వారిని ప్రభుత్వ ఉద్యోగస్తులుగా గుర్తించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో గీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు, మాజీ వైస్ ఎంపీపీ కొరట్ల శ్రీనివాస్, రైతు సంఘం సీనియర్ నాయకులు వీరాంజనేయులు, ఎస్కే లతీఫ్ బాబు, సుధాకర్ రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ల మండల అధ్యక్షులు పద్మ ,కొరట్ల వెంకటేశ్వర్లు, అంబేద్కర్, సీతారాం రెడ్డి ,ఎస్.కె మాసంబి తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పర్యటనకు పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు

పోలీస్ కమిషనర్ రమేష్.

శేరిలింగంపల్లి:ముఖ్యమంత్రి ప్రతిపాదిత పర్యటన నేపథ్యంలో సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్ బుధవారం క్షేత్రస్థాయిలో పర్యటించి భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు.మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సున్నం చెరువు, తమ్మిడికుంట చెరువుల వద్ద చేపట్టాల్సిన ఏర్పాట్లను ఆయన స్వయంగా పరిశీలించారు. భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, బందోబస్తుపై అధికారులతో చర్చించారు.పర్యటన ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రజలకు, వాహనదారులకు ఇబ్బంది లేకుండా ట్రాఫిక్ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి జోన్ డీసీపీ రితిరాజ్, మాదాపూర్ డివిజన్ ఏసీపీ సీహెచ్. శ్రీధర్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ పి. రమేష్, ట్రాఫిక్ అధికారులు పాల్గొన్నారు.



భారీ వర్షాలక: ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఎస్ఐ బైరు గోపి.



ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సింగరేణి ఎస్సై బైరు గోపి సూచించారు. వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయని, రహదారులపైకి వరద నీరు చేరి రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోందని తెలిపారు. అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని, వాగులు దాటే సాహసం చేయవద్దని, పశువులను వాగుల వైపు తీసుకెళ్లవద్దని కోరారు.విద్యుత్ స్తంభాలు, తెగిన తీగలకు దూరంగా ఉండాలని, పిల్లలు చెరువులు, కుంటల వద్దకు వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. అప్రమత్తతే అతిపెద్ద రక్షణ అని, పోలీసుల మార్గదర్శకాలు పాటించాలని ఎస్సై పిలుపునిచ్చారు.

వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ దంపతుల ఆహ్వానం

వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, ఆయన సతీమణి మాలోత్ లలిత దంపతులు



సింగరేణి మండల ప్రజలకు ఆత్మీయ ఆహ్వానం పలికారు.తమ కుటుంబంలో జరగనున్న డా. గాయత్రి – రామ్ నాయక్‌ల నిశ్చితార్థ వేడుకకు మండల ప్రజలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించాలని కోరారు.
ఈ వేడుక నవంబర్ 6వ తేదీ శుక్రవారం ఉదయం 9:45 గంటలకు హైదరాబాద్‌లోని జూబ్లీ కన్వెన్షన్, జూబ్లీ హాల్స్‌లో జరగనుంది.

కోటగిరిలో జిల్లాస్థాయి గో విజ్ఞాన పరీక్ష

బోధన్ డివిజన్ కన్వీనర్ తోట శ్రీకాంత్



కోటగిరి: మండలం గోసేవ విభాగం ఆధ్వర్యంలో తెలంగాణ వ్యాప్తంగా జరుగుతున్న గోవిజ్ఞాన పరీక్షలలో భాగంగా ఇందు జిల్లాస్థాయి గోవిజ్ఞాన పరీక్షలను కోటగిరి మండల కేంద్రంలోని పీఎంశ్రీ జడ్పీహెచ్ఎస్ హైస్కూల్లో బుధవారం నిర్వహించారు.ఈ పరీక్ష బోధన్ డివిజన్ కన్వీనర్ శ్రీకాంత్ జీ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా గో సేవ విభాగ్ బోధన్ డివిజన్ కన్వీనర్ తోట శ్రీకాంత్ మాట్లాడుతూ..ఇందూర్ జిల్లాలోని కోటగిరి ఖండ పరిధిలోని కోటగిరి, రుద్రూర్ మండలాలలో గ్రామాతో పాటు వర్ని మండల గ్రామాలను కలిపి నిర్వహించిన లెవల్ 1 పరీక్షను గ్రామ స్థాయిలో 3500 మంది విద్యార్థిని విద్యార్థులు రాయగా అందులోంచి జిల్లా స్థాయికి ఎంపికైన 14 పాఠశాలల నుండి 265 మంది విద్యార్థిని విద్యార్థులు కోటగిరి మండల కేంద్రమైన కోటగిరి జిల్లా పరిషత్ పీఎంశ్రీ పాటశాలలో పరీక్షలు రాయడం జరిగిందనితెలిపారు.ఇందులో మంచి మార్కులు సాధించి ప్రతిభ చాటిన విద్యార్థిని విద్యార్థులను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేయడం జరుగుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో విబాగ్ గోసేవ కన్వీనర్ ఆట్కూరి రాజ్ కుమార్, పాఠశాల టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

చిన్నపాటి వర్షానికే బురదమయంగా ముత్యాలమ్మ గుడి ప్రధాన రోడ్డు



తొర్రూరు పట్టణంలోని 6 వ వార్డు ముత్యాలమ్మ గుడి ప్రధాన రోడ్డు చిన్న చిన్న వర్షపు చినుకులకే బురదమయంగా మారుతున్నాయి. దీంతో అటుగా రాకపోకలు సాగించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు బురద రోడ్లపై నడవలేక అవస్థలు పడుతున్నారు.ఇటీవల పైపులైన్ పనుల కోసం రోడ్డును తవ్వి పైపులైన్ ఏర్పాటు చేసినప్పటికీ, అనంతరం రోడ్డుకు సరైన మరమ్మతులు చేయకపోవడంతో ఈ దుస్థితి నెలకొంది. చిన్నపాటి వర్షం కురిసినా రోడ్డంతా బురదమయంగా మారి ప్రజలకు నరకప్రాయంగా మారుతోంది. ద్విచక్ర వాహనదారులు సైతం జారిపడే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.సంబంధిత అధికారులు,ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి పైపులైన్ పనుల కారణంగా ధ్వంసమైన రోడ్డుకు నాణ్యమైన మరమ్మతులు చేపట్టి, ప్రజలకు పాఠశాల విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

కూటమి విజయంతో కోదాడలో తెదేపా శ్రేణుల సంబరాలు



కోదాడ:ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఘనవిజయం సాధించిన సందర్భంగా కోదాడ పట్టణంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో విజయోత్సవ సంబరాలు అంబరాన్నంటాయి. బుధవారం కోదాడ పట్టణ తెదేపా అధ్యక్షులు కట్టా సతీష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో మాజీ ఇన్‌చార్జి ఓరుగంటి ప్రభాకర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈసందర్భంగా నాయకులు, కార్యకర్తలు ఒకరికొకరు స్వీట్లు తినిపించుకుని, బాణాసంచా కాల్చి ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏపీలో కూటమి సాధించిన విజయం ప్రజల నమ్మకానికి నిదర్శనమని నాయకులు పేర్కొన్నారు. ఈ విజయం కార్యకర్తల్లో కొత్త ఉత్సాహాన్ని నింపిందని నేతలు తెలిపారు.తెలంగాణలో కూడా రానున్న రోజుల్లో పార్టీకి పూర్వ వైభవం రాబోతున్నదని అన్నారు. జై తెలుగుదేశం, ఎన్టీఆర్ అమర్ హై అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో గురవయ్య, బాలకృష్ణ, శోభన్ బాబు, రేవంత్ రెడ్డి, సురేష్, ఉపేందర్ గౌడ్, రాఘవయ్య, ఆశిష్, అనిల్, సురేష్, నాగేశ్వరరావు, వెంకట్రావు, మాధవరావు, ఆఫీజ్, ఆంజనేయులు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనం నడిపితే జైలుకే

ఎస్ఐ ఏడుకొండలు.



అనంతగిరి మండల కేంద్రం లో వాహనాల తనిఖీలో మోతాదుకు మించి మద్యం సేవించి నటువంటి ఇద్దరు వ్యక్తులకు కోదాడ మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా వారికి ఒకరోజు జైలు శిక్షను విధించినారు, ఆ ఇద్దరు వ్యక్తులని హుజూర్నగర్ జైలుకు పంపించినట్లు ఎస్ఐ ఏడుకొండలు ఒక ప్రకటనలో తెలియజేశారు.

తూప్రాన్‌లో పోలీసుల కార్డన్ సెర్చ్.. 64 వాహనాలు స్వాధీనం







మెదక్ జిల్లా -- తూప్రాన్ : నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ, అసాంఘిక కార్యకలాపాలపై నిఘా మరింత పటిష్టం చేసే లక్ష్యంతో మెదక్ జిల్లా పోలీసులు తూప్రాన్ పట్టణంలోని 2బీహెచ్‌కే కాలనీలో బుధవారం భారీ స్థాయిలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్‌లో భాగంగా చేపట్టిన ఈ తనిఖీల్లో సుమారు 105 మంది పోలీసు సిబ్బంది పాల్గొని 450కు పైగా ఇళ్లను క్షుణ్ణంగా పరిశీలించారు.

ఈ సందర్భంగా పత్రాలు సక్రమంగా లేని 61 ద్విచక్ర వాహనాలు, మూడు త్రిచక్ర వాహనాలు కలిపి మొత్తం 64 వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ప్రతి ఇంటిలో నివసిస్తున్న వారి వివరాలను నమోదు చేయడంతో పాటు అనుమానాస్పద కదలికలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు.

తనిఖీల్లో భాగంగా నార్కోటిక్ డాగ్ “జూబి” సహాయంతో ఇళ్లలో, పరిసర ప్రాంతాల్లో మాదకద్రవ్యాల ఉనికి కోసం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. అలాగే ఫింగర్‌ప్రింట్ డివైజ్ ద్వారా వ్యక్తుల వేలిముద్రలను పరిశీలించి గతంలో నేరాలకు పాల్పడిన పాత నేరస్థులను గుర్తించే ప్రక్రియ చేపట్టారు.

ఈ సందర్భంగా మెదక్ జిల్లా అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ మాట్లాడుతూ, తూప్రాన్ పట్టణంలో దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు నివసిస్తూ తమ తమ ఉపాధి పనుల్లో నిమగ్నమై ఉంటారని తెలిపారు. అయితే కొందరు వ్యక్తులు చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉన్నందున వారిని గుర్తించి అరికట్టడమే ఈ కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ ముఖ్య ఉద్దేశమని చెప్పారు.

ఈ తనిఖీలు సాధారణ ప్రజలను ఇబ్బందులకు గురిచేయడానికి కాదని, వారి భద్రతను మరింత బలోపేతం చేయడానికేనని అదనపు ఎస్పీ స్పష్టం చేశారు. కాలనీల్లో నివసించే వారి పూర్వాపరాలను పరిశీలిస్తూ అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిరంతరం నిఘా కొనసాగిస్తున్నామని తెలిపారు.

ప్రజలు తమ పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులు లేదా అసాంఘిక కార్యకలాపాలను గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రజల సహకారంతో నేరరహిత సమాజ నిర్మాణానికి పోలీసులు కట్టుబడి ఉన్నారని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్, ఇన్‌స్పెక్టర్ వెంకటరాజ్ గౌడ్, నర్సాపూర్ సీఐ రంగకృష్ణ, ఎస్ఐలు, పోలీసు సిబ్బందితో పాటు సీసీఎస్, షీ టీమ్స్, డాగ్ స్క్వాడ్ బృందాలు పాల్గొన్నారు.

అనంతసాగర్ గ్రామపంచాయతీని సందర్శించిన డి.ఎల్.పి.ఓ

వాడుకలో లేని శిథిలా వ్యవస్థలో ఉన్న స్మశాన వాటిక సందర్శించిన డిఎల్పీఓ

మెదక్ జిల్లా చేగుంట మండలం అనంతసాగర్ గ్రామాన్ని బుధవారం రోజు నా డి ఎల్ పి ఓ సందర్శించడం జరిగింది స్మశాన వాటికను డంపింగ్ యార్డ్ ను మరియు పలు వీధులను సందర్శించి మురికి కాలువలు రోడ్లను పరిశీలించి రాష్ట్ర కేంద్ర నిధులతో కొత్త పనులు ప్రారంభించాలని సూచించారు ఈ సందర్భంగా డి ఎల్ పి ఓ సాయిబాబా మాట్లాడుతూ అనంతసాగర్ గ్రామంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ప్రధాన డ్రైనేజీ వ్యవస్థ మరియు రోడ్లు చెట్లు పల్లె అభివృద్ధి లక్ష్యంగా పనిచేయాలని తెలిపారు మునుముందు ఇంకా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని సర్పంచ్కి తెలియజేశారు సర్పంచ్ వెంకటేశం గారి శ్రీధర్ ఉప సర్పంచ్ చిక్కుడు స్వామి మాట్లాడుతూ త్వరలోనే గ్రామపంచాయతీ నిధులతో



రాష్ట్ర నిధులతో మా గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని వెల్లడించారు ఈ కార్యక్రమంలో డి ఎల్ పి ఓ సాయి బాబా గ్రామ సర్పంచ్ వెంకటేశం గారి శ్రీధర్ సెక్రెటరీ సునందరాజ్ ఉపసర్పంచ్ చిక్కుడు స్వామి వార్డు సభ్యులు వెంకటేశం గారి సిద్ధిరాములు శాలిపేట రేఖ రమేష్ మాసాపేట శ్రీనివాస్ మెండే శ్రీనివాస్ ఆర్టిఐ జిల్లా కార్యదర్శి చిక్కుడు మహేష్ ఆర్టిఐ జెంట్స్ సెక్రటరీ బుర్ర బిక్షపతి



తదితరులు పాల్గొన్నారు

వాడుకలో లేని స్మశాన వాటిక

గ్రామంలో సుమారు 10 సంవత్సరాల క్రిందట స్మశాన వాటిక నిర్మించిన గాని ఇప్పటికీ వాడకపోవడం గమనార్హంగా ఉందని తెలిపారు ఇకనైనా మరమ్మత్తులు చేసి స్మశానవాటికను అందరికీ సౌకర్య కరంగా ఉండాలని వెల్లడించారు

36కు 36 వార్డుల్లో కూటమి క్లీన్ స్వీప్.. మాచర్ల అభివృద్ధికి మరింత బాధ్యత పెరిగింది!

23,191 ఓట్ల భారీ మెజారిటీతో చైర్‌పర్సన్ అభ్యర్థి సుష్మాకేశవరెడ్డి అఖండ విజయం.. 36 కేకులతో ఘనంగా విజయోత్సవ సంబరాలు





మాచర్ల మున్సిపల్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు తిరుగులేని విజయాన్ని నమోదు చేసి, మొత్తం 36 వార్డులకు 36 వార్డులను కైవసం చేసుకోవడం పట్టణ రాజకీయాల్లో సరికొత్త చరిత్రగా నిలిచిందని శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. ప్రజలు అందించిన ఈ ఘన విజయం కేవలం రాజకీయ విజయమే కాకుండా, మాచర్ల పట్టణ సర్వతోముఖాభివృద్ధికి మరింత బాధ్యతను పెంచిందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

మున్సిపల్ ఎన్నికల్లో 36కు 36 కౌన్సిలర్ స్థానాలను కూటమి అభ్యర్థులు క్లీన్ స్వీప్ చేయడంతో పాటు, చైర్‌పర్సన్ అభ్యర్థి యెనుముల సుష్మాకేశవరెడ్డి 23,191 ఓట్ల భారీ మెజారిటీతో అఖండ విజయం సాధించడంపై బుధవారం స్థానిక నెహ్రూనగర్‌లోని టీడీపీ కార్యాలయంలో ఘనంగా విజయోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు అభినందనలు తెలిపారు.

ఈ సందర్భంగా విజయం సాధించిన 36 మంది కౌన్సిలర్లకు ఒక్కొక్కరికి ఒక్కో కేక్ చొప్పున మొత్తం 36 కేకులను ఏర్పాటు చేసి, వారి కుటుంబ సభ్యులు, కూటమి నాయకులు, కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం కౌన్సిలర్లను ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. చైర్‌పర్సన్ అభ్యర్థి యెనుముల సుష్మాకేశవరెడ్డి, ఆమె భర్తతో కలిసి భారీ కేక్ కట్ చేయించి ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ.. ప్రజలు కూటమిపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. 100 శాతం స్ట్రైక్‌రేట్‌తో ఘన విజయం సాధించిన కౌన్సిలర్లందరూ రాజకీయాలకు అతీతంగా పట్టణ అభివృద్ధిని ప్రధాన లక్ష్యంగా చేసుకుని పనిచేయాలని కోరారు. మాచర్ల పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రజాప్రతినిధులందరూ సమన్వయంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ప్రజలు అందించిన ఈ చారిత్రాత్మక విజయాన్ని అభివృద్ధి రూపంలో తిరిగి ప్రజలకు అందించడమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

ఇంట్లోనుండి టైలర్ షాపుకి వెళ్లి తిరిగి రాలేదు

ఆందోళనతో కుటుంబీకులు పి ఎస్ లో ఫిర్యాదు

మెదక్ జిల్లా, చేగుంట మండలం, మక్కరాజిపేట గ్రామానికి చెందిన బోయిని సుగుణ (44) తన కుమార్తె బోయిని వరలక్ష్మి (22) కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేశారు. వరలక్ష్మి మక్కరాజిపేట ప్రాథమిక పాఠశాలలో వాలంటరీ టీచర్‌గా పనిచేస్తోంది. 03.11.2026న ఇంట్లో ఉన్న ఆమె, సాయంత్రం సమయంలో కనిపించకుండా పోయింది. అదే గ్రామానికి చెందిన బంధువు బెస్త సత్య లక్ష్మి ని అడుగగా గా, బట్టలు కుట్టించుకోవడానికి టైలర్ షాపుకు వెళ్తున్నట్లు చెప్పి బ్యాగు తో బయటకు వెళ్లినట్లు తెలిసింది. కుటుంబ సభ్యులు బంధువులు, పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. ఆమె సెల్‌ఫోన్ కూడా స్విచ్ ఆఫ్‌లో ఉంది. తల్లి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు చేగుంట పీస్ యస్ ఐ పి చైతన్య కుమార్ రెడ్డి ఫిర్యాదు స్వీకరించి చట్టపరమైన చర్యలు చేపట్టారు.



పేద విద్యార్థుల ఉన్నత చదువులకు అండగా పంగులూరి అంజయ్య

పి-4 కార్యక్రమంలో బీటెక్ విద్యార్థికి ల్యాప్‌టాప్ అందజేత.. మరో 18 మంది విద్యార్థులకు ఆర్థికసాయం

జిల్లాపేదరికం కారణంగా ప్రతిభావంతులైన విద్యార్థుల ఉన్నత చదువులకు ఆటంకం కలగకూడదనే లక్ష్యంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఇచ్చిన పిలుపు మేరకు పి-4 (ప్ర4) కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పంగులూరి అంజయ్య తన వంతు సహకారం అందిస్తున్నారు.



కారంపూడి మండలం చింతపల్లి గ్రామానికి చెందిన ధూళిపాళ్ల నాగేశ్వరరావు కుమారుడు ఉమామహేశ్వరరావు ప్రస్తుతం బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా చదువుకు ఆటంకం కలగకుండా ఉండేందుకు పంగులూరి అంజయ్య ముందుకొచ్చి విద్యార్థికి అవసరమైన ల్యాప్‌టాప్‌తో పాటు విద్యా ఖర్చులకు ఆర్థిక సహాయం అందించారు.

ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు అదనంగా రూ.100 కోట్ల నిధులు విడుదల

రెండో సాధారణ ఎన్నికల నిర్వహణకు నిధుల కేటాయింపు.. ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

GOVERNMENT OF ANDHRA PRADESH
ABSTRACT

PR & RD Department - Budget Release Order for Rs.1,00,00,00,000/- (Rupees One hundred crore) as ADDITIONAL FUNDS to 2nd Ordinary Elections to MPTCs/ZPTCs in the State – Administrative Sanction - Accorded - Orders - Issued.

PANCHAYAT RAJ RURAL DEVELOPMENT (ELECTIONS & RULES) DEPT

G.O.RT.No. 1091 Dated: 04-11-2026
Read the following:

1. G.O.Rt.No.988 of PR&RD(E&R) Department dated 13.10.2026.
2. From the Commissioner, PR&RD, Letter No.3461808/CPR/ Elections/2026/MPTC-ZPTC, Date:22-10-2026.
3. From Commissioner, PR&RD e file C.No.3474173 dated 23.10.2026
4. G.O.Rt.No.1086 of PR&RD(E&R) Department dated 03.11.2026.
5. G.O.Rt.No.3109 of Finance (Budget-I) Dept., dt.04.11.2026.

<<0>>

ORDER:

In the circumstances reported by the Commissioner, PR&RD in the reference 2nd and 3rd read above and in pursuance of the BRO issued by the Finance Department in the GO 5th read above, Government, hereby accord administrative sanction for an amount of Rs.1,00,00,00,000 /- (Rupees One hundred crore) as additional funds for the purpose of conducting the 2nd Ordinary Elections to MPTCs/ZPTCs in the State, in relaxation of treasury control and quarterly regulation orders pending provision of funds by obtaining supplementary grants at an appropriate time during the C.F.Y 2026-27.

(Rs. in Lakhs)

S.No	Head of Account	Charged/ Voted	Provision in BE 2026-27	Addl. Amount sanctioned	Amount Re appropriated	Total provision in BE 2026-27	Amount already authorized	Amount authorized now	Balance amount available
Scheme Name : Elections to Panchayats Procedure for drawl of funds : Abstract Contingency Bill to be drawn by concerned DDO Drawing Officer : Concerned DDO									
1	2515001980010110111	V	80.59	8,804.00	0.00	8,884.59	384.59	8,500.00	0.00
2	2515001980010130138	V	0.00	1,500.00	0.00	1,500.00	0.00	1,500.00	0.00
Total			80.59	10,304.00	0.00	10,384.59	384.59	10,000.00	0.00

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రెండో సాధారణ ఎంపీటీసీ (ఫీజు), జెడ్పీటీసీ (గ్రాజు) ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం అదనంగా రూ.100 కోట్ల నిధులను మంజూరు చేసింది. ఈ మేరకు నిధుల విడుదలకు సంబంధించి ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ స్థానిక సంస్థలకు సంబంధించిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఆర్థిక వనరులను సమకూర్చే దిశగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఎన్నికల ప్రక్రియలో భాగంగా అవసరమైన పరిపాలనా ఏర్పాట్లు, సిబ్బంది విధులు, పోలింగ్ కేంద్రాల నిర్వహణ, ఎన్నికల సామగ్రి, ఇతర సంబంధిత ఖర్చులకు నిధులు అవసరమవుతాయి.

మురసు తుఫాన్ ప్రభావంతో పల్నాడు, గుంటూరు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. బలమైన ఈదురుగాలులతో కూడిన వర్షం

వర్షాలకు జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. పలుచోట్ల వాగులు, వంకలు



పొంగిపొర్లుతుండగా, రహదారులపై వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తోంది.

గుంటూరు జిల్లాలోని తిమ్మాపురం వాగులో వరద ప్రవాహం ఒక్కసారిగా పెరగడంతో పలువురు మహిళలు ప్రవాహంలో చిక్కుకున్నట్లు సమాచారం. దీంతో స్థానికంగా ఆందోళన నెలకొంది. వారిని సురక్షితంగా బయటకు తీసుకువచ్చేందుకు సంబంధిత అధికారులు, సహాయక బృందాలు తక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

భారీ ఈదురుగాలుల కారణంగా పలుచోట్ల విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకూలాయి. దీంతో ఉమ్మడి గుంటూరు జిల్లాలోని వందలాది గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పలుచోట్ల రాకపోకలకు కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

తుఫాన్ ప్రభావంతో వర్షాలు కొనసాగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వాగులు, వంకలు, వరద ప్రవహించే రహదారులను దాటేందుకు ప్రయత్నించవద్దని సూచిస్తున్నారు. విద్యుత్ స్తంభాలు, తెగిపడిన విద్యుత్ తీగలకు దూరంగా ఉండాలని అధికా

ఎన్నికల నిర్వహణను పర్యవేక్షించేందుకు పోలింగ్ ప్రాంతాలను 196 రూట్లుగా విభజన

, ఆయా ప్రాంతాల్లో భద్రత కోసం 56 స్టైకింగ్ ఫోర్సులు, 27 స్పెషల్ స్టైకింగ్ ఫోర్సులతో పాటు జోనల్ స్టైకింగ్ ఫోర్సులను ఏర్పాటు

పోలింగ్ సామగ్రి పంపిణీ నుంచి ఎన్నికల అనంతరం స్ట్రాంగ్ రూమ్‌లకు చేరే వరకు పూర్తి స్థాయి పోలీసు రక్షణ కల్పిస్తున్నట్లు తెలిపారు.



అతి సమస్యాత్మక, సమస్యాత్మక ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాల వద్ద డ్రోన్లు, సీసీ కెమెరాల ద్వారా నిరంతర నిఘా ఏర్పాటు చేశామన్నారు.

ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉన్న రౌడీషీటర్లతో సహా సుమారు 20 వేల మందిని బైండోవర్ చేసినట్లు తెలిపారు. వారి నుంచి రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు సెక్యూరిటీ బాండ్లు తీసుకున్నట్లు వివరించారు.

మద్యం, నగదు అక్రమ రవాణాను అరికట్టేందుకు చెక్‌పోస్టులు, ఫ్లయింగ్ స్క్వాడ్ల ద్వారా ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నట్లు ఎస్పీ వెల్లడించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్పీ కోరారు. ఎన్నికలకు సంబంధించి ఏదైనా అత్యవసర సమాచారం ఉంటే స్థానిక పోలీసులను లేదా 100, 112 టోల్‌ఫ్రీ నంబర్లను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

హీరోయిన్లకూ.. అలాంటి భారీ కటౌట్‌లు ఉండాలి: రెజీనా



చిత్ర పరిశ్రమలో హీరోలకు భారీ కటౌట్లు ఏర్పాటు చేయడం చూస్తుంటాం. అయితే హీరోయిన్లకూ అదే స్థాయిలో అభిమానుల నుంచి గుర్తింపు, గౌరవం దక్కాలంటున్నారు నటి రెజీనా . నయనతార నటిస్తున్న 'మూకుత్తి అమ్మన్-2' (తెలుగులో 'మహాశక్తి') విడుదల సందర్భంగా ఆమెకు 60 అడుగుల భారీ కటౌట్ ఏర్పాటు చేయడంపై రెజీనా హర్షం వ్యక్తం చేశారు. గతంలో హీరోలకే పరిమితమైన ఈ కటౌట్లు ఇప్పుడు కథానాయికలకూ దక్కడం మంచి మార్పన్నారు.

ఈ చిత్రంలో ప్రతినాయికగా నటించిన ఆమె.. ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. "దశాబ్దాలుగా తమిళ చిత్ర పరిశ్రమలో అగ్ర హీరోలకే భారీ కటౌట్లు ఏర్పాటు చేయడం చూస్తున్నాం. హీరోయిన్లకు అలాంటి గౌరవం దక్కడం చాలా అరుదు. నయనతారకు భారీ కటౌట్ ఏర్పాటు చేసిన తర్వాతే 'తాయ్ కిళవి' సినిమా కోసం రాధిక మేడమ్‌కు కూడా ఏర్పాటు చేశారని తెలిసింది. హీరోలతో సమానంగా భారీ కటౌట్లు ఏర్పాటు చేయడం పరిశ్రమలో మంచి మార్పు" అని ఆమె అభిప్రాయపడ్డారు.

"ఈ సినిమాతో తొలిసారి ఓ భారీ కమర్షియల్ చిత్రంలో ప్రతినాయికగా నటించే అవకాశం వచ్చింది. ఇదొక కొత్త అనుభూతి. ఒకే తరహా పాత్రలకు పరిమితం కావడం నాకు నచ్చదు. అందుకే కథల ఎంపిక విషయంలో జాగ్రత్తగా ఉంటున్నా. తక్కువ సినిమాలు చేసినా మంచి పాత్రలు ఎంచుకోవాలనుకుంటున్నా" అని ఆమె తెలిపారు. సుందర్ సి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో నయనతార , ఊర్వశి, రెజీనా కీలక పాత్రలు పోషిస్తున్నారు. నవంబరు 6న ఈ మూవీ ప్రేక్షకుల ముందుకు రానుంది.

విఘ్నేశ్ శివన్ దర్శకత్వంలో నజ్రియ?



తెరపై క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్‌తో సినీప్రియుల్లో మంచి క్రేజ్‌ని సొంతం చేసుకున్నారు మలయాళ తార నజ్రియా. 'సూక్ష్మదర్శిని' సినిమా తర్వాత కథానాయికగా ఆమె థియేటర్లలో సందడి చేసి రెండేళ్లైంది. అయినప్పటికీ ఆమె ఎప్పటికప్పుడు కొత్త ప్రాజెక్ట్‌లను ప్రకటిస్తూ తెర వెనుక నిర్మాతగా వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పుడామె హీరో సూర్య సరసన 'సీన్' చిత్రంతో ప్రేక్షకుల్ని పలకరించనున్నారు. ఈ నేపథ్యంలోనే తాజాగా నజ్రియా మరో తమిళ చిత్రంలో నటించనున్నట్లు తెలుస్తోంది. 'ఎల్ఐకే' సినిమాతో ఇటీవల ఆశించిన ఫలితాన్ని అందుకోలేకపోయారు దర్శకుడు విఘ్నేశ్ శివన్. ఇప్పుడాయన తదుపరి చిత్రంలో కథానాయిక కోసం నజ్రియాని సంప్రదించనున్నారట. ఇప్పటికే ఇందులో నటుడు అరవింద్ స్వామి, భరత్ ప్రధాన పాత్రల్లో ఖరారయ్యారని, రొమాంటిక్ కామెడీగా రూపొందనున్న ఈ సినిమాని ప్యాషన్ స్టూడియోస్, నయనతార నిర్మాణసంస్థ రౌడీ పిక్చర్స్ సంయుక్తంగా నిర్మించనున్నాయని సన్నిహిత వర్గాల సమాచారం.

'స్త్రీ 2' తర్వాత ఏ సినిమా చేయకపోవడానికి కారణమిదే: శ్రద్ధా కపూర్

భారీవిజయం తర్వాత వరుసగా సినిమాలకు సంతకాలు చేస్తుంటారు కథానాయికలు. కానీ, బాలీవుడ్ నటి శ్రద్ధా కపూర్ మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరించారు. ఆమె ప్రధానపాత్రలో నటించిన 'స్త్రీ 2' (2024) ప్రపంచవ్యాప్తంగా రూ.875 కోట్లకు పైగా వసూళ్లు సాధించి ఘన విజయాన్ని అందుకుంది. ఆ సినిమా తర్వాత వరుసగా అవకాశాలు వచ్చినా.. భారీ మొత్తాన్ని ఆఫర్ చేసినా కొత్త చిత్రాలకు అంగీకరించలేదని శ్రద్ధ తెలిపారు. తాజాగా సోషల్‌మీడియాలో నిర్వహించిన 'ఆస్క్ మీ ఎనీథింగ్' సెషన్‌లో ఆమె ఈ విషయాన్ని అభిమానులతో పంచుకున్నారు. సెషన్‌లో భాగంగా ఓ అభిమాని.. 'కెరీర్‌లో ముందుకెళ్లాలనుకునే యువతులకు మీరిచ్చే సలహా ఏంటని?' అడగ్గా.. ఆమె బదులిచ్చారు.

"నా అనుభవాన్నే చెబుతాను. 'స్త్రీ 2' తర్వాత నాకు చాలా సినిమా అవకాశాలు వచ్చాయి. మంచి పారితోషికాలు కూడా ఆఫర్ చేశారు. కానీ మనసుకు నచ్చిన కథ దొరికే వరకు ఓపికగా ఎదురుచూడాలని నిర్ణయించుకున్నా. అనుకున్నట్లే చేశా. మీ మనసు చెప్పేది వినండి. కొన్నిసార్లు అది కష్టంగా అనిపించినా.. చివరికి తగిన ఫలితం ఉంటుంది" అని ఆమె చెప్పారు.



ప్రస్తుతం శ్రద్ధ లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'ఈథా' చిత్రంలో నటిస్తున్నారు. ప్రముఖ లావణి కళాకారిణి 'విఠాబాయి నారాయణ్ గావ్‌కర్' జీవితం ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందించారు. డిసెంబర్ 4న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.

ఆమె మూడు సార్లు నా ఆఫర్‌ను రిజెక్ట్ చేసింది: సూర్య



సూర్య ప్రధాన పాత్రలో.. జీతూ మాధవన్ తెరకెక్కిస్తోన్న చిత్రం 'సీన్' నజ్రియా కథానాయికగా నటిస్తున్నారు. నవంబరు 6న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో సూర్య మాట్లాడుతూ.. పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. గతంలో నజ్రియా మూడు సార్లు తన ఆఫర్‌ను రిజెక్ట్ చేసినట్లు తెలిపారు. నాలుగో ప్రయత్నంలో అంగీకరించారని చెప్పారు.

"నా మూడు సినిమాల్లో నటించాల్సిందిగా నేను నజ్రియాని సంప్రదించా. వివిధ కారణాలతో ఆమె నా ఆఫర్లను తిరస్కరించింది. గత 12 ఏళ్లలో పలు తమిళ చిత్రాల్లో నటించే అవకాశాలు వచ్చినప్పటికీ ఆమె అంగీకరించలేదు" అని తెలిపారు. అవకాశాలను కోల్పోయినట్లుగా నజ్రియా భావించలేదని.. నచ్చిన కథలను ఎంచుకునే విషయంలో ఆమె చూపించే ఆత్మవిశ్వాసం అభినందనీయమని సూర్య ప్రశంసించారు. "12 ఏళ్ల తర్వాత తమిళ సినిమాల్లోకి తిరిగి రావడానికి ప్రధాన కారణం.. సూర్య సర్. గతంలో ఒకట్రెండుసార్లు వివిధ కారణాలతో ఆయనతో అవకాశాలను నేను తిరస్కరించా. ఇప్పుడు ఆయనతో కలిసి నటించడం చాలా సంతోషంగా ఉంది" అని నజ్రియా అన్నారు.



తాలి పాటతో దాదా!

ఈ క్రిస్మస్‌కి 'దాదా' చిత్రంతో బాక్సాఫీస్ బరిలో సందడి చేసేందుకు సిద్ధమవుతున్నారు నందమూరి బాలకృష్ణ. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న ఈ సినిమాని గోపీచంద్ మలినేని తెరకెక్కిస్తున్నారు. వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్నారు. కాజల్ అగర్వాల్ కథానాయిక. మంచు మనోజ్ ప్రతినాయకుడిగా నటిస్తున్నారు. ఈ చిత్రం ప్రస్తుతం ముగింపు దశకి చేరుకున్న నేపథ్యంలో తొలి పాటను వినిపించేందుకు చిత్ర బృందం సిద్ధమవుతోంది. దీపావళి సందర్భంగా ఈ గీతాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. ఇది ముంబయి నేపథ్యంగా సాగే గ్యాంగ్‌స్టర్ యాక్షన్ డ్రామాగా ముస్తాబవుతోంది. దీంట్లో కుటుంబ భావోద్వేగాలకు ఎంతో ప్రాధాన్యముంది. బాలయ్య ఇందులో రెండు కోణాలున్న పాత్రలో అలరించనున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రానికి సంగీతం: తమన్, ఛాయాగ్రహణం: అరవింద్ ఎస్ కశ్యప్.

నాకు జీవితంతో సమానం.... 'పాకెట్ రాకెట్స్'



'కమిటీ కుర్రోళ్ళు' చిత్రంతో నిర్మాతగా తొలి ప్రయత్నంలోనే జాతీయ పురస్కారాన్ని అందుకున్నారు నిహారిక కొణిదెల. ఇప్పుడామె తన పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ పతాకంపై మరో నిర్మాణ సంస్థ మాక్స్ సిటీ స్టూడియోస్‌తో కలిసి నిర్మించిన సినిమా 'పాకెట్ రాకెట్స్'. త్రినాథ్ వర్మ, నిర్మల్, శ్రియ కొంతం, జేడీ చక్రవర్తి ప్రధాన పాత్రధారులుగా నటించిన ఈ చిత్రాన్ని రుద్ర అత్రి తెరకెక్కించారు. ఇది డిసెంబరు 11న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే మంగళవారం హైదరాబాద్‌లో ఈ చిత్ర టీజర్ విడుదల చేశారు.

ఈ సందర్భంగా నిర్మాత నిహారిక కొణిదెల మాట్లాడుతూ.. "నాకు ఈ 'పాకెట్ రాకెట్స్' అనేది జీవితంతో సమానం. రోజూ ఉదయం నిద్ర లేచినప్పటి నుంచి రాత్రి పడుకునే వరకు మనుషులంతా జీవితంతో జూదం ఆడుతూనే ఉంటారు. ఈ సినిమాలో అంజి, జేడీ, ఏసు పాత్రలు తమ జీవితాల కోసం అలా నిరంతరం పందెం కాస్తూ ఉంటాయి. ఇది ఆద్యంతం చాలా ఆసక్తికరంగా ఉంటుంది" అన్నారు. "ఇదొక అర్బన్ డ్రామా సినిమా. ఇద్దరు కుర్రాళ్లు తమ జీవితాల్ని బాగు చేసుకోవడం కోసం ఎలాంటి రిస్క్ తీసుకున్నారు.. ఆ ప్రయాణంలో వాళ్లకి ఎవరెవరు పరిచయమయ్యారు అన్నది ఆసక్తికరంగా ఉంటుంది" అన్నారు నటుడు త్రినాథ్ వర్మ. నటుడు జేడీ చక్రవర్తి మాట్లాడుతూ.. "ఏడాది క్రితం ఈ కథ విన్నా. నాకు చాలా షాకింగ్‌గా అనిపించింది. దీన్ని దర్శకుడు రుద్ర ఎంత గొప్పగా తెరపైకి తీసుకొచ్చారన్నది థియేటర్లలో సినిమా చూసి తెలుసుకోండి" అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మల్, శ్రియా కొంతం, రాహుల్ రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

థియేటర్లలో అందర్నీ కడుపుబ్బా నవ్విస్తాం



"ప్రేక్షకుల్ని దృష్టిలో పెట్టుకుని చేసిన సినిమా 'ఈఎన్ఈ రిపీట్'. ఈ చిత్రం కచ్చితంగా ఆద్యంతం నవ్విస్తుంది" అన్నారు కథానాయకుడు విష్వక్ సేన్. ఆయన.. శ్రీనాథ్ మాగంటి, అభినవ్ గోమఠం, వెంకటేశ్ కాకుమాను ప్రధాన పాత్రధారులుగా తరుణ్ భాస్కర్ తెరకెక్కించిన చిత్రమిది. విజయవంతమైన 'ఈ నగరానికి ఏమైంది' సినిమాకి సీక్వెల్‌గా ఇది ముస్తాబైంది. దీన్ని సృజన్ ఎరబోలు, సందీప్ నాగిరెడ్డి నిర్మించగా.. శివాత్మిక రాజశేఖర్, అనీషా ఆంబ్రోస్ కథానాయికలుగా నటించారు. ఈ చిత్రం ఈ నెల 19న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే మంగళవారం హైదరాబాద్‌లో ఈ చిత్ర ట్రైలర్ విడుదల చేశారు. "ఈ సినిమాకి కచ్చితంగా కుటుంబ సమేతంగా రండి. 19న థియేటర్లలో అందర్నీ కడుపుబ్బా నవ్విస్తాం" అన్నారు దర్శకుడు తరుణ్ భాస్కర్.

రాప్తాడు ఘటన.. సినిమాను బలి పశువుగా చూపడమేనా?:సందీప్‌వంగా ఫైర్



అనంతపురం జిల్లా రాప్తాడులో 10వ తరగతి బాలికపై జరిగిన దాడి సర్వత్రా చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. హేమంత్ అనే ఉన్మాది తరగతి గదిలోకి వెళ్లి మరీ ఎలక్ట్రిక్ రంపంతో బాలికపై దాడి చేసిన ఘటన ప్రతి ఒక్కరినీ తీవ్రంగా కలచి వేసింది. అదే సమయంలో పాఠశాలల్లో చిన్నారుల భద్రత అంశంలోనూ అనేక ప్రశ్నలు మొదలయ్యాయి. దీనిపై సామాజిక మాధ్యమాల వేదికగా తీవ్ర చర్చ జరుగుతోంది. ముఖ్యంగా నేటి బాల బాలికలపై సినిమాలు, అందులోని హింస ప్రభావాన్ని తెలియజేస్తూ పలువురు పోస్టులు పెడుతున్నారు.

ముఖ్యంగా సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వంలో వచ్చిన 'యానిమల్' మూవీని కూడా చర్చలోకి తీసుకురావడం గమనార్హం. అందులో కథానాయకుడు తన సోదరిని ర్యాగింగ్ చేసిన వారికి వార్నింగ్ ఇవ్వడానికి కాలేజ్‌లోకి ఏకంగా గన్ తీసుకుని వెళ్తాడు. రాప్తాడు ఘటన కూడా ఇలాగే ఉందంటూ ఎక్స్ వేదికగా విమర్శలు మొదలయ్యాయి. సినిమాలు, ఆ తర్వాత వీడియో గేమ్‌ల్లో హింస.. పిల్లలు, యువతపై ప్రభావం చూపుతోందని విమర్శించడం మొదలు పెట్టారు. దీనిపై సందీప్‌రెడ్డి వంగా ఎక్స్ వేదికగా స్పందించారు.

నీటి సంరక్షణ చర్యలలో ప్రజలు భాగస్వాములు కావాలి,

●మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య,

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 4:

ఎల్ నినో కారణంగా రాబోవు కాలంలో తీవ్ర నీటి ఎద్దడి నెలకొనే అవకాశం ఉన్నందున నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. బుధవారం జిల్లాలోని దండేపల్లి మండలంలో వివిధ గ్రామాలలో పర్యటించి వి బి జి రామ్ జి పథకంలో నీటి సంరక్షణ చర్యలు, అభివృద్ధి పనుల నిర్వహణ అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య, మాట్లాడుతూ నీటి నిల్వకు సంబంధించిన జాగ్రత్తలు తీసుకోవాలని, నీటి సంరక్షణ చర్యలు పెద్ద ఎత్తున చేపట్టాలని తెలిపారు. వి బి జి రామ్ జీ క్రింద ఇంకుడు గుంతలు, నీటి తొట్టెలు, నీటి కుంటలు, పంట కుంటలు, వాననీటిని ఒడిసి పట్టే పైకప్పు వర్షపు నీటి సంరక్షణ నిర్మాణం వంటి నీటిని నిల్వ చేసే పనులకు ప్రాధాన్యత ఇచ్చి, అన్ని గ్రామాలలో పెద్ద ఎత్తున ఉపాధి హామీ కూలీలతో పనులు చేయించాలని సూచించారు.

రెబ్బనపల్లి గ్రామంలో వ్యవసాయ కుంటను శత్రు స్థాయిలో పరిశీలించి, పనులలో నిమగ్నమై ఉన్న 50 మంది కూలీలతో మాట్లాడి వారి బాగోగులను అడిగి తెలుసుకున్నారు. కూలీ వేతనం, పెన్షన్ దరఖాస్తులు, త్రాగునీరు, సౌకర్యాలు కల్పన అంశాలపై సమీక్షించారు. లింగాపూర్, మాకూలపేట్ గ్రామాల పరిధిలోని అటవీ భూములలో చేపట్టిన ఖండిత కందకాల పనులను పరిశీలించి కూలీలతో వారి సమస్యల వివరాలు అడిగి తెలుసుకున్నారు. మిషన్ భగీరథ క్రింద త్రాగునీటి సరఫరా





సమస్య అధికారి దృష్టికి తీసుకురాగా అప్పటికప్పుడు ఫోన్ ద్వారా మిషన్ భగీరథ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కు ఫోన్ చేసి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయం సమర్పించి మేట్లకు అందిస్తున్న శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. వి బి జి రామ్ జి పథకం క్రింద ఉన్నటువంటి వివిధ రకాల పనులను ఉపయోగించుకోవాలని, గ్రామాలలో పెద్ద ఎత్తున నీటి సంరక్షణ పనులు చేపట్టాలని, ప్రతి గ్రామంలో కూడా కనీసం 50 నుండి 60 మందికి తగ్గకుండా కూలీలు ప్రతిరోజు ఉపాధి హామీ పనులకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

అంతకుముందు గూడెం గ్రామపంచాయతీ పరిధిలోని పుష్కర్ ఘాట్ ను సందర్శించి పనులను పరిశీలించారు. ఇరిగేషన్, మిషన్ భగీరథ, పంచాయతీరాజ్ శాఖ ఇంజనీర్లతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేసి పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. గూడెంలోని జిల్లా పరిషత్ పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి అక్కడ విద్యార్థులతో మాట్లాడి వారికి కల్పిస్తున్న సౌకర్యాలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. రెబ్బనపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో కొనసాగుతున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులను పరిశీలించారు. వెల్గనూర్ గ్రామపంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతలను పరిశీలించారు. ద్వారక గ్రామపంచాయతీ పరిధిలోని జిల్లా పరిషత్ పాఠశాలను సందర్శించి తరగతి గదులు, మధ్యాహ్న భోజనం నాణ్యత, విద్యాబోధన అంశాలను పరిశీలించి విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టికాహారంతో పాటు నాణ్యమైన విద్య బోధన అందించాలని తెలిపారు. గ్రామపంచాయతీ పరిధిలో నిర్మించబడిన మ్యాజిక్ ఇంకుడు గుంతలు, కమ్యూనిటీ, వ్యక్తిగత ఇంకుడు గుంతల నిర్మాణాలను తనిఖీ చేశారు.

ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి ప్రసాద్, మిషన్ భగీరథ అసిస్టెంట్ ఇంజనీర్ అచ్యుత్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలి,

●మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్,

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 4:

జిల్లాలో ప్రభుత్వ విద్యాసంస్థలలో విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు, అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని భీమిని మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి పాఠశాలలో నూతనంగా నిర్మిస్తున్న అదనపు తరగతి గదులు, భోజన శాల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మాట్లాడుతూ నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని, వంట శాల, భోజన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. మండలంలోని మల్లిడి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి, పనుల పురోగతిని సమీక్షించారు. ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను





సందర్శించి విద్యార్థుల హాజరు, విద్యా ప్రమాణాలు, బోధనా తీరును పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. గ్రామపంచాయతీ పరిధిలో నూతనంగా నిర్మిస్తున్న వి.ఓ. భవన నిర్మాణ పనులను ప్రారంభించారు. మహిళా సంఘాల కార్యకలాపాలకు అవసరమైన వసతులు కల్పించేలా నిర్మాణ పనులను నాణ్యతతో చేపట్టాలని సూచించారు.అనంతరం కన్నెపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వైద్య సేవల నిర్వహణను పరిశీలించారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణం, పూర్తయిన భోజనశాలను పరిశీలించి, విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని, వంటశాల నిర్వహణ, ఇతర సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం రైతు వేదికలో ఉపాధి హామీ పథకం క్రింద నిర్వహిస్తున్న వి బి జి రామ్ జి శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. శిక్షణలో పాల్గొన్న సిబ్బందికి అందిస్తున్న అవగాహన, శిక్షణ కార్యక్రమాల నిర్వహణ తీరును పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో భీమిని మండల తహసిల్దార్ బికర్ణదాస్, కన్నెపల్లి మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్, సంబంధిత అధికారులు అధికారులు పాల్గొన్నారు.

బాధితులకు సత్వర న్యాయం చేకూర్చాలి

●అట్రాసిటీ కేసులు త్వరితగతిన పరిష్కరించాలి

●జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

●ఐడీఓసీలో జిల్లా కలెక్టర్, ఎస్పీ మహేష్ బి గితె, వివిధ శాఖల అధికారులతో జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 4:

ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం చేకూర్చాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.

జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో బుధవారం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధ్యక్షతన జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు.

ముందుగా జిల్లాలో ఇటీవల నియామకమైన నూతన కమిటీ సభ్యులను సన్మానించారు.

ఇంచార్జి జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి విజయ లక్ష్మి, ఈడీ ఎస్సీ కార్పొరేషన్

స్వప్న, ట్రైబల్ వెల్ఫేర్, మత్స్య, పరిశ్రమల శాఖ ఆద్వర్యంలో జిల్లాలో అమలవుతున్న పథకాలు, అభివృద్ధి పనులపై



వివరించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో విచారణ వేగంగా పూర్తి చేసి చార్జీ షీట్ వేస్తే బాధితులకు న్యాయంతోపాటు ప్రభుత్వ నిబంధనల మేరకు పరిహారం అందుతుందన్నారు.

ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ శాఖల సహకారంతో జిల్లాలో అట్రాసిటీ కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు బాధితులకు న్యాయం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

జిల్లాలో ఎస్సీ, ఎస్టీ పథకాల ప్రయోజనాలు అందిపుచ్చుకునేలా, అలాగే వారి సమస్యలను జిల్లా యంత్రాంగానికి తెలియజేసేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల కింద ఇప్పటి వరకు రూ.1, 81,57,500 పరిహారం అందించామని వెల్లడించారు. ప్రతి నెలా చివరి రోజున అన్ని మండలాల్లో ఆయా శాఖల ఆద్వర్యంలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ రెసిడెన్షియల్ విద్యాలయాలు, ఉపకార వేతనం, విదేశీ విద్యా, వివిధ ప్రభుత్వ సబ్సిడీ, ఉపాధి కల్పన పథకాలలపై సభ్యులు అవగాహన కల్పించాలని సూచించారు. స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ కొనసాగుతుందని తెలిపారు.

ఎస్పీ మహేష్ బి గితె మాట్లాడుతూ.. ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో విచారణ వేగంగా పూర్తి చేస్తున్నామని తెలిపారు. నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

సమావేశంలో డీఆర్ఓ జయశ్రీ, ఆర్డీవోలు శ్రీధర్ బాబు, కే ఎస్ బీ కుమారి, డీఎస్పీ శ్రీనివాసులు, జిల్లా మత్స్య శాఖ అధికారి సౌజన్య, పరిశ్రమల శాఖ జీఎం హనుమంతు, జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు బి.నరేష్ నాయక్, బీపేట రాజు, భూక్య రమేష్, బడుగు లింగయ్య, జోగు రవీందర్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తోట లహరి, వీర రమణయ్య, చింతోజు భాస్కర్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు

రైతుల ఖాతాల్లో వెంటనే నగదు జమ చేయాలి: హింగే భాస్కర్



రైతు భరోసా పథకం కింద రైతుల ఖాతాల్లో నగదు జమ చేసినట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేరుతో సందేశాలు పంపి, వాస్తవంగా డబ్బులు జమ కాకపోవడం రైతులను అయోమయానికి గురిచేస్తోందని తెలంగాణ రైతు రక్షణ సమితి హనుమకొండ జిల్లా అధ్యక్షుడు హింగే భాస్కర్ ఆవేదన వ్యక్తం చేశారు.బుధవారం తెల్లవారుజామున 4.30 గంటలకు పలువురు రైతులకు రైతు భరోసా కింద రూ.11,850 బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు సందేశాలు వచ్చాయని, అయితే ఖాతాలను పరిశీలించగా నగదు జమ కాలేదని తెలిపారు.ప్రభుత్వం అధికారికంగా నగదు జమ అయినట్లు సందేశాలు పంపినప్పుడు రైతుల ఖాతాల్లో వాస్తవంగా డబ్బులు జమ కావాలని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నగదు జమ కాకపోవడానికి గల కారణాలను వెల్లడించాలని, సందేశాలు అందుకున్న రైతులందరికీ రైతు భరోసా నిధులు జమ చేయాలని డిమాండ్ చేశారు.

మహబూబాబాద్‌లో భారీ చోరీ

ఇంటికి తాళం పగలగొట్టి ఐదు తులాల బంగారం, 40 తులాల వెండి, రూ.5 లక్షల నగదు అపహరణ

పట్టణంలోని రాహుల్ నగర్ కాలనీలో భారీ చోరీ ఘటన కలకలం రేపింది. ఇంట్లో ఎవరూ లేని సమయాన్ని అదునుగా తీసుకున్న గుర్తుతెలియని దుండగులు ఇంటి తాళం పగలగొట్టి లోపలికి ప్రవేశించారు. అనంతరం బీరువాలో భద్రపరిచిన ఐదు తులాల బంగారం, 40 తులాల వెండి, రూ. 5 లక్షల నగదును అపహరించి పరారయ్యారు.

చోరీ జరిగిన విషయాన్ని గుర్తించిన బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీమ్‌ను రంగంలోకి దించి వేలిముద్రలు, ఇతర ఆధారాలను సేకరిస్తున్నారు. నిందితులను గుర్తించేందుకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఈ ఘటనతో రాహుల్ నగర్ కాలనీ వాసులు ఆందోళనకు గురయ్యారు.

పోలీసుల విధులు.. చట్టాలపై విద్యార్థులకు అవగాహన

మత్తు పదార్థాలు,సైబర్ నేరాలకు దూరంగా ఉండాలి: ఎస్‌హెచ్‌ఓ నరసింహారావు



హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలోని శాంతినగర్ సెంటాన్ హైస్కూల్ విద్యార్థులకు బుధవారం ఎల్కతుర్తి పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌హెచ్‌ఓ నరసింహారావు పాల్గొని పోలీస్ స్టేషన్ పనితీరు, పోలీసుల విధులు, చట్టాలు, సామాజిక సమస్యలపై విద్యార్థులకు వివరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులను పరిశీలించి, సంఘటన పూర్వాపరాలను తెలుసుకున్న అనంతరం కేసు స్వభావాన్ని బట్టి సంబంధిత చట్టాల ప్రకారం కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ఎస్ఐ విధులు, పోలీస్ సిబ్బంది బాధ్యతలు, ఫిర్యాదుల స్వీకరణ, కేసుల విచారణ తదితర అంశాలను వివరించారు.పోలీస్ స్టేషన్‌లోని వివిధ విభాగాలు, మహిళా విభాగం, అధికారుల కార్యాలయాలను విద్యార్థులకు ప్రత్యక్షంగా చూపించారు.

దండేపల్లి భూ సమస్య పరిష్కారానికి హామీ

భూమి కోల్పోయే రైతులకు మూడింతల పరిహారం



అర్హులకు ఉద్యోగ అవకాశాలు: జాయింట్ కలెక్టర్ రవికుమార్

హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం దండేపల్లి గ్రామంలోని సర్వే నంబర్ 439 పంచరాయి భూముల సమస్య పరిష్కారానికి అధికారులు భరోసా కల్పించారు.భూములు కోల్పోతున్న రైతులతో మండల కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించి, పరిహారం, భూ హక్కులు, ఇతర అంశాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ రవికుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ అవసరాల కోసం భూములు సేకరించినప్పటికీ భూములు కోల్పోయే నిరుపేద రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. రిజిస్ట్రేషన్ విలువ ప్రకారం మూడింతల పరిహారం చెల్లిస్తామని, అర్హతను బట్టి కంపెనీలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.పట్టా పాసుపుస్తకాలు ఉన్నవారితో పాటు పహాణీలో పేర్లు ఉండి సాగు చేస్తున్న రైతులకు, పట్టాలు లేకపోయినా సాగులో ఉన్నవారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.భూ బాధితుల కమిటీ ఏర్పాటు చేసి ప్రభుత్వానికి నివేదిక అందించాలని సూచించారు.

నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించుకోవాలి: పొల్లేపాక వెంకటయ్య



దేవత్‌పల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ప్రజలందరూ నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని గ్రామపంచాయతీ 3వ వార్డు సభ్యులు పొల్లేపాక వెంకటయ్య విజ్ఞప్తి చేశారు. రానున్న రోజుల్లో ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గి నీటి కొరత ఏర్పడే అవకాశాలు ఉన్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ నీటి సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీరు ప్రకృతి ప్రసాదించిన అమూల్యమైన సంపద అని నీరు ఉంటేనే మనిషి జీవనం వ్యవసాయ పశుపోషణ సాధ్యమవుతాయని తెలిపారు. అందువల్ల ప్రతి ఇంట్లో నీటిని అవసరమైన మేరకే వినియోగించాలని కుళాయిల ద్వారా నీరు వృథాగా పోకుండా చూసుకోవాలని సూచించారు.ఇంటి అవసరాలకు వచ్చిన నీటిని జాగ్రత్తగా వాడుకోవడంతో పాటు నీటి ట్యాంకులు నిండిన తర్వాత మోటార్లు ఆపాలని పైపుల లీకేజీలు ఉంటే వెంటనే మరమ్మతులు చేయించుకోవాలని కోరారు.

ముఖ్యంగా తాగునీటిని వృథా చేయకుండా వ్యవసాయ అవసరాల్లోనూ నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు.గ్రామంలో ప్రతి ఒక్కరూ నీటి సంరక్షణను తమ బాధ్యతగా భావించి సహకరించాలని తెలిపారు.ప్రతి నీటి చుక్క విలువైనదే నేటి పొదుపే రేపటి భవిష్యత్తు అనే ఆలోచనతో గ్రామ ప్రజలందరూ నీటి సంరక్షణలో భాగస్వాములు కావాలని పొల్లేపాక వెంకటయ్య విజ్ఞప్తి చేశారు. గ్రామంలో నీటి సమస్యలు తలెత్తకుండా ప్రజలందరూ కలిసికట్టుగా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు.

ట్రైనెట్ తెలంగాణ న్యూస్
నిజం • బాధ్యత • నిబద్ధత
తెలుగు దిన పత్రిక

సాంస్కృతికం
మన సంస్కృతి.. మన గర్వం..

11
గురువారం నవంబర్ 05, 2026
www.trinetnews.com

రాష్ట్రవ్యాప్తంగా మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి వేడుకలు

లబ్ధిదారులు ,అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని పిలుపు

రాష్ట్రంలో 2,21,500 ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలు పూర్తి

వివిధ నిర్మాణ దశల్లో 1.90 లక్షల ఇందిరమ్మ ఇళ్లు

4 కార్పొరేషన్లలో హైదరాబాద్ తరహా ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం

రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 4:

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిరుపేదల కోసం నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ఇంతవరకు 2,21,500 ఇళ్లలో గృహప్రవేశాలు పూర్తయ్యాయని ఈ దీపావళి రోజున ప్రతి ఇందిరమ్మ ఇంటిలో దీపావళి వేడుకల జరపాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. ఆరోజున పేదల ఇంట్లో వెలిగే ప్రతిదీపం తెలంగాణ ప్రజాప్రభుత్వ సంకల్పానికి ప్రతీక కావాలన్నారు. బుధవారం నాడు మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి మంత్రి పొంగులేటి మాట్లాడారు.



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఈ ప్రజా ప్రభుత్వం ఎన్ని ఆర్థిక అవరోధాలున్నా పేదల ఆత్మగౌరవానికి చిహ్నమైన ఇందిరమ్మ ఇళ్లను నిర్మించేందుకు నిర్ణయించిందన్నారు. భద్రత, భరోసాతో పాటు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలన్న సంకల్పంతో తొలివిడత 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయగా ఇప్పటికి 2,21,500 ఇళ్లలో గృహ ప్రవేశాలు పూర్తయ్యాయని, మరో 1.90 లక్షల ఇళ్ళు వివిధ నిర్మాణదశల్లో పూర్తికానున్నాయని మంత్రి పొంగులేటి తెలిపారు. గృహ ప్రవేశాలు జరుపుకున్న ఇళ్లకు దీపావళి రోజున ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు, గృహ నిర్మాణ శాఖ అధికారులు, ఇందిరమ్మ ఇళ్ళ కమిటీ సభ్యులు, ఈ పథకంతో మమేకమైన అందరూ ఆ ఇళ్లకు వెళ్లి వారి ఆనందాల్లో భాగస్వాములు కావాలని కోరారు. దీనికి సూచికగా మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి వేడుకలు అనే పోస్టర్‌ను మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి మంత్రి పొంగులేటి ఆవిష్కరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో సహా రాష్ట్ర మంత్రి వర్గం ఈ కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహించాలని కోరుతోందని మంత్రి పొంగులేటి వెల్లడించారు. అనంతరం మంత్రి పొంగులేటి మాట్లాడుతూ తొలి విడతగా 4.50 లక్షల ఇళ్లు, రెండో విడత 2.50 లక్షల ఇళ్లతో పాటు హైదరాబాద్ క్యూర్ ఏరియా పరిధిలో లక్ష ఇళ్లను మంజూరు చేశామని చెబుతూ హైదరాబాద్ తరహాలోనే రాష్ట్రంలోని నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, నల్గొండ కార్పొరేషన్‌లలో కూడా ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం చేపడతామని ప్రకటించారు. జి+5 పద్ధతిలో నిర్మించనున్న ఈ టవర్స్ నిర్మాణానికి సంబంధించి దీపావళి లోగా నోటిఫికేషన్ జారీ చేస్తామని తెలిపారు. హైదరాబాద్‌లో నిర్మిస్తున్న ఇందిరమ్మ టవర్స్ నుంచి వచ్చే ఏడాది బోనాలు ఎత్తిస్తామని మంత్రి గారు పునరుద్ఘాటించారు. రాష్ట్రంలో రూ.40 వేల కోట్లతో చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ ఆపేదిలేదని స్పష్టం చేస్తూ ఇప్పటికే ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు ప్రతి సోమవారం నేరుగా హైదరాబాద్ నుంచి అవినీతి రహితంగా నిధులను జమచేస్తున్నామని వివరించారు. రాష్ట్రంలోని నగరాలు, పట్టణాలు, గ్రామాలేగాక మారుమూల ప్రాంతాలు, తండాలలో కూడా ఈ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం జరుగుతోందని ఫలితంగా పేదవారి సొంతింటికల సాకారమవుతోందని మంత్రి పొంగులేటి అన్నారు.

రైల్వేలో కార్మిక కోడ్‌ల అమలుపై సమన్వయ సమావేశం

కాంట్రాక్ట్ కార్మికులు, డిజిటల్ వ్యవస్థల అనుసంధానంపై చర్చ

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 4:



భారతీయ రైల్వేలో కార్మిక కోడ్‌ల సమర్థ అమలు, సంబంధిత వర్గాలతో సంప్రదింపులు, సంస్థాగత సమన్వయాన్ని బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రధాన కార్మిక కమిషనర్ కార్యాలయం రైల్వే బోర్డు ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించింది. నవంబర్ 3న న్యూఢిల్లీలోని ద్వారకా శ్రమేవ జయతే భవన్‌లో కేంద్ర ప్రధాన కార్మిక కమిషనర్ సోనాల్ మిశ్రా అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది.రైల్వే బోర్డు కార్మిక చట్టాల విభాగం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వినీతా వర్మ తన బృందంతో కలిసి పాల్గొన్నారు. రైల్వే సమాచార వ్యవస్థల కేంద్రం (క్రిస్), జాతీయ సమాచార కేంద్రం (ఎన్‌ఐసీ) ప్రతినిధులు వర్చువల్‌గా హాజరయ్యారు.

కార్మిక కోడ్‌లలో రైల్వేలకు వర్తించే కీలక నిబంధనలు, కాంట్రాక్ట్ కార్మికులకు సంబంధించిన అంశాలు, నమోదు, లైసెన్సుల అవసరాలపై అధికారులు చర్చించారు. కొత్త కోడ్‌లకు అనుగుణంగా 'శ్రామిక్ కళ్యాణ్ పోర్టల్'ను మెరుగుపరిచే సూచనలను పరిశీలించారు. నిబంధనల అనుసరణను సులభతరం చేయడంలో కేంద్ర ప్రధాన కార్మిక కమిషనర్ కార్యాలయ పాత్రను వివరించారు.

రైల్వే సంస్థాగత నిర్మాణం, సిబ్బంది వినియోగం, కాంట్రాక్ట్ కార్మికుల నియామకం, వివిధ ప్రాంతాల్లోని రైల్వే కార్యాలయాలు, ప్రాజెక్టుల విస్తృతిపై వినీతా వర్మ వివరించారు. ప్రస్తుతం అమల్లో ఉన్న కార్మిక చట్టాల అనుసరణ విధానాలు, ఉత్తమ పద్ధతులను తెలియజేశారు.

రైల్వే డిజిటల్ వ్యవస్థలను 'శ్రమ సువిధ', 'సమాధాన్' పోర్టళ్లతో అనుసంధానించే అవకాశాలపై సమావేశంలో ప్రధానంగా చర్చించారు. వివిధ అధికార పరిధుల్లో కార్మిక కోడ్‌ల అమలుకు ఎదురయ్యే నిర్వహణపరమైన సవాళ్లను పరిశీలించారు.

క్షేత్రస్థాయిలో ఇరు సంస్థల అధికారుల మధ్య సమన్వయాన్ని పెంచి, రైల్వే రంగ అవసరాలకు అనుగుణంగా కార్మిక కోడ్‌ల అమలును సులభతరం చేయడం ఈ సమావేశం లక్ష్యం. నాలుగు కార్మిక కోడ్‌లపై అవగాహన, నిబంధనల అనుసరణ, డిజిటల్ సేవల విస్తరణ కోసం వివిధ మంత్రిత్వ శాఖలు, ప్రభుత్వ సంస్థలతో ఇటువంటి సమావేశాలను నిర్వహిస్తున్నట్లు కేంద్ర ప్రధాన కార్మిక కమిషనర్ కార్యాలయం తెలిపింది.

విద్యుత్ నిల్వ ప్రాజెక్టులకు రూ.14,500 కోట్ల పథకం

92 గిగావాట్ గంటల నిల్వ సామర్థ్య అభివృద్ధికి కేంద్ర కేబినెట్ ఆమోదం

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 4:

దేశంలో భారీ స్థాయి విద్యుత్ నిల్వ వ్యవస్థల అభివృద్ధికి రూ.14,500 కోట్ల ఆర్థిక మద్దతుతో వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (వీజీఎఫ్) పథకానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. 2026--27 నుంచి 2030--31 ఆర్థిక సంవత్సరాల వరకు అమలయ్యే ఈ పథకం ద్వారా 92 గిగావాట్ గంటల విద్యుత్ నిల్వ సామర్థ్యాన్ని అభివృద్ధి చేయనున్నారు.పథకంలో భాగంగా 60 గిగావాట్ గంటల జలాధారిత పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులు, 30 గిగావాట్ గంటల బ్యాటరీ విద్యుత్ నిల్వ వ్యవస్థలు, మరో 2 గిగావాట్ గంటల ప్రత్యామ్నాయ నిల్వ సాంకేతికతల ప్రాజెక్టులను ప్రోత్సహించనున్నారు. వీటికి మొత్తం రూ.97,600 కోట్ల పెట్టుబడులు సమకూరుతాయని అంచనా. ప్రాజెక్టుల ఆర్థిక సాధ్యతను మెరుగుపరిచి, వాటి ఏర్పాటును వేగవంతం చేసేందుకు వీజీఎఫ్ నిధులు దోహదపడనున్నాయి.విద్యుత్ టారిఫ్ ఆధారిత పోటీ బిడ్డింగ్ ద్వారా నిల్వ సామర్థ్యాన్ని కేటాయించనున్నారు. బ్యాటరీ, పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులకు ప్రభుత్వ, ప్రైవేటు విద్యుత్ పంపిణీ సంస్థలు వీజీఎఫ్ మద్దతు పొందేందుకు అర్హులుగా ఉంటాయి. ప్రత్యామ్నాయ విద్యుత్ నిల్వ సాంకేతికతల ప్రాజెక్టులను ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థలు అమలు చేయనున్నాయి.దేశీయ తయారీని ప్రోత్సహించేందుకు బ్యాటరీ విద్యుత్ నిల్వ ప్రాజెక్టుల్లో కనీసం 40 శాతం దేశీయ కంటెంట్ వినియోగాన్ని తప్పనిసరి చేశారు. ఈ నిబంధన భారతీయ పరిశ్రమలకు అవకాశాలు కల్పించడంతో పాటు దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించనుంది.సౌర, పవన విద్యుత్ ఉత్పత్తిలో హెచ్చుతగ్గులను సమతుల్యం చేయడం, విద్యుత్ గ్రిడ్ స్థిరత్వాన్ని పెంచడం ఈ పథకం ప్రధాన లక్ష్యాలు. పునరుత్పాదక విద్యుత్‌ను మరింత సమర్థంగా వినియోగించుకొని, ప్రజలకు నిరంతరాయంగా నమ్మకమైన, అందుబాటు ధరల్లో విద్యుత్ సరఫరా అందించేందుకు ఇది తోడ్పడనుంది. 2031--32 నాటికి అవసరమయ్యే 411 గిగావాట్ గంటల గ్రిడ్ స్థాయి విద్యుత్ నిల్వ సామర్థ్యాన్ని సాధించే దిశగా ఈ పథకం కీలకంగా నిలవనుంది.

తెలంగాణ గ్రామీణ బ్యాంకు నూతన భవనం ప్రారంభం

రైతులు రుణాలను సద్వినియోగం చేసుకోవాలి: చైర్మన్ కె. ప్రతాప్‌రెడ్డి

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 4:



తెలంగాణ గ్రామీణ బ్యాంకు భువనగిరి శాఖ నూతన భవనాన్ని బుధవారం బ్యాంకు చైర్మన్ కె. ప్రతాప్‌రెడ్డి,చీఫ్ జనరల్ మేనేజర్ అతుల్ శ్రీవాస్తవ ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో రీజినల్ మేనేజర్ ఎం. ఉదయ్, చీఫ్ మేనేజర్ పి. రాంచంద్రారెడ్డి, సీనియర్ మేనేజర్ ఎం. మురళీకృష్ణ, బ్రాంచ్ మేనేజర్ ఎన్. అన్వర్ లాల్ , హబ్ మేనేజర్ జి. నితీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా రీజినల్ మేనేజర్ మాట్లాడుతూ యాదాద్రి భువనగిరి, జనగామ జిల్లాల్లో బ్యాంకుకు 48 శాఖలు ఉన్నాయని, ఈ నెలలో డ్వాక్రా సంఘాలకు రూ.30 కోట్లు, చేనేత కార్మికులకు రూ.2 కోట్లు, డెయిరీ రంగ రైతులకు రూ.2 కోట్ల రుణాలు అందించినట్లు తెలిపారు. రుణమేళాలో భాగంగా 20 మంది లబ్ధిదారులకు వ్యవసాయ యంత్రాలు, హార్వెస్టర్లు, వాహనాల కొనుగోలుకు రుణాలు మంజూరు చేశారు.రైతులు రుణాలను సకాలంలో చెల్లించాలని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జనరల్ మేనేజర్ అతుల్ శ్రీవాస్తవ సూచించారు. విజయ డెయిరీ భాగస్వామ్యంతో రైతులు రుణాలు పొందుతూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలని చైర్మన్ కె. ప్రతాప్‌రెడ్డి కోరారు.
నూతన భవనం ద్వారా ఖాతాదారులకు మరింత మెరుగైన బ్యాంకింగ్ సేవలు అందుబాటులోకి వస్తాయని అధికారులు తెలిపారు.

సంగీతం, ఆటపాటలు, ఆత్మీయ పలకరింపులతో సీనియర్ల దీపావళి వేడుకలు

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 4:

నవంబర్ 4: లోకపురంలోని రీగల్ ప్లాజాలో ఉన్న ఎఫ్-టామ్ సెంటర్‌లో నవంబర్ 3న సీనియర్ సిటిజన్లు దీపావళి స్నేహ సమ్మేళనాన్ని ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అల్పాహారం, బహుమతులు అందజేయడంతో పాటు భజనలు, పాటలు, ఆటపాటలతో సందడి చేశారు. తమ జీవితానుభవాలను పంచుకుంటూ కొత్త స్నేహాలను ఏర్పరచుకున్నారు. ఈ సందర్భంగా జగన్‌బాబు గంజి మాట్లాడుతూ సీనియర్ సిటిజన్ల అనుభవం సమాజానికి ఎంతో విలువైనదని, వారు సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. పుంగనూరు గోశాల, హస్లర్స్ హబ్, ఆనంద్ నిలయం వంటి కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమాన్ని ప్రకాష్ కులకర్ణి, జోషి సర్ సమన్వయం చేశారు. పలువురు సీనియర్ సిటిజన్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎఫ్-టామ్ సెంటర్ ప్రతి మంగళవారం సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు సీనియర్ సిటిజన్లకు ఉచితంగా అందుబాటులో ఉంటుందని రాఘవ్ సర్ తెలిపారు.



అగ్నివీరుల శాశ్వత నియామకానికి కొత్త మార్గం

మిగిలిన 75 శాతం మందికి మరో రెండేళ్ల సేవావకాశం.. అనంతరం అర్హతల మేరకు రెగ్యులర్ నియామకం

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 4:

అగ్నివీరులు రక్షణ దళాల్లో శాశ్వత సైనికులుగా చేరేందుకు అవకాశం కల్పించే కీలక నిర్ణయానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఇప్పటివరకు నిర్దేశించిన విధంగా ప్రతిభ ఆధారంగా 25 శాతం మంది అగ్నివీరులకు రెగ్యులర్ ఉద్యోగాలు కల్పించనున్నారు. మిగిలిన 75 శాతం మందికి వారి ఆసక్తి మేరకు మరో రెండేళ్లు సేవలందించే అవకాశం ఇవ్వనున్నారు.ఈ అదనపు రెండేళ్ల సేవాకాలం పూర్తయిన అనంతరం, ఆసక్తి కలిగి నిర్దేశిత ఎంపిక ప్రమాణాలను సాధించిన అగ్నివీరులందరికీ రెగ్యులర్ సైనికులుగా చేరే అవకాశం కల్పించనున్నారు. భారత రక్షణ దళాల సిఫార్సుల మేరకు కేంద్ర మంత్రివర్గం ఈ నిర్ణయం తీసుకుంది.అగ్నిపథ్ పథకం అమలైన గత నాలుగేళ్లలో అగ్నివీరుల పనితీరు, సంస్థాగత అవసరాలు, కార్యాచరణ సామర్థ్యంపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. నైపుణ్యాలు, ప్రేరణ, శారీరక దారుఢ్యం, సాంకేతిక పరిజ్ఞాన వినియోగంలో అగ్నివీరులు మెరుగైన ప్రతిభ కనబరిచినట్లు సమీక్షలో వెల్లడైంది. వారి ఆకాంక్షలు, రక్షణ దళాల అవసరాలను సమన్వయం చేసేలా అదనపు సేవాకాలాన్ని ప్రవేశపెట్టారు.రెండో విడత సేవాకాలంలో అధిక పారితోషికం, మెరుగైన సేవానిధి ప్యాకేజీతో పాటు సీనియారిటీ ప్రయోజనాలు కల్పించనున్నారు. ఈ మార్పులతో అగ్నిపథ్ పథకం కొనసాగనుంది.దేశవ్యాప్తంగా మరిన్ని జిల్లాలకు నియామకాలు విస్తరించడం, ఎంపిక ప్రక్రియలో పారదర్శకత పెరగడం, అగ్నివీరుల్లో క్రమశిక్షణ, పోటీతత్వం, విద్యా--సాంకేతిక నైపుణ్యాలు మెరుగుపడటం పథకం ప్రధాన విజయాలుగా పేర్కొన్నారు. రక్షణ దళాల్లోని వివిధ విభాగాల్లో మహిళలకు అవకాశాలు విస్తరించినట్లు తెలిపారు.అదనపు రెండేళ్ల సేవ అనంతరం ఆసక్తి, ఎంపిక అర్హతల ఆధారంగా శాశ్వత నియామకానికి మార్గం కల్పించడం ద్వారా అగ్నివీరుల భవిష్యత్తుకు మరింత భరోసా ఇవ్వాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది.

నెట్‌వర్క్ నాణ్యత తెలుసుకునేందుకు 'నెట్‌వర్క్ అనుభవ్'

ట్రాయ్ కొత్త వేదిక ప్రారంభం.. స్పామ్ ఫిర్యాదులకు వెబ్ ద్వారా డీఎన్‌డీ సేవలు

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 4:

వినియోగదారులు తమ ప్రాంతంలో ఇంటర్నెట్ వేగం, కాల్ నాణ్యతకు సంబంధించిన పరీక్షా ఫలితాలను తెలుసుకునేందుకు భారత టెలికాం నియంత్రణ ప్రాధికార సంస్థ (ట్రాయ్) 'నెట్‌వర్క్ అనుభవ్' వేదికను ప్రారంభించింది. భౌగోళిక మ్యాప్‌లు, విశ్లేషణాత్మక డ్యాష్‌బోర్డ్‌తో రూపొందించిన ఈ వేదికలో ట్రాయ్ మైస్పీడ్, మైకాల్ యాప్‌ల ద్వారా వినియోగదారులు నిర్వహించిన పరీక్షల వివరాలు, ట్రాయ్ స్వతంత్ర డ్రైవ్ టెస్ట్ ఫలితాలు అందుబాటులో ఉంటాయి.మొబైల్, ఫిక్స్‌డ్ బ్రాడ్‌బ్యాండ్ సేవలకు సంబంధించిన ఫలితాలను సేవా సంస్థలు, సాంకేతికతల వారీగా పరిశీలించవచ్చు. డౌన్‌లోడ్, అప్‌లోడ్ వేగాల వివరాలను మ్యాప్‌లో ప్రాంతాల వారీగా చూడవచ్చు. ఫిల్టర్లు, వివరణాత్మక పట్టికలు, డౌన్‌లోడ్ చేసుకునే నివేదికల సదుపాయాలు కూడా కల్పించారు.వినియోగదారులు నిర్వహించిన పరీక్షల ఆధారంగా ఆయా ప్రాంతాల్లో నమోదైన వేగాలను ఈ వేదిక చూపిస్తుంది. అయితే ఇవి ప్రామాణిక పద్ధతిలో నిర్వహించే సమగ్ర నెట్‌వర్క్ నాణ్యత అంచనాకు సమానం కావని ట్రాయ్ స్పష్టం చేసింది. వివిధ ప్రాంతాల్లో ఇతర వినియోగదారుల అనుభవాలను తెలుసుకునేందుకు ఈ సమాచారం ఉపయోగపడుతుందని పేర్కొంది.'నెట్‌వర్క్ అనుభవ్' ద్వారా డూ నాట్ డిస్టర్బ్ (డీఎన్‌డీ) సేవలను వెబ్‌లోనూ వినియోగించుకోవచ్చు. వాణిజ్య సందేశాలు, కాల్స్‌పై తమ ప్రాధాన్యతలను నమోదు చేయడంతో పాటు అవాంఛిత వాణిజ్య సమాచారంపై ఫిర్యాదు చేయవచ్చు. ఫిర్యాదుల స్థితి, సేవా సంస్థల వారీగా ఫిర్యాదుల సమాచారాన్ని కూడా పరిశీలించవచ్చు.టెలికాం సంస్థలు సురక్షిత విధానంలో వినియోగదారుల కాల్ నాణ్యత, కవరేజీ, ఇంటర్నెట్ పరీక్షల సమాచారాన్ని పరిశీలించి, నెట్‌వర్క్ మెరుగుదలకు అవసరమైన ప్రాంతాలను గుర్తించవచ్చు. సమీకృత సమాచారాన్ని వినియోగదారుల అనుభవాల పర్యవేక్షణకు ట్రాయ్ ఉపయోగించనుంది. అర్హత కలిగిన ఇతర యాప్‌లలోనూ కనెక్టివిటీ పరీక్షల సదుపాయాన్ని అనుసంధానించేందుకు మైస్పీడ్ ఎస్‌డీకే అవకాశం కల్పిస్తుంది.ఈ వేదిక నెట్‌వర్క్ పరీక్షల ఫలితాల్లో పారదర్శకతను పెంచుతుందని ట్రాయ్ చైర్మన్ అనిల్‌కుమార్ లహోటీ తెలిపారు. సమాచారం మరింత విస్తృతంగా అందుబాటులోకి రావడానికి వినియోగదారులు మైస్పీడ్, మైకాల్ యాప్‌ల ద్వారా క్రమం తప్పకుండా పరీక్షలు నిర్వహించాలని ట్రాయ్ కోరింది.

బండకొత్తపల్లి గ్రామంలో పశువులకు నట్టల నివారణ మందుల అవగాహన కార్యక్రమం

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 4:

యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం బండకోతపల్లి గ్రామంలో పశువులకు నట్టల నివారణ మందులు అందించే కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గద్వాల ఉపేందర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్యురాలు డాక్టర్ ప్రత్యూష పాల్గొని, గ్రామంలోని పశు పోషకులు తమ పశువులకు సకాలంలో నట్టల నివారణ మందులు వేయించడంతో పాటు, అవసరమైన టీకాలు కూడా తప్పనిసరిగా వేయించాలని సూచించారు. పశువుల ఆరోగ్య పరిరక్షణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, వ్యాధుల నివారణపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు.ఈ కార్యక్రమం ద్వారా పశువుల ఆరోగ్య పరిరక్షణకు, పశుపోషకుల సంక్షేమానికి ప్రాధాన్యత కల్పించారు.



ముఖ గుర్తింపుతో సులభంగా డిజిటల్ జీవన ధ్రువపత్రాలు

ప్రయాగ్‌రాజ్‌లో పింఛన్‌దారుల కోసం డీఎల్‌సీ--5 మెగా శిబిరం

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 4:



పింఛన్‌దారులు ముఖ గుర్తింపు సాంకేతికతను వినియోగించి స్మార్ట్‌ఫోన్ ద్వారానే డిజిటల్ జీవన ధ్రువపత్రాలను సమర్పించవచ్చని కేంద్ర పింఛన్లు, పింఛన్‌దారుల సంక్షేమ శాఖ సంయుక్త కార్యదర్శి ధ్రువజ్యోతి సేన్‌గుప్తా తెలిపారు. ప్రయాగ్‌రాజ్‌లో బుధవారం నిర్వహించిన దేశవ్యాప్త డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ (డీఎల్‌సీ)--5 మెగా శిబిరంలో ఆయన పాల్గొన్నారు.ఉత్తర మధ్య రైల్వే ప్రయాగ్‌రాజ్ డివిజన్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయంలో ఈ శిబిరాన్ని నిర్వహించారు. పింఛన్‌దారులు, అధికారులతో సేన్‌గుప్తా మాట్లాడి డిజిటల్ సేవల వినియోగాన్ని ప్రోత్సహించారు.

వృద్ధులు జీవన ధ్రువపత్రాల కోసం బ్యాంకులు, ఇతర కార్యాలయాల చుట్టూ పదేపదే తిరగాల్సిన అవసరాన్ని ముఖ గుర్తింపు సాంకేతికత తగ్గిస్తుందని ఆయన వివరించారు. పింఛన్‌దారులు ఈ సదుపాయంపై అవగాహన పెంచుకోవడంతో పాటు తోటి పింఛన్‌దారులకు, ముఖ్యంగా వయోవృద్ధులకు దాని ప్రయోజనాలను తెలియజేయాలని సూచించారు.అర్హులైన ప్రతి పింఛన్‌దారునికీ సకాలంలో సహాయం అందేలా బ్యాంకులు, ప్రభుత్వ శాఖలు, సంబంధిత సంస్థలు నిరంతర అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. డిజిటల్ సేవలను మరింత విస్తరించి, ఏ ఒక్క అర్హుడూ సేవలకు దూరం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.కార్యక్రమంలో ప్రయాగ్‌రాజ్ డివిజనల్ రైల్వే మేనేజర్ రజనీశ్ అగర్వాల్, యూఐడీఏఐ డైరెక్టర్ ఆకాశ్ దీప్, ఉత్తర మధ్య రైల్వే ప్రధాన సిబ్బంది అధికారి ముదిత్ చంద్ర తదితరులు పాల్గొన్నారు. డీఎల్‌సీ--5 ప్రచార కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఇదే ఉత్సాహంతో ముందుకు సాగాలని అధికారులకు సూచించారు.

అక్టోబర్‌లో రైల్వే సరకు రవాణా రికార్డు

145.07 మిలియన్ టన్నుల తరలింపు.. గతేడాదితో పోలిస్తే 8.32 శాతం వృద్ధి

భారతీయ రైల్వే సరకు రవాణాలో గణనీయమైన వృద్ధిని నమోదు చేసింది. అక్టోబర్ 2026లో 145.07 మిలియన్ టన్నుల సరకు లోడింగ్‌తో అక్టోబర్ నెలకు సంబంధించి సరికొత్త రికార్డు సాధించింది. గతేడాది ఇదే నెలలో నమోదైన 133.93 మిలియన్ టన్నులతో పోలిస్తే 8.32 శాతం పెరుగుదల నమోదైంది.ప్రధాన సరకుల్లో ఆహార ధాన్యాల లోడింగ్ అత్యధికంగా 26.3 శాతం పెరిగింది. దేశీయ బొగ్గు 16 శాతం, ఇతర సరకులు 11 శాతం, క్లింకర్ 10.4 శాతం, దేశీయ కంటైనర్లు 6.3 శాతం, ఇనుప ఖనిజం 5 శాతం వృద్ధిని నమోదు చేశాయి. మినరల్ ఆయిల్ రవాణా 1.9 శాతం, తయారైన ఉక్కు రవాణా 0.5 శాతం పెరిగింది.విద్యుత్ కేంద్రాల అవసరాలకు అనుగుణంగా దేశీయ బొగ్గు సరఫరాను రైల్వే పెంచింది. అక్టోబర్‌లో రోజుకు సగటున 469.8 రేక్‌ల బొగ్గును సరఫరా చేయగా, గతేడాది ఇదే నెలలో ఈ సంఖ్య 393.2 రేక్‌లుగా ఉంది. దీంతో విద్యుత్ కేంద్రాలకు బొగ్గు సరఫరాలో 19.5 శాతం వృద్ధి నమోదైంది.ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు మొత్తం 978.78 మిలియన్ టన్నుల సరకు లోడింగ్ జరిగింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో నమోదైన 935.10 మిలియన్ టన్నులతో పోలిస్తే ఇది 4.67 శాతం అధికం.ప్రయాణికుల రవాణాలోనూ వృద్ధి కొనసాగింది. అక్టోబర్‌లో 64.72 కోట్ల మంది రైళ్లలో ప్రయాణించగా, గతేడాది ఇదే నెలలో 63.52 కోట్ల మంది ప్రయాణించారు. ఏప్రిల్--అక్టోబర్ మధ్య ప్రయాణికుల సంఖ్య 431.4 కోట్ల నుంచి 443.8 కోట్లకు చేరింది. ఈ కాలంలో సబర్బన్‌యేతర విభాగంలో 4.2 శాతం, సబర్బన్ విభాగంలో 1.7 శాతం పెరుగుదల నమోదైంది.రవాణా సామర్థ్యాన్ని విస్తరించడం, నిర్వహణ సామర్థ్యాన్ని మెరుగుపరచడం ద్వారా దేశ సరకు రవాణా వ్యవస్థను బలోపేతం చేస్తూ ఆర్థిక వృద్ధికి తోడ్పడుతున్నట్లు భారతీయ రైల్వే తెలిపింది.

తెలంగాణ ట్రైనెట్ న్యూస్
నిజం • బాధ్యత • నిబద్ధత
తెలుగు దిన పత్రిక

సాంస్కృతికం
మన సంస్కృతి.. మన గర్వం..

12
గురువారం నవంబర్ 05, 2026
www.trinetnews.com

భవిష్యత్ 6జీ సాంకేతికతకు దోహదపడే సిలికాన్ చిప్


తక్కువ సిగ్నల్ నష్టంతో సెకనుకు 100 గిగాబిట్ల డేటా ప్రసారం

న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 04:

భవిష్యత్ 6జీ సమాచార వ్యవస్థల అభివృద్ధికి ఉపయోగపడే సరికొత్త సిలికాన్ చిప్‌ను జవహర్‌లాల్ నెహ్రూ సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ సైంటిఫిక్ రీసెర్చ్ (జేఎన్‌సీఏఎస్ఆర్) పరిశోధకులు అభివృద్ధి చేశారు. చిప్‌లో ప్రత్యేకంగా రూపొందించిన అవరోధాన్ని టెరాహెర్ట్జ్ తరంగాలు అతి తక్కువ నష్టంతో దాటేలా చేసి, సెకనుకు 100 గిగాబిట్ల వరకు డేటా ప్రసారాన్ని ప్రదర్శించారు.

మైక్రోవేవ్‌లు, పరారుణ కాంతి మధ్య ఉండే టెరాహెర్ట్జ్ పౌనఃపున్యాలు విస్తృత బ్యాండ్‌విడ్త్‌ను అందిస్తాయి. భవిష్యత్ 6జీ నెట్‌వర్క్‌లలో వీటిని వినియోగించే అవకాశం ఉంది. అయితే చిన్న సర్క్యూట్లలో మలుపులు, కూడళ్లు, నిర్మాణంలో ఆకస్మిక మార్పుల వల్ల తరంగాలు చెదిరిపోవడం లేదా వెనక్కి పరావర్తనం చెందడంతో సిగ్నల్ బలహీనపడుతుంది.

ఈ సమస్యను అధిగమించేందుకు పరిశోధకులు సిలికాన్ పలకపై త్రిభుజాకార రంధ్రాలను ప్రత్యేక క్రమంలో అమర్చి



ఫోటోనిక్ క్రిస్టల్‌ను రూపొందించారు. 'టోపోలాజికల్ ఫోటోనిక్స్' విధానంతో తరంగాలను నిర్దేశిత మార్గంలో ప్రయాణించేలా చేశారు. పరీక్షల్లో ఒక అవరోధం వల్ల అదనంగా కేవలం 1--2 శాతం, వరుసగా రెండు అవరోధాలతో 2--3 శాతం మాత్రమే సిగ్నల్ నష్టం నమోదైంది.

రెండు అవరోధాలున్న పరికరం, నాలుగు పదునైన మలుపులతో ఒమేగా ఆకారంలో ఉన్న పరికరం, సిగ్నల్‌ను రెండు శాఖలుగా విభజించే పరికరంపై ప్రయోగాలు నిర్వహించారు. ఇవి వరుసగా సెకనుకు 48, 60, 100 గిగాబిట్ల డేటాను ప్రసారం చేశాయి. అత్యధిక వేగాన్ని సాధించిన సిగ్నల్ విభజన పరికరంలో క్యామ్--32 మాడ్యులేషన్ సాంకేతికతను ఉపయోగించారు. ఈ వేగంతో సిద్ధాంతపరంగా 5 గిగాబైట్ల హైడెఫినిషన్ సినిమాను అర సెకనులోపే బదిలీ చేయవచ్చు.

జేఎన్‌సీఏఎస్ఆర్ అసిస్టెంట్ ప్రొఫెసర్, మెటా ఆప్టిక్స్ ల్యాబొరేటరీ అధిపతి డాక్టర్ అభిషేక్ కుమార్ నేతృత్వంలో ఈ పరిశోధన జరిగింది. సమీనా ముల్లా, సంగ్రామ్ కుమార్ సాధు సంయుక్త ప్రథమ రచయితలుగా వ్యవహరించారు. దేశ, విదేశాలకు చెందిన పలు పరిశోధనా సంస్థలు సహకరించాయి. అధ్యయన ఫలితాలు 'అడ్వాన్స్‌డ్ మెటీరియల్స్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

ఒకే చిప్‌పై తక్కువ నష్టంతో టెరాహెర్ట్జ్ సిగ్నళ్లను మళ్లించడం, విభజించడం సాధ్యమయ్యే సర్క్యూట్ల అభివృద్ధికి ఈ పరిశోధన దోహదపడనుంది. తదుపరి దశలో విద్యుత్, ఉష్ణం లేదా యాంత్రిక పద్ధతులతో అవరోధాలను నియంత్రించి, అవసరానికి అనుగుణంగా సిగ్నల్ ప్రయాణ మార్గాన్ని మార్చే అవకాశాలను పరిశోధకులు పరీక్షించనున్నారు.

ఉపాధి హామీ పథకంలో తెలంగాణ ఆల్‌టైమ్ రికార్డు..
ఒకే రోజు 5 లక్షల మందికి పైగా కూలీలకు పని!

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 4:

తెలంగాణ రాష్ట్రం గ్రామీణ ఉపాధి కల్పనలో సరికొత్త చరిత్ర సృష్టించింది. వీబీజీ రామ్‌జీ ఉపాధి హామీ పథకం అమలులో రాష్ట్రం ఆల్‌టైమ్ రికార్డు నమోదు చేసింది. నవంబర్ 3న రాష్ట్రవ్యాప్తంగా ఒకే రోజు ఐదు లక్షల మందికి పైగా కూలీలకు ఉపాధి కల్పించడం విశేషం. నవంబర్ నెలలో ఈ స్థాయిలో కూలీలకు ఒకే రోజున పని కల్పించడం ఇదే తొలిసారి కావడంతో గ్రామీణాభివృద్ధి రంగంలో తెలంగాణ మరో మైలురాయిని అధిగమించింది. గ్రామీణ ప్రాంతాల్లో పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు, కూలీలకు నిరంతరం ఉపాధి అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపడుతున్న చర్యలు ఈ రికార్డుకు దోహదం చేశాయి. ఉపాధి హామీ పనుల ద్వారా గ్రామీణ కూలీలకు ఆదాయం లభించడమే కాకుండా గ్రామాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి కూడా అవకాశం కలుగుతోంది. ఈ నేపథ్యంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. నవంబర్ 3న సాధించిన విజయాన్ని స్ఫూర్తిగా తీసుకుని రానున్న రోజుల్లో



కూలీలకు మరిన్ని పనిదినాలు కల్పించేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను మరింత విస్తరించి, ప్రతి పేద కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు.

అలాగే నీటి వనరుల అభివృద్ధి, వర్షపు నీటిని ఒడిసిపట్టే పనులు, గ్రామీణ మౌలిక సదుపాయాల బలోపేతానికి ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి సూచించారు. ఉపాధి హామీ పనులు కేవలం కూలీలకు ఆదాయం కల్పించడానికే పరిమితం కాకుండా, భవిష్యత్తు తరాలకు ఉపయోగపడే శాశ్వత ఆస్తుల సృష్టికి దోహదపడాలని పేర్కొన్నారు. కూలీలకు ఉపాధి కల్పన, జల సంరక్షణ, గ్రామాల్లో శాశ్వత ఆస్తుల నిర్మాణం.. ఈ మూడు అంశాలే ప్రధాన లక్ష్యాలుగా పనులు కొనసాగాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రతి గ్రామంలో స్థానిక పరిస్థితులు, ప్రజల అవసరాలకు అనుగుణంగా పనులను గుర్తించి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఏడాది పొడవునా గ్రామీణ కూలీలకు పని లభించేలా సమగ్ర కార్యాచరణ చేపట్టాలని సూచించారు. ఒకవైపు గ్రామీణ పేదలకు ఉపాధి, మరోవైపు నీటి వనరుల సంరక్షణ, ఇంకోవైపు గ్రామాల అభివృద్ధి.. ఈ మూడు లక్ష్యాలను సమన్వయం చేస్తూ ఉపాధి హామీ పథకాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. నవంబర్ 3న నమోదైన ఐదు లక్షల మందికి పైగా కూలీల ఉపాధి రికార్డు ఈ దిశగా తెలంగాణ సాధించిన కీలక విజయంగా నిలిచింది.

యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్టిస్ట్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

ఐదవ వార్షికోత్సవ వేడుకల్లో నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

యాదాద్రి భువనగిరి, నవంబరు04/ట్రైనెట్ న్యూస్:

యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్టిస్ట్ అసోసియేషన్ ఐదవ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడంతో పాటు నూతనంగా ఎన్నికైన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన కార్యవర్గ అధ్యక్షులుగా దేవరకొండ పోతులూరాచారి, ఉపాధ్యక్షులుగా కందుల అంజయ్య, ప్రధాన కార్యదర్శిగా తరణి వీరాచారి, అధికార ప్రతినిధిగా కొల్లోజు సోమ నరసింహ చారి, కోశాధికారిగా జెల్లా జహంగీర్, ప్రచార కార్యదర్శిగా గుర్రం సంతోష్ కుమార్, సహాయ కార్యదర్శిగా బొడిగె లింగం గౌడ్ ఎన్నికయ్యారు. అదేవిధంగా అసోసియేషన్ సలహాదారులుగా రావులపల్లి బాలాచారి,పుర్మ శ్రీశైలం,ఆడెపు రఘురాములు, గుంటోజు శ్రీనివాసాచారి, తిప్పారపు మల్లేష్, తుడుం గణేష్‌లను ఎంపిక చేశారు.ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులకు పలువురు కళాకారులు అభినందనలు తెలిపారు. జిల్లా కళాకారుల ఐక్యత, అభ్యున్నతి, సంక్షేమం కోసం నూతన కార్యవర్గం కృషి చేయాలని ఆకాంక్షించారు. కళాకారుల హక్కుల పరిరక్షణతో పాటు జిల్లాలోని కళాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, వారికి తగిన గుర్తింపు తీసుకురావాలని సూచించారు. కళాకారుల సమస్యల పరిష్కారానికి, వారి సంక్షేమానికి అసోసియేషన్ ఎల్లప్పుడూ అండగా నిలవాలని పలువురు ఆశాభావం వ్యక్తం చేశారు.



నీటి ట్యాంకర్ల సమ్మె విరమణ

-ూ== బయట నుంచి నీటి తరలింపునకు అంగీకారం -హైడ్రా కమిషనర్ తోసమవేశం అనంతరం నీటి ట్యాంకర్ల యజమానుల అంగీకారం -తక్షణమే సరఫరాల పునరుద్ధరణకు నిర్ణయం

హైదరాబాద్, నవంబర్ 04:

నీటి ట్యాంకర్ల యజమానులు సమ్మెను విరమించారు. తక్షణమే నీటి సరఫరా పునరుద్ధరణకు అంగీకరించారు. బుధవారం హైడ్రా కార్యాలయంలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ గారితో వాటర్ ట్యాంకర్ల యజమానులు సమావేశమయ్యారు. వాటర్ ట్యాంకర్ల యజమానులు ఎదుర్కొంటున్న సమస్యలు చర్చించారు. కమిషనర్ గారి సూచనల మేరకు సమ్మె విరమణ చేయాలని నిర్ణయించారు. ఔటర్ రింగు రోడ్డు అవతల నుంచి నీటిని తోడి ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసేందుకు యజమానులు అంగీకరించారు. దీంతో గత రెండు రోజులుగా సాగుతున్న సమ్మె ముగిసింది. తక్షణమే నీటి ట్యాంకర్ల సరఫరాలను పునరుద్ధరించాలని నిర్ణయించింది. హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ గారి సూచన మేరకు సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్ గారి నేతృత్వంలో ప్రతినిధులు బుధవారం మధ్యాహ్నం హైడ్రా కార్యాలయంలో కమిషనర్ ఏవీ రంగనాథ్ గారిని కలిసి చర్చించారు.

ప్యూర్ ప్రాంతం నుంచి సరఫరా..

సంబంధిత శాఖల నుంచి అవసరమైన అనుమతులు పొందిన అనంతరం ్రాఖ=ఙు ్రావతీఱ ఖతీఖ్ఱఅ =వస్త్రఱశీఅ) ప్రాంతం నుంచే బోరు నీటిని సేకరించి ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసేందుకు సంఘం సభ్యులు అంగీకరించారు. ఇకపై తమ ట్యాంకర్ వ్యాపార కార్యకలాపాలన్నీ ్రాఖ=ఙు ప్రాంతం నుంచే నిర్వహిస్తామని వాటర్ ట్యాంకర్ల యజమానులు తెలిపారు. హైదరాబాద్ నగరం అత్యంత జనసాంద్రత కలిగిన



ప్రాంతం కావడంతో పాటు ఎల్‌నినో ప్రభావం, తగినంత వర్షపాతం లేకపోవడం వంటి కారణాలతో భూగర్భ జలమట్టాలు గణనీయంగా పడిపోయాయి. ఈ పరిస్థితుల్లో నగరంలోని జనసాంద్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో వాణిజ్య అవసరాల కోసం పెద్ద ఎత్తున భూగర్భ జలాలను తోడటం వల్ల స్థానిక నివాసితుల గృహ అవసరాలకు వినియోగించే బోర్లు ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతోంది. మాదాపూర్, గచ్చిబౌలి, కూకట్‌పల్లి, అమీర్‌పేట, అశోక్‌నగర్ వంటి ప్రాంతాల్లో నీటికి డిమాండ్ ఎక్కువగా ఉండటంతో ట్యాంకర్ల నిర్వాహకులు రవాణా దూరం, ఇంధన ఖర్చులను తగ్గించుకునేందుకు ఆయా ప్రాంతాలకు సమీపంలోని బోర్ల నుంచి నీటిని సేకరిస్తున్నారు. దీంతో ఆయా ప్రాంతాల్లో భూగర్భ జలాలపై తీవ్ర ఒత్తిడి ఏర్పడుతోంది. సాధారణంగా గృహ అవసరాల కోసం వేసే బోర్లు 100 నుంచి 300 అడుగుల లోతు వరకు ఉంటుండగా, వాణిజ్య అవసరాల కోసం కొందరు 1,000 నుంచి 1,500 అడుగులు లేదా అంతకంటే ఎక్కువ లోతులో బోర్లు వేసి, అధిక సామర్థ్యం కలిగిన మోటార్లతో నీటిని తోడుతున్నారు. దీనివల్ల భూగర్భ జలాలపై మరింత ప్రభావం పడుతోందనీ హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వాళ్ళకు వివరించారు.

స్థానికుల నిరసనలు, ఫిర్యాదుల నేపథ్యంలో...

ఈ సమస్యపై పలు కాలనీల సంక్షేమ సంఘాలు, స్థానిక ప్రజల నుంచి హైడ్రాకు ఫిర్యాదులు అందాయి. తెల్లాపూర్ ప్రాంతంలో వాణిజ్య అవసరాల కోసం నీటిని తోడటాన్ని నిలిపివేయాలని స్థానికులు రోడ్డెక్కి నిరసన తెలిపారు. సూరారం, జీడిమెట్ల ప్రాంతాల ప్రజలు తమ ఇళ్లలోని బోర్లలో నీరు అడుగంటిపోతోందని హైడ్రా కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేశారు. ప్రజల ఫిర్యాదులపై స్పందించిన హైడ్రా రెవెన్యూ, పోలీసు, మున్సిపల్, భూగర్భ జలాల శాఖల సమన్వయంతో చర్యలు చేపట్టింది. చెరువుల నుంచి వాణిజ్య అవసరాల కోసం నీటిని తోడుతున్న బోర్లను గుర్తించి తొలగించే చర్యలు కూడా చేపట్టింది. నగరంలోని జనసాంద్రత అధికంగా ఉన్న, నీటి డిమాండ్ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో భూగర్భ జలాలను పెద్ద ఎత్తున వాణిజ్య అవసరాలకు వినియోగించకుండా నియంత్రించేందుకు వాటర్ బోర్డు, రెవెన్యూ, పోలీసు తదితర శాఖలతో కలిసి హైడ్రా సమన్వయంతో పనిచేసిందని హైడ్రా కమిషనర్ చెప్పారు. అదే సమయంలో వాణిజ్య సంస్థలకు నీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా అవసరమైన చర్యలు తీసుకుంటూ, ప్రజల గృహ అవసరాలకు నీటి లభ్యతను కాపాడేందుకు కృషి చేయనుందన్నారు.

ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ మాప్ అప్ లాటరీలి

14 నియోజకవర్గాల్లో ఈ-లాటరీ ద్వారా 1741 ఇండ్ల కేటాయింపు

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్,

నవంబర్ 4: ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ పైలట్ ప్రాజెక్టు లో భాగంగా వివిధ నియోజకవర్గాల్లో చేపట్టి, నిర్మిస్తున్న ఇండ్లలో పలు కారణాలవల్ల అందుబాటులోకి వచ్చిన 1741 ఇండ్లను ఈ-లాటరీ ప్రక్రియ ద్వారా బుధవారం నాడు కేటాయించారు. అవుటర్ రింగ్ రోడ్ లోపలివైపు ఉన్న క్యూర్ ప్రాంతంలోని అల్పాదాయ వర్గాల ప్రజల సొంత ఇంటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ పథకాన్ని ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఈ పథకంలో ఇండ్లు కావాలనుకునే వారి నుంచి దరఖాస్తులను స్వీకరించి, లాటరీ ద్వారా ఇండ్లను కేటాయించింది. తొలివిడతగా, పైలట్ ప్రాజెక్టు కింద ప్రతి నియోజకవర్గంలోనూ 480 ఇండ్లను నిర్మిస్తున్నారు. ఈ ఇండ్లను కేటాయించిన తరువాత క్షేత్ర స్థాయిలో పరిశీలనల్లో అనర్హులుగా తేలడం, ఎంపికైన వారిలో కొందరు తమ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా కేటాయింపును రద్దు చేసుకోవడం మొదలైన కారణాల వల్ల 14 నియోజకవర్గాల పరిధిలో 1741 ఇండ్లు అందుబాటులోకి వచ్చాయి. ఈ విధంగా అందుబాటులోకి వచ్చిన ఇండ్లను బుధవారం నాడు నిర్వహించిన మాప్-అప్ ఈ లాటరీ ద్వారా ఎంపికైన వారికి కేటాయించారు. ఈ మాప్ అప్ లాటరీ ప్రక్రియలో హౌసింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ వీపి గౌతం, కంటోన్మెంట్ నియోజకవర్గ ఎమ్మెల్యే గణేష్ తోపాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ లాటరీ ప్రక్రియలో అందుబాటులోకి వచ్చిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని 80 ఇండ్లకు, మల్కాజిగిరిలో 150, కూకట్ పల్లిలో 59, సనత్ నగర్ లో 88, కంటోన్మెంట్ లో 66, బహదూర్ పురలో 91, కార్వాన్ లో 73, మేడ్చల్ లో 143, నాంపల్లిలో 106, మలక్ పేటలో 171, మహేశ్వరంలో 201, రాజేంద్రనగర్ 133, ఖైరతాబాద్ లో 327, అంబర్ పేటలో 53 ఇండ్లకు లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఏర్పడిన ఖాళీలకు అదనంగా మరో 875 మందిని వెయిటింగ్ లిస్టు కోసం ఈ-లాటరీ ద్వారా ఎంపిక చేశారు. ఈ-లాటరీలో ఎంపికైన వారందరికీ ఎస్ ఎం ఎస్ ద్వారా సమాచారం అందించారు. వీరందరి వివరాలను నిర్ధారించుకునేందుకు త్వరలోనే క్షేత్ర స్థాయిలోఅధికారులు పర్యటిస్తారు.

వాటర్ ట్యాంకర్ల సమ్మె విరమణ హర్షణీయం

--- సమస్య పరిష్కరించినందుకు హైడ్రాకు అభినందనలు
--- హైడ్రా కమిషనర్ ను కలసి కృతజ్ఞతలు తెలిపిన హాస్టళ్ల నిర్వాహకులు



హైదరాబాద్ , ట్రైనెట్ న్యూస్, నవంబర్ 4:

హైదరాబాద్‌లో నీటి ట్యాంకర్ల యజమానులు సమ్మె విరమించడం పట్ల హాస్టళ్ల నిర్వాహకులు హర్షం వ్యక్తం చేశారు. వాటర్ ట్యాంకర్ల యజమానులతో వెంటనే మాట్లాడి సమస్యను పరిష్కరించినందుకు గాను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ కి కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం హాస్టళ్ల నిర్వాహకుల సంఘం ప్రతినిధులు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ని కలిసారు. హాస్టళ్లకు నీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా సమస్య పరిష్కారానికి చొరవ చూపిన హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ కి హాస్టళ్ల యజమానుల సంఘం ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. జీవనోపాధి, విద్య, ఉద్యోగాల కోసం హైదరాబాద్‌కు వివిధ ప్రాంతాల నుంచి ఎంతోమంది వస్తున్నారని, నగరంలోని హాస్టళ్లలో వేలాది మంది ఉంటూ నీటి అవసరాల కోసం ట్యాంకర్ల సరఫరాపై ఆధారపడుతున్నారని వారు పేర్కొన్నారు. నీటి ట్యాంకర్ల సమ్మె కొనసాగితే హాస్టళ్లలో ఉంటున్నవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఉండేదని తెలిపారు. ఈ నేపథ్యంలో ట్యాంకర్ల యజమానులతో చర్చించి... నగరంలోని జనసాంద్రత అధికంగా ఉన్న ప్రాంతాల్లో భూగర్భ జలాలపై ఒత్తిడి పెరగకుండా, తక్కువ జనసాంద్రత కలిగిన ఫ్యూర్(పేరి అర్బన్ రీజియన్) ప్రాంతాల నుంచి నీటిని సేకరించి వ్యాపార కార్యకలాపాలు సాగించాలని ఎంతో దూర దృష్టితో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సూచించిన విషయాన్ని వాటర్ ట్యాంకర్ల యజమానులు దృష్టిలో పెట్టుకోవాలని కోరారు. ఈ సూచనతో ట్యాంకర్ల యజమానులు సమ్మె విరమించి నీటి సరఫరాలను పునరుద్ధరించేందుకు అంగీకరించడం హర్షణీయమని హాస్టళ్ల యజమానుల సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులు, ఉద్యోగులకు నీటి సరఫరా సమస్య తలెత్తకుండా పరిష్కార మార్గం చూపినందుకు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ కి వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

డ్రగ్స్, మాఫియా పాలన గుప్పిట్లో పంజాబ్

పంజాబ్ నేడు డ్రగ్స్, మాఫియా ఆగడాల కారణంగా తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది.

న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, నవంబర్ 4:

మాదకద్రవ్యాల మహమ్మారి కారణంగా ఎన్నో కుటుంబాలు తమ ఆ త్మ బ ం ధ ు వ ు ల ను కోల్పోయాయి. మరోవైపు పలువురు దారుణ హత్యలకు గురయ్యారు. సుఖ్‌విందర్ సింగ్, గుర్మేల్ సింగ్‌లు హత్యకు గురయ్యారు. తన కుమారుడిని చిట్టా మత్తు నుంచి కాపాడేందుకు ప్రకాశ్ చంద్



తనకున్నదంతా అమ్ముకున్నారు. డ్రగ్స్ మహమ్మారి కారణంగా తెహల్ సింగ్ తన ఇద్దరు కుమారులను కోల్పోయారు.

ఈ బాధిత కుటుంబాలను నేడు కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే , లోక్‌సభలో ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ కలిసి వారి బాధలను పంచుకున్నారు. పంజాబ్ ప్రజలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీ ఒక్కటే. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాష్ట్రం నుంచి డ్రగ్స్ మహమ్మారిని, మాఫియా పాలనను పూర్తిగా నిర్మూలించి, పంజాబ్‌ను సుభిక్షంగా, అభివృద్ధి పథంలో నడిపిస్తాం.

edited, Printed, Published and Owned by:Venkateshwarlu Rapolu # Flat No. 202, Nomula Chambers, E-Seva Road, TRT Seetaphalmandi, Sec'bad-61.Telangana. INDIA. www.trinetnews.com, Email: trinetnews2026@gmail.com (Telangana) Editor: Venkateshwarlu Rapolu, +91 98497 67747,9494184136